సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16 వెల: ₹ 5.00

సంపుటి: 12
సంచిక: 144

బుధవారం 14-8-2019

'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'

రిలయన్స్ గర్జన.. మార్కెట్ బేర్

స్టాక్‌మార్కెట్ 48 శాతం డౌన్. ఆరు నెలల కనిష్టానికి రూపాయి. -బిజినెస్‌లో

సిరీస్‌పై భారత్ గురి

నేడు వెస్టిండీస్‌తో టీమిండియా మూడో వన్డే - స్పోర్ట్స్‌లో

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

భ్రమల్లో బతకొద్దు..!

- కశ్మీర్‌పై స్వదేశీయులకు పాక్ విదేశాంగ మంత్రి ఖురేషీ హితవు
- అంతర్జాతీయ సమాజం పాక్‌తో కలసి రాదని వ్యాఖ్య
- ఐరాస మద్దతు కోసం కొత్తగా పోరాటం ప్రారంభించాలని సూచన

5 లో

"మీరు (ప్రజలు) భ్రమల్లో జీవించడం మానేయాలి. మీ కోసం ఐరాసలో పూలదండలు పట్టుకొని ఎవరూ సిద్ధంగా లేరు. అక్కడ మీ కోసం ఎవరూ ఎదురుచూడట్లేదు. ప్రపంచంలో ఒక్కో దేశానికీ ఒక్కో రకమైన ప్రయోజనం ఉంటుంది. కోట్లాది మంది జనాభా ఉన్న దేశం భారత్. చాలా దేశాలు అక్కడ భారీగా పెట్టుబడులు పెట్టాయి. ముస్లిం దేశాలు మన వెనుకే ఉంటాయని మనం అనుకుంటుంటాం. కానీ వారికీ భారత్‌తో ఆర్థిక ప్రయోజనాలు ఉన్నాయి. అందుకే ముస్లిం దేశాలూ కశ్మీర్ విషయంలో మనకు మద్దతు ఇవ్వకపోవచ్చు. అందుకే ఐరాస మద్దతు పొందేందుకు కొత్తగా పోరాటం ప్రారంభించాలి. - ఖురేషీ

2 కార్డులతో తిప్పలు

ఆరోగ్యశ్రీ కింద వైద్యం చేయడానికి ఆసుపత్రుల కొర్రీలు

- ఆరోగ్యశ్రీ, ఆహార భద్రత.. రెండు కార్డులూ ఉండాలని స్పష్టీకరణ
- ఏ ఒక్క కార్డు లేకున్నా వైద్యం చేయడానికి నిరాకరణ
- బకాయిలు పేరుకు పోవడంతోనే ఇలాంటి నిర్ణయమని విమర్శలు
- ఆసుపత్రుల తీరుతో 34 లక్షల మంది లబ్ధిదారులపై ప్రభావం

హైదరాబాద్‌కు చెందిన సావిత్రి కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. ఆరోగ్యశ్రీ కింద వైద్యం చేయించుకోవాలని ఓ ప్రైవేటు ఆసుపత్రిని ఆశ్రయించింది. ఆమె వద్ద తెల్లరేషన్‌కార్డు ఉండటంతో దాని కింద వైద్యం పొందొచ్చని భావించింది. కానీ తెల్లరేషన్ కార్డుతోపాటు ఆరోగ్యశ్రీ కార్డు ఉండాలని, లేకుంటే ఉచిత వైద్యం అందించలేమని కార్పొరేట్ ఆసుపత్రి వర్గాలు చేతులెత్తేశాయి.

సిద్దిపేట జిల్లాకు చెందిన చంద్రశేఖర్ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. అతడికి ఆరోగ్యశ్రీ కార్డుంది. కానీ ఆహారభద్రత కార్డు లేకపోవడంతో కేవలం ఆరోగ్యశ్రీ కార్డు కింద వైద్యం చేయలేమని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రివర్గాలు తేల్చి చెప్పాయి. దీంతో అతడు మూడు లక్షలు పోసి వైద్యం చేయించుకున్నాడు.

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆరోగ్యశ్రీని అమలు చేస్తున్నా.. కొన్ని ఆసుపత్రుల తీరుతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆరోగ్యశ్రీ, ఆహార భద్రత కార్డుల్లో ఏదో ఒక కార్డు ఉన్నప్పటికీ ఉచిత వైద్యానికి నోచుకోలేకపోతున్నారు. ఆరోగ్యశ్రీ కింద వైద్యం చేయించుకోవాలంటే అటు ఆరోగ్యశ్రీ కార్డుతోపాటు ఇటు ఆహార భద్రత కార్డు లేదా తెల్ల రేషన్ కార్డు తప్పనిసరి అని కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు స్పష్టంచేస్తున్నాయి. ఈ రెండింటిలో ఏ ఒక్కటి మిగతా 2వ పేజీలో ▶

77 లక్షలు ఆరోగ్యశ్రీ కార్డులు ఉన్న కుటుంబాలు

88 లక్షలు ఆహార భద్రత కార్డులు ఉన్న కుటుంబాలు

11 లక్షలు ఆరోగ్యశ్రీ కార్డున్నా ఆహార భద్రత కార్డు లేని కుటుంబాలు



టీ-హబ్‌లో వెయిటింగ్ లిస్ట్

- టీ-హబ్ నాలుగేళ్ల ప్రస్థానంలో 450 కంపెనీలు హిట్
- స్టార్టప్‌లకు స్వర్గధామం టీ-హబ్
- ప్రపంచ ఐటీ విపణిలో హైదరాబాద్ జెట్ స్పీడ్
- కోట్ల వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించిన 12 సంస్థలు
- ఐటీ, బీపీవో, కేపీవో, ఆర్థిక, బీమా కంపెనీలే అత్యధికం

టీ-హబ్ ఫుల్

సాక్షి, హైదరాబాద్

టీ-హబ్ అంకుర పరిశ్రమలకు స్వర్గధామంగా మారింది. అద్భుతాలకు వేదిక అయింది. స్టార్టప్స్ స్పీడప్ అయ్యాయి. లోకల్ అంకుర పరిశ్రమలు గ్లోబల్ స్థాయిని అందుకున్నాయి. ప్రపంచ ఐటీ విపణిలో తనదైన వాటాను సొంతం చేసుకున్నాయి. హైదరాబాద్‌లోని టీ-హబ్‌లో ఏటా సరాసరి వంద స్టార్టప్ కంపెనీలు పురుడు పోసుకుంటున్నాయి. సాంకేతిక ఫలాలను ప్రజలకు మరింత చేరువ చేయడం, ఐటీ, బ్యాంకింగ్, సేవా, బీపీవో, కేపీవో, ఇన్సూరెన్స్ రంగాల్లో వినియోగదారులకు అందించే సేవలను అత్యంత సరళతరం చేయడం ద్వారా టీ-హబ్ అద్భుతాలు సృష్టిస్తోంది. విదేశీ మారకద్రవ్యాన్ని భారీస్థాయిలో ఆర్జించడం ద్వారా ఉపాధి, వాణిజ్య రంగాల్లో శరవేగంగా పురోగమిస్తోంది. నాలుగేళ్ల టీ-హబ్ ప్రస్థానంలో సుమారు 450 కంపెనీలు ఇక్కడే 'ఇంతింతై వటుడింతై'అన్న చందంగా ఎదిగి కోట్లాది రూపాయల టర్నోవర్ సాధించినట్లు టీ-హబ్ వర్గాలు 'సాక్షి'కి తెలిపాయి. సుమారు 70 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో వెలిసిన ఈ భవనంలో ప్రస్తుతం 170 అంకుర పరిశ్రమలు పనిచేస్తున్నాయి. వీటిల్లో 870 మంది సాంకేతిక నిపుణులు తమ మేధస్సు, సృజనకు పదును పెడుతుండటం విశేషం. ఇందు లో అంకుర పరిశ్రమ ఏర్పాటు చేయాలనుకునే ఔత్సాహికులు మరో ఏడాది పాటు నిరీక్షించే పరిస్థితి నెలకొంది.

టీ-హబ్ గురించి సంక్షిప్తంగా..

అంకుర పరిశ్రమలను ఏర్పాటు చేయాలనుకునే నిపుణులను, కార్పొరేట్ కంపెనీలను, పెట్టుబడిదారులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి నూతన మిగతా 2వ పేజీలో ▶

డిగ్రీలో స్పాట్ అడ్మిషన్లు..

- షెడ్యూల్ ప్రకటించిన దోస్త్
- ఇప్పటివరకు ప్రవేశాలు పొందిన 1,74,239 మంది
- చివరి దశలో ఆప్షన్లు ఇచ్చుకున్న 16 వేల మంది
- నేడు చివరి దశ సీట్ల కేటాయింపు..
- 15, 16 తేదీల్లో కాలేజీల్లో రిపోర్టింగ్
- మిగిలిన సీట్లకు నేటి నుంచి స్పాట్ అడ్మిషన్లు

- వివరాలు 4లో

1,351 పోస్టులకు ఎస్ఎస్‌సీ నోటిఫికేషన్

సాక్షి, హైదరాబాద్: స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ)లో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. కేంద్రంలోని పలు శాఖలు/ విభాగాలు/ సంస్థల కోసం 230 కేటగిరీలకు చెందిన దాదాపు 1,351 ఖాళీల భర్తీకి సిద్ధమైంది. ఎస్ఎస్‌సీ కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీఈ) పద్ధతిలో ఉద్యోగాల భర్తీ చేయనుంది. అర్హులైన అభ్యర్థులు కమిషన్ వెబ్‌సైట్ ssc.nic.in ద్వారా 2019 ఆగస్టు 31న సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఎస్సీ/ఎస్టీ/ఈఎస్ఎం/పీడబ్ల్యూడీ (వోహెచ్/హెచ్‌హెచ్/వీహెచ్/ఇతరులు) కేటగిరీలకు చెందిన మహిళా అభ్యర్థులందరికీ ఫీజు మినహాయింపు ఉంది. వివరాలకు కమిషన్ వెబ్‌సైట్ ssc.nic.inతో పాటు సదరన్ రీజనల్ ఆఫీస్ వెబ్‌సైట్ sscsr.gov.inలో సంప్రదించాలి. సంబంధిత పరీక్ష 2019 అక్టోబర్ 14 నుంచి 2019 అక్టోబర్ 18 మధ్య నిర్వహించే అవకాశం ఉంది.

రాష్ట్రంలో సీపీఎస్ ఉద్యోగులు 1,49,764 మంది

ఆర్టీఐ కింద వెల్లడించిన పీఎఫ్ఆర్‌డీఏ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 1,49,764 మంది కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) ఉద్యోగులున్నట్లు పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్‌డీఏ) వెల్లడించింది. సీపీఎస్ ఉద్యోగుల లెక్క విషయంలో స్పష్టత లేదు. కొన్ని సంఘాలు లక్ష మంది ఉంటారని పేర్కొంటే మరికొన్ని సంఘాలు 1.20 లక్షల మంది ఉంటారని చెబుతూ వచ్చాయి. అయితే 2004 సెప్టెంబర్ 1 నుంచి ఇప్పటివరకు నియమితులైన ఉద్యోగులు 1,49,764 మంది ఉన్నట్లు ఇనపనూరి రంజిత్‌కుమార్ అనే పౌరుడు ఆర్టీఐ కింద చేసిన దరఖాస్తుకు పీఎఫ్ఆర్‌డీఏ వెల్లడించింది.

వరంగల్ ఆర్టీసీ బస్టాండ్‌లో సుజాత, ఆమె ఒడిలో బాబు

'అమ్మ'కానికి పసిబిడ్డ

మద్యం మత్తులో కుమారుడి విక్రయానికి తల్లి యత్నం

సీడబ్ల్యూసీ అధికారులకు తల్లీబిడ్డల అప్పగింత

కాజీపేట అర్బన్: కంటికి రెప్పలా కాపాడాల్సిన తల్లే మద్యం మత్తులో ఎనిమిది నెలల బాబును వెయ్యి రూపాయలకు విక్రయించేందుకు యత్నించింది. ఈ ఘటన వరంగల్ అర్బన్ జిల్లాలోని వరంగల్ బస్టాండ్‌లో మంగళవారం చోటుచేసుకుంది. జనగామ జిల్లా పెంబర్తిలోని ఓ హోటల్‌లో పనిచేస్తూ సహజీవనం సాగిస్తున్న పెన్నింటి లింగం, సుజాతలకు ఎనిమిది నెలల క్రితం ఓ బాబు పుట్టాడు. అప్పటికే లింగంకు మరో మహిళతో వివాహం జరగగా వారికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉంది. ఈ క్రమంలో సుజాత, లింగంల మధ్య తరచూ గొడవలు జరుగుతుండగా సుజాత మద్యానికి బానిసైంది. ఆదివారం అతిగా మద్యం సేవించడంతో సుజాతపై లింగం చేయి చేసుకున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన సుజాత సోమవారం పెంబర్తి రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కి వరంగల్ రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. ఆ తర్వాత స్టేషన్ ఎదురుగా ఉన్న బస్టాండ్‌కు చేరుకున్న ఆమె మద్యం మత్తులో నిద్రించగా 8 నెలల బాబు ఏడుస్తున్నా పట్టించుకోలేదు. రెండ్రోజులుగా చంటి బిడ్డతో బస్టాండ్‌లో ఉన్న సుజాతను అక్కడ గస్తీ కాస్తున్న పోలీసు సిబ్బంది గమనిస్తూనే ఉన్నారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఆమె తన బాబును రూ. వెయ్యికి విక్రయించేందుకు యత్నిస్తుండగా వారు అడ్డుకుని సీడబ్ల్యూసీ అధికారులకు అప్పజెప్పారు. సీడబ్ల్యూసీ అధికారులు ఐసీపీఎస్ అధికారుల సౌజన్యంతో హన్మకొండలోని బాలరక్ష భవన్‌కు సుజాత, బాబును తరలించారు. రెండేళ్లుగా సహజీవనం చేస్తున్న సుజాత, లింగంలను బాలరక్ష భవన్‌లో ఒక్కటి చేశారు. కాగా, సుజాత తన బిడ్డను అమ్మకానికి పెట్టడం అవాస్తవమని ఇంతేజార్‌గంజ్ సీఐ శ్రీధర్ చెప్పారు.



ఇదంతకత్

పూర్వ వైభవం అంటే గతంలో ఓడినట్లు కాదయ్యా!

'శ్రీరామ' కనవేమిరా..

16 టీఎంసీలకే పరిమితమైన ఎస్సారెస్పీ..

- బోసిపోతున్న జలాశయం.. మహారాష్ట్ర ప్రాజెక్టుల్లోనూ అంతంతే నీటిమట్టం
- 'పునరుజ్జీవం'పైనే ఆయకట్టు రైతుల ఆశలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఒకవైపు కృష్ణమ్మ ఉరకలెత్తుతుంటే.. మరోవైపు, గోదారమ్మ వెలవెలబోతోంది. భారీ ప్రవాహం నాగార్జునసాగర్ గేట్లను దాటి కిందికి దూకుతుంటే.. వరదల కోసం శ్రీరాంసాగర్ జలాశయం వేచి చూస్తోంది. ఈ వర్షాకాలం సీజన్‌లో రెండు నెలల్లో రాష్ట్రంలోని అన్ని జలాశయాలు నిండుకుండలా మారితే.. ఉత్తర తెలంగాణ వరప్రదాయినిగా పేరున్న ఎస్సారెస్పీ బోసిపోయింది. వారం క్రితం వరకు డెడ్ స్టోరేజీలోనే ఉండి పోయింది. ఇటీవల కురిసిన వర్షాలకు కాస్త వరద వచ్చి చేరడంతో ప్రస్తుతం ప్రాజెక్టు నీటిమట్టం 16.47 టీఎంసీలకు చేరింది. ఎస్సారెస్పీ పూర్తిస్థాయి నీటి మట్టం 1,091 అడుగుల (90 టీఎంసీలు)కు గాను.. ప్రస్తుతం 1,062 అడుగుల (16.47 టీఎంసీ) మేర నీరు నిల్వ ఉంది.

వారం క్రితం వరకు డెడ్ స్టోరేజీనే..

వారం క్రితం వరకు ఎస్సారెస్పీ డెడ్ స్టోరేజీకే పరిమితం కావడం ఆయకట్టు రైతుల్లో ఆందోళనకు గురి చేసింది. ఈ నెల 2న ఐదు టీఎంసీలే ఉండగా వారం రోజులుగా ప్రాజెక్టు క్యాచ్‌మెంట్ ఏరియాలో కురిసిన భారీ వర్షాలకు 11.43 టీఎంసీల నీరు వచ్చి చేరింది. నాలుగు రోజుల క్రితం 40 వేల క్యూసెక్కుల వరద రావడంతో పరిస్థితి ఆశాజనకంగా మారిందని అందరూ భావించారు. కానీ రెండు రోజుల నుంచి ఇన్‌ఫ్లో తగ్గిపోయింది. ప్రస్తుతం రెండు వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నిలకడగా ఉంది.

ఎగువ ప్రాజెక్టులదీ ఇదే పరిస్థితి..

శ్రీరాంసాగర్ ఎగువన మహారాష్ట్ర పరిధిలో ఉన్న ప్రాజెక్టులదీ ఇదే పరిస్థితి. 102 టీఎంసీల సామర్థ్యం కలిగిన గైక్వాడ్ ప్రాజెక్టు (ఔరంగాబాద్ జిల్లా) ఇంకా నిండలేదు. అక్కడ 95 టీఎంసీల మేర నీరు చేరింది. అలాగే, విష్ణుపురి (2.7 టీఎంసీ)లో పది శాతం కూడా లేవు. బాబ్లీ ప్రాజెక్టులోనూ నీళ్లు లేవు. దీంతో ఎగువన ఔరంగాబాద్, లాతూర్, జాల్నా, నాందేడ్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసి.. పెద్ద ఎత్తున వరద పోటెత్తితేనే ఎస్సారెస్పీ నిండుతుంది. అలాగే, తెలంగాణలోని క్యాచ్‌మెంట్ ఏరియా నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురిస్తే వరద పెరిగే అవకాశాలున్నాయి.



వెలవెలబోతున్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

పునరుజ్జీవంపైనే ఆశలు..

వరద జలాల రాక ఆశాజనకంగా కనిపించకపోవడంతో ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం (రివర్స్ పంపింగ్)పైనే ఆయకట్టు రైతులు ఆశలు పెట్టుకున్నారు. ఈ పథకాన్ని 2, 3 రోజుల్లో సీఎం కేసీఆర్ ప్రారంభించే అవకాశాలున్నాయి. రివర్స్ పంపింగ్ ద్వారా కనీసం 35 టీఎంసీలు నీళ్లు నింపితే ఆయకట్టుకు సాగునీరు ఇవ్వొచ్చని భావిస్తున్నారు. ఇటీవల నీటి పారుదలశాఖ శివం (స్టేట్ లెవల్ కమిటీ ఇంటిగ్రేటెడ్ వాటర్ మేనేజ్‌మెంట్) సమావేశం హైదరాబాద్‌లో జరిగింది. ఎస్సారెస్పీ స్టేజ్-1 పరిధిలోని నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లోని ఆయకట్టుకు ఏడు తడుల్లో సాగునీటిని విడుదల చేయాలని సూచనప్రాయంగా నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు.

క్లుప్తంగా...

రాష్ట్ర గిరిజన సలహా మండలి ఏర్పాటు

ఆసిఫాబాద్: రాష్ట్ర గిరిజన సలహా మండలి ఏర్పాటైంది. దీనికి సంబంధించిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. మొత్తం 20మంది సభ్యులతో సలహా మండలి ఏర్పాటు చేశారు. చైర్మన్‌గా సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను నియమించారు. సభ్యులుగా ఎంపీ సోయం బాపురావుతోపాటు ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు, ఖానాపూర్ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ నియమితులయ్యారు. అధికార సభ్యులుగా గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి, ఎస్సీ, ఎస్టీ సంచాలకులు, గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థ సంచాలకులు, గిరిజన ఎంపీ, గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్, ఇద్దరు ఎంపీలు, ఎమ్మెల్సీతో పాటు 12 మంది ఎమ్మెల్యేలు ఉంటారు. 2019 ఆగస్టు 8 నుంచి మూడేళ్లపాటు గిరిజన సలహా మండలి కొనసాగనుంది.

త్వరలో పునరుజ్జీవ పంప్ హౌస్‌ల పరిశీలనకు సీఎం

సాక్షి, హైదరాబాద్: ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకంలో భాగంగా కొనసాగుతున్న రాంపూర్, రాజేశ్వర్ రావు పేట పంప్ హౌస్‌ల నిర్మాణ పనుల పురోగతిని మూడు నాలుగు రోజుల్లో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు పరిశీలిస్తారని కాళేశ్వరం ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లు వెల్లడించారు. రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్‌లో ఇప్పటికే ట్రయల్‌రన్ నిర్వహించిన పంపుల పనితీరును సైతం సీఎం పరిశీలించే అవకాశం ఉందని మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బాహుబలి మోటార్లను బుధవారం నుంచి ప్రారంభిస్తారని వార్తా పత్రికల్లో వచ్చిన వార్తలు అవాస్తవమన్నారు. జూన్ 21న కాళేశ్వరం ప్రాజెక్టును గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్, తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రులు కేసీఆర్, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలు ప్రారంభించారని, ఆరోజే బ్యారేజీలు, పంప్ హౌస్‌ల వద్ద మంత్రులు ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు.

గోపాలన్‌కు లివింగ్ లెజెండ్ అవార్డు

సాక్షి, హైదరాబాద్: దేశ పౌష్టికాహార రంగం భీష్మ పితామహుడిగా పరిగణించే కొళత్తూర్ గోపాలన్‌ను ఫెడరేషన్ ఆఫ్ ఏషియన్ న్యూట్రిషన్ సొసైటీ.. ప్రతిష్టాత్మక 'ఫాన్స్-లివింగ్ లెజెండ్'అవార్డుకు ఎంపిక చేసింది. ఇండోనేసియాలోని బాలీలో జరిగిన 13వ ఏషియన్ కాంగ్రెస్ ఆఫ్ న్యూట్రిషన్ సదస్సులో ఆయనకు ఈ అవార్డును ప్రకటించినట్లు జాతీయ పోషకాహార సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. భారత వైద్య పరిశోధన సంస్థ, హైదరాబాద్‌లోని జాతీయ పోషకాహార సంస్థల మాజీ డైరెక్టర్ గోపాలన్.. గతేడాది వందేళ్లు పూర్తి చేసుకున్నారు. 1970ల్లో మొదలైన ఐసీడీఎస్‌తోపాటు, బాలల్లో అంధత్వాన్ని నివారించేందుకు విటమిన్-ఏ టీకాలు వేయడం వరకు అనేక పోషకాహార సంబంధిత కార్యక్రమాలకు గోపాలన్ శ్రీకారం చుట్టారు. 1974-79 మధ్యకాలంలో ఐసీఎంఆర్ డైరెక్టర్‌గా పనిచేసిన గోపాలన్ ఆ తర్వాత న్యూట్రిషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా పేరుతో ఓ సంస్థను ఏర్పాటు చేశారు.

ప్రతిభ కనరిచిన సిబ్బందికి హోం మంత్రి పతకం

సాక్షి, న్యూఢిల్లీ: నేరాల దర్యాప్తులో ఉన్నత ప్రమాణాలు కనబరిచిన 96 మంది సిబ్బందికి 'దర్యాప్తులో అత్యుత్తమ ప్రతిభకు కేంద్ర హోం మంత్రి పతకం' లభించింది. 2018 నుంచి ఇస్తున్న ఈ పతకాలు ఈసారి పలువురు తెలుగు వారికి దక్కాయి. 96 మందిలో 15 మంది సీబీఐ అధికారులు, 11 మంది మహారాష్ట్ర పోలీసులు, 10 మంది యూపీ, 9 మంది కేరళ, 8 మంది మధ్యప్రదేశ్‌లకు చెందిన పోలీసులుండగా.. ఢిల్లీ, కర్ణాటకల నుంచి ఆరుగురి చొప్పున పోలీసులున్నారు. ఏపీ పోలీసు విభాగం నుంచి ఇన్‌స్పెక్టర్ జె.శివ నారాయణ, ఏఎస్ఐ ఎస్.స్వామి దాస్ ఉన్నారు. తెలంగాణ పోలీసు విభాగం నుంచి ఏసీపీ ఏవీఆర్ నర్సింహారావు, ఏసీపీ ఎస్.మోహన్‌కుమార్ ఉన్నారు. సీబీఐ నుంచి తెలుగు అధికారి డీఎస్పీ బండి పెద్దిరాజు ఈ పతకం పొందారు.

జ్ఞానపీఠ్ సలహా కమిటీ కన్వీనర్‌గా సుబ్బారావు

సాక్షి, న్యూఢిల్లీ: భారతీయ జ్ఞానపీఠ్ తెలుగు భాషా సలహా కమిటీ కన్వీనర్‌గా ప్రముఖ సాహితీవేత్త చందూ సుబ్బారావు నియమితులయ్యారు. కమిటీ సభ్యులుగా సీనియర్ జర్నలిస్టు, ఆంధ్రజ్యోతి అసోసియేట్ ఎడిటర్ ఎ.కృష్ణారావు, రచయిత వెన్నా వల్లభ్‌రావు నియమితులయ్యారు. వచ్చే 3 సంవత్సరాలకు జ్ఞానపీఠ్, మూర్తిదేవి పురస్కారాల గ్రహీతలను ఎంపిక చేసేందుకు జ్ఞానపీఠ్ సంస్థ భాషల వారీగా కమిటీలను ఏర్పాటు చేసింది.

ఏపీ పాత డీజీపీ ఆఫీసుకు విజిలెన్స్ కార్యాలయం

సాక్షి, హైదరాబాద్: బీఆర్కే భవన్‌లో ఉన్న విజిలెన్స్ ఆఫీసును ఏపీ పాత డీజీపీ కార్యాలయంలోకి మార్చారు. సిటీ-1, సిటీ-2కు సంబంధించిన కార్యాలయాలు ఏసీబీ ఆఫీసు రెండో ఫ్లోర్‌లోకి మారాయి. సచివాలయాన్ని బీఆర్కే భవన్‌కు మార్చిన నేపథ్యంలో అక్కడున్న విజిలెన్స్ కార్యాలయాన్ని తరలించారు.

నీళ్లు కట్.. హెయిర్ కట్

నీటి కొరత సాకుతో 'మెదక్'లో ఓ ప్రిన్సిపాల్ నిర్వాకం

మెదక్ జోన్: గురుకులంలో నీటి ఎద్దడి ఉందనే సాకుతో ఓ ప్రిన్సిపాల్ విద్యార్థినుల జుట్టు కత్తిరింపజేసిన ఉదంతం మెదక్ జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మెదక్ పట్టణంలోని మినీ గురుకులంలో ఒకటి నుంచి ఆరో తరగతి వరకు 180 మంది విద్యార్థినులు విద్యాభ్యాసం సాగిస్తున్నారు. అక్కడే హాస్టల్ సౌకర్యం కూడా ఉంది. వసతి గృహానికి నీటిని సరఫరా చేసే బోరుబావి గత ఏప్రిల్‌లో ఎండిపోయింది. దీంతో నీటి సమస్య తీవ్రంగా మారింది. మూడ్రోజులకోసారి రూ.600 వెచ్చించి ట్యాంకర్ ద్వారా నీటిని తెప్పిస్తున్నారు. ఈ క్రమంలో విద్యార్థినుల తల వెంట్రుకలు పెద్దగా ఉండడంతో నీటి ఖర్చు అధికమవుతుందని భావించిన ప్రిన్సిపాల్ అరుణారెడ్డి అటు తల్లిదండ్రులకు గానీ ఇటు పాఠశాల కమిటీకి గానీ ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే ఈనెల 9న విద్యార్థినుల జుట్టు కత్తిరింపజేసి వాటిని విక్రయించారు. విషయం బయటికి పొక్కడంతో మరుసటి రోజు కొంతమంది విద్యార్థినుల తల్లిదండ్రులు గురుకులం వద్దకు చేరుకుని ఆందోళన చేశారు. దీంతో ప్రిన్సిపాల్ తమ సిబ్బందిపై దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో మంగళవారం మరి కొంతమంది విద్యార్థినుల తల్లిదండ్రులు గురుకులానికి చేరుకుని సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఇంత జరుగుతున్నా ప్రిన్సిపాల్ గది నుంచి బయటికి రాలేదు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని నచ్చజెప్పి పంపించారు. ఈ విషయమై ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా నీటి సమస్య ఉందని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని తెలిపారు.

సింగూరు.. నో నీరు!

ప్రాజెక్టులో నీటి నిల్వ 0.463 టీఎంసీలు మాత్రమే..

జోగిపేట(అందోల్): ఓ వైపు రాష్ట్రంలోని ప్రాజెక్టులు నిండుకుండలను తలపిస్తుంటే సంగారెడ్డి జిల్లాలోని సింగూరు ప్రాజెక్టు మాత్రం నీరు లేక వెలవెలబోతోంది. సింగూరు ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 30 టీఎంసీలు కాగా ప్రస్తుతం అందులోని నిల్వ 0.463 టీఎంసీలు మాత్రమే. మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల్లో కురిసిన వర్షాల ఆధారంగా ప్రాజెక్టులోకి నీరు వస్తుంది. అయితే మహారాష్ట్రలో భారీ వర్షాలు కురిసినా మంజీరా గోదావరి బేసిన్‌లోకి నీరు చేరలేదు. ఇక్కడ నుంచి 300 కి.మీ దూరంలో ఉన్న అక్కడి మంజీరా ప్రాజెక్టు పరిస్థితి కూడా సింగూరు ప్రాజెక్టులాగే ఉంది. గోదావరి బేసిన్‌లో 4 వేల క్యూసెక్కుల నీరుంటే, కృష్ణా బ్యారేజీలో 6 లక్షల క్యూసెక్కులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. మహారాష్ట్రలోని బాలఘాట్ ద్వారా మంజీరాలోకి నీరు వస్తుంది. లాతూర్, కర్ణాటకలోని బీదర్ జిల్లాలో వర్షాలు కురిస్తేనే సింగూరులోకి నీరొచ్చే అవకాశం ఉంది. జహీరాబాద్ నారింజ ప్రాజెక్టు కింద ఉన్న కారింజ ప్రాజెక్టు ద్వారా కూడా ప్రాజెక్టులోకి నీరు చేరే అవకాశం ఉంది. 2018 నవంబర్‌లో సింగూరు ప్రాజెక్టు నుంచి ఎస్సారెస్పీకి 13.50 టీఎంసీల నీరు వదిలిన విషయం విదితమే. ఏదేమైనా సింగూరు ప్రాజెక్టులోకి నీరు ఎప్పుడెప్పుడు వచ్చి చేరుతుందా..? అని ఈ ప్రాంత రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

పీహెచ్‌సీ స్థాయిలో మానసిక వైద్యం

- వైద్య ఆరోగ్యశాఖ నిర్ణయం.. త్వరలో పైలట్ ప్రాజెక్టు
- దేశవ్యాప్తంగా పెరుగుతున్న మానసిక రోగుల సంఖ్య
- దేశంలో 13.7 శాతం మానసిక రోగులున్నట్లు అంచనా

సాక్షి, హైదరాబాద్: దేశంలో మానసిక రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. దీంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ) స్థాయి నుంచి కూడా మానసిక రోగులకు వైద్యం అందించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ నిర్ణయించింది. ఇటీవల ఢిల్లీలో మానసిక ఆరోగ్య చట్టానికి సంబంధించి ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ రాష్ట్రాలతో సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఎర్రగడ్డలో ఉన్న మానసిక చికిత్సాలయంలోనూ మానసిక రోగులకు చికిత్స చేస్తున్నారు. అది కూడా అత్యంత తీవ్రమైన స్థాయికి వచ్చాకే జరుగుతోంది. కానీ మానసికంగా వివిధ స్థాయిలో ఉన్న వారికి స్థితిని బట్టి చికిత్స చేసే పరిస్థితి లేదు. కాబట్టి పీహెచ్‌సీల్లో కూడా మానసిక రోగులకు చికిత్స అందించేలా ప్రణాళిక రచించాలని వైద్య ఆరోగ్య శాఖ నిర్ణయించింది. అందుకు కొందరికి ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. ముందుగా అన్ని పీహెచ్‌సీల్లో కాకుండా పైలట్ ప్రాజెక్టుగా కొన్ని చోట్ల ఏర్పాటు చేస్తామని వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శాంతికుమారి 'సాక్షి'కి తెలిపారు.

13.7 శాతం మానసిక రోగులు..

ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఛిన్నాభిన్నం కావడం, ఒంటరి బతుకు పోరాటం చేయడం.. చాలీచాలని జీతాలతో బతకడం.. పెళ్లిళ్లు, శుభకార్యాలకు వెళ్లలేకపోవడం.. ఇలా అనేక కారణాలతో చాలామంది మానసికంగా బాధపడుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వచనం ప్రకారం ఆరోగ్యమంటే.. ఆర్థికంగా, సామాజికంగా, మానసికంగా పటిష్టంగా ఉండటం. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. బెంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్ శాస్త్రవేత్తలు.. 12 రాష్ట్రాల్లో మానసిక ఆరోగ్యంపై సర్వే నిర్వహించారు. కేరళ, రాజస్థాన్, పంజాబ్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, అసోం, మణిపూర్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో సర్వే చేశారు. ఈ సర్వే ప్రకారం 13.7 శాతం మంది వివిధ రకాల మానసిక సమస్యలతో బాధపడుతున్నారు. అందులో 1.9 శాతం మంది తీవ్రమైన మానసిక రోగులుగా ఉన్నారు. 13-17 ఏళ్ల వయసున్న పిల్లలు 7.3 శాతం మానసిక సమస్యలతో బాధపడుతున్నారు. అంటే దాదాపు 90.8 లక్షల మందికి మానసిక చికిత్స అవసరమని జాతీయ మానసిక సంస్థ అంచనా వేసింది. మొత్తంగా దేశంలో 15 కోట్ల మంది మానసిక అంశాలపై జోక్యం చేసుకోవాల్సి ఉంటుందని సర్వే చెప్పినట్లు వైద్యాధికారులు అంటున్నారు. మానసిక సమస్యలతో బాధపడే వారిలో గ్రామాల కంటే పట్టణాల్లోనే రెండు మూడు రెట్లు అధికంగా ఉన్నట్లు తేలింది. అందువల్ల పట్టణాల్లో ప్రత్యేకంగా మానసిక చికిత్సాలయాలు మరిన్ని ఏర్పాట్లు చేయాల్సి ఉంది. డిప్రెషన్, ఆతృత వంటి మానసిక సమస్యలతో బాధపడేవారు 10 శాతం ఉన్నారని, ఈ కారణంగా బీపీ, మధుమేహం వంటి ఇతర వ్యాధులు వస్తున్నట్లు తేలింది.

ఒక శాతం మందిలో అలా..

జనాభాలో మానసిక ఆందోళనతో బాధపడేవారిలో ఒక శాతం మంది ఆత్మహత్య చేసుకోవాలన్న భావనకు వెళ్తున్నారు. అందులో 1.7 శాతం మంది పట్టణాలు, నగరాల్లో ఉంటున్నారు. 1.5 శాతం మంది విడాకులు తీసుకున్నారు. తక్కువ ఆదాయం కలిగిన వారిలో 1.5 శాతం మంది ఆత్మహత్య చేసుకోవాలన్న భావనతో ఉంటున్నారు. 40-49 వయసు గల వారిలో ఆత్మహత్య చేసుకోవాలన్న భావన ఉన్నట్లు తేలిందని నిపుణులు అంటున్నారు.

2 కార్డులతో తిప్పలు

▶ మొదటి పేజీ తరువాయి

లేకపోయినా వైద్యం చేయడానికి నిరాకరిస్తున్నాయి. దీంతో ఉచిత వైద్యం చేయించుకోవాలనే పేదలకు ఆరోగ్యశ్రీ అక్కరకు రాకుండా పోతోంది. ఈ విషయంపై ఆరోగ్యశ్రీ ట్రస్టుకు కూడా అనేక ఫిర్యాదులు వస్తున్నట్లు సమాచారం. అయితే ఆరోగ్యశ్రీ కార్డులున్న కుటుంబాలు, ఆహార భద్రత కార్డులున్న కుటుంబాలను ఒకసారి క్షుణ్ణంగా పరిశీలించి ఉమ్మడిగా మరో కార్డు ఇవ్వాలని గతంలో ట్రస్టు భావించినట్టు తెలిసింది. కానీ తర్వాత ఆ ఆలోచనను ఉపసంహరించుకుంది. అయినప్పటికీ ప్రైవేటు ఆస్పత్రులు మాత్రం రెండు కార్డులూ ఉండాల్సిందేనని కొర్రీలు పెడుతున్నాయి. ప్రభుత్వం తమకు దాదాపు రూ.వెయ్యి కోట్లకు పైగా బకాయి పడినందున ఈ నెల 16 నుంచి సమ్మెకు వెళ్లాలని నెట్‌వర్క్ ఆసుపత్రులు నిర్ణయించిన సంగతి తెలిసిందే. బకాయిలు పేరుకుపోయిన నేపథ్యంలోనే ఆసుపత్రులు ఇలా రెండు కార్డులు కావాలని కొర్రీలు పెడుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఉచిత వైద్యానికి లక్షలాది మంది దూరం...

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఆ సమయంలో ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేశారు. ఆ తర్వాత ఆ పథకం ఇప్పటివరకు ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగింది. ప్రస్తుతం తెలంగాణలో 330 నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు అందుతున్నాయి. ఇందుకోసం ప్రభుత్వం ఏటా రూ.800 కోట్లు ఖర్చు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం 77.19 లక్షల కుటుంబాలకు ఆరోగ్యశ్రీ కార్డులు ఉండగా.. 87.89 లక్షల కుటుంబాలకు ఆహార భద్రత కార్డులున్నాయి. అంటే 10.70 లక్షల కుటుంబాలకు ఆరోగ్యశ్రీ కార్డులు ఉన్నప్పటికీ, ఆహార భద్రత కార్డులు లేవు. ప్రైవేటు ఆస్పత్రుల తీరుతో ఇలాంటివారికి ఇబ్బందులు తప్పడంలేదు. పౌరసరఫరాల లెక్కల ప్రకారం ఒక్కో కుటుంబం కింద సరాసరి 3.20 మంది సభ్యులున్నారు. అంటే ఆహార భద్రత కార్డులు లేని కారణంగా దాదాపు 34 లక్షల మంది ఆరోగ్యశ్రీ లబ్దిదారులకు వైద్య సేవలు అందడం లేదు. అయితే, ఏ ఒక్క కార్డు ఉన్నా వైద్యం చేయడానికి అంగీకరించాలని తాము స్పష్టంచేసినట్టు వైద్య, ఆరోగ్యశాఖ వర్గాలు చెబుతున్నాయి. గతంలో రెండు కార్డులకూ లింక్ పెట్టాలని అనుకున్నా.. తర్వాత దాన్ని ఉపసంహరించుకున్నామని తెలిపాయి.

సీఎం కార్యాలయ లెటరే దిక్కు...

ఆరోగ్యశ్రీ, ఆహార భద్రత కార్డుల్లో ఏదో ఒకటి మాత్రమే ఉన్న పేదలకు ఉచిత వైద్యం అందాలంటే ఇప్పుడు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ప్రత్యేకంగా లేఖలు తీసుకోవాల్సిందే. ఈ లేఖలు ఇవ్వడం కోసం సీఎం క్యాంపు కార్యాలయం వద్ద ఒక కౌంటర్ కూడా ఏర్పాటు చేశారు. తొలుత ఆరోగ్యశ్రీ కింద వైద్యం చేయించుకోవాలనే పేదలు తమ వద్దనున్న కార్డును ఆసుపత్రికి చూపించాలి. ఆసుపత్రి వర్గాలు రోగం, అందుకయ్యే వ్యయం వివరాలతో కూడిన లెటర్ ఇస్తాయి. ఆ లేఖను తీసుకెళ్లి సీఎం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో ఇవ్వాలి. వారు దాన్ని పరిశీలించిన తర్వాత ఆరోగ్యశ్రీ కింద వైద్యానికి అనుమతి ఇస్తున్నారు. ఇదంతా పెద్ద ప్రహసనంగా ఉండటంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ సమస్యపై దృష్టి సారించి ఆయా ఆస్పత్రులకు స్పష్టమైన ఆదేశాలివ్వాలని పలువురు కోరుతున్నారు.

ఆ పన్ను వెనక్కి!

- అంతర్జాతీయ విమానాశ్రాయాల్లోని రిటైల్ ఔట్‌లెట్లపై జీఎస్టీ ఎత్తివేత
- విదేశీయులకు అమ్మిన వస్తువులకు మాత్రమే వర్తింపు
- సీజీఎస్టీ తిరిగి ఇచ్చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ విమానాశ్రాయాల్లోని రిటైల్ ఔట్‌లెట్లపై వస్తుసేవల పన్ను (జీఎస్టీ) ఎత్తేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఔట్‌లెట్లలో విదేశీయులకు వస్తువులు అమ్మినందుకు డీలర్లు చెల్లించే కేంద్ర జీఎస్టీని తిరిగి డీలర్లకు ఇచ్చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. విదేశీ ప్రయాణికులు, ఆరు నెలల కన్నా తక్కువ కాలం దేశంలో ఉండే ప్రయాణికులు కొనుగోలు చేసే వస్తువులకు మాత్రమే ఈ నిబంధన వర్తిస్తుందని ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు.

మొదట కట్టాల్సిందే!

దేశంలోని చారిత్రక, పర్యాటక ప్రదేశాల సందర్శనార్థం వేల సంఖ్యలో విదేశీయులు వస్తుంటారు. వీరంతా తిరుగు ప్రయాణంలో అంతర్జాతీయ విమనాశ్రాయాల్లో ఉన్న రిటైల్ ఔట్‌లెట్లలో వస్తువులు కొనుగోలు చేస్తుంటారు. ఈ వస్తువులపై విదేశీ ప్రయాణికుల నుంచి అమ్మకపు పన్ను వసూలు చేయకూడదు. అయితే ఆ విదేశీ ప్రయాణికులు కొనుగోలు చేసే వస్తువును డిస్ట్రిబ్యూటర్ వద్ద కొనేటప్పుడు సదరు డీలర్ పన్ను చెల్లిస్తాడు. పన్ను చెల్లించి కొన్న వస్తువును పన్ను లేకుండా విక్రయించడం వల్ల డీలర్ నష్టపోయే అవకాశముంది. ఈ నేపథ్యంలో డిస్ట్రిబ్యూటర్లకు డీలర్లు చెల్లించే పన్నులో సీజీఎస్టీని తిరిగి డీలర్‌కే చెల్లించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. అయితే, ఇందులో ఉండే రాష్ట్ర జీఎస్టీ విషయంలో స్పష్టతనివ్వలేదు. ఈ ఉత్తర్వుల ప్రకారం డీలర్లకు తిరిగి చెల్లించిన జీఎస్టీ మొత్తాన్ని కేంద్రం నుంచి పరిహారం రూపంలో రాబట్టుకోనుంది. జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత పలు నిబంధనల ప్రకారం కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన పరిహారం సరిగా రావట్లేదు. అయినా కేంద్ర పరిహారంపై ఆశలు పెట్టుకొని విదేశీయులకు ఇబ్బంది లేకుండా వారు కొనుగోలు చేసే వస్తువులపై జీఎస్టీ ఎత్తివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

16 నుంచి ఏపీ సీఎం అమెరికా పర్యటన

సాక్షి, అమరావతి: ఏపీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి ఆగస్టు16వ తేదీ నుంచి 22వ తేదీ వరకు వారం రోజుల పాటు అమెరికాలో పర్యటించనున్నారు. కుటుంబ సభ్యులతో కలసి ముఖ్యమంత్రి జరుపనున్న ఈ పర్యటన పూర్తిగా వ్యక్తిగతమైనదని, అమెరికా పర్యటనకు, అక్కడ బస చేయడానికి అయ్యే ఖర్చు మొత్తం సొంతంగానే భరించనున్నారని ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొంది. ముఖ్యమంత్రి చిన్న కుమార్తెను ఇండియానా రాష్ట్రంలో ఉన్న ప్రతిష్టాత్మకమైన నాట్రడామ్ యూనివర్సిటీలో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులో చేర్పించడం కోసం అమెరికా వెళ్తున్నారు. ఈ పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ అమెరికా ప్రభుత్వ అధికారులు, పారిశ్రామికవేత్తలు, ప్రవాస భారతీయులను కలవనున్నారు. ఆగస్టు16-18 తేదీల్లో వాషింగ్టన్ డీసీ, డల్లాస్‌ల్లో ఉన్న ప్రవాస తెలుగు వారిని కలుస్తారు. ఆగస్టు22న అమెరికా నుంచి బయలు దేరే ముందు చికాగాలో ముఖ్యమైన పారిశ్రామిక వేత్తలతో సమావేశమవుతారు.

రెండు బాహుబలి మోటార్ల వెట్‌రన్ సక్సెస్

లక్ష్మీపూర్ పంప్‌హౌస్‌లో నిర్వహణ

రామడుగు (చొప్పదండి): కాళేశ్వరం ప్రాజెక్టులో మరో అద్భుతం ఆవిష్కృతమైంది. ప్రాజెక్టు పరిధిలోని లక్ష్మీపూర్ పంప్‌హౌస్ (గాయత్రి)లో మంగళవారం రాత్రి 10 గంటలకు అధికారులు రెండు బాహుబలి విద్యుత్ మోటార్ల వెట్‌రన్‌ను ఏకకాలంలో విజయవంతంగా పూర్తి చేశారు. ఈ పంపుహౌస్‌లో ఆదివారం సాయంత్రం 5వ మోటారును వెట్‌రన్ చేసిన అధికారులు తిరిగి సోమవారం మధ్యాహ్నం రెండోసారి వెట్‌రన్ నిర్వహించారు. సోమవారం రాత్రి 9 గంటలకు 4వ బాహుబలి మోటార్ వెట్‌రన్‌ను విజయవంతం చేశారు. తాజాగా మంగళవారం రాత్రి ఒకేసారి 4, 5వ మోటార్లు రెండింటిని వెట్‌రన్ విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర సాంకేతిక సలహాదారు పెంటారెడ్డి పర్యవేక్షణలో ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లు, ఈఈ నూనె శ్రీధర్, డీఈఈ గోపాల క్రిష్ణ అధ్వర్యంలో నిర్వహించారు. మంగళవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో 4వ మోటారు వెట్‌రన్ కొద్దిసేపు నిర్వహించి నిలిపివేశారు. తర్వాత మళ్లీ వీటిని విజయవంతంగా వెట్‌రన్ నిర్వహించి గ్రావిటీ కాలువలోకి నీటిని వదిలారు. కాగా వెట్‌రన్ రెండు మోటార్లు విజయవంతం కావడంతో అధికారులు ఆనందం వ్యక్తం చేశారు.

'ఇంటింటా ఇన్నోవేటర్'

- కొత్త ఆవిష్కరణలకు టీఎస్ఐసీ పట్టం
- రేపు జిల్లాకేంద్రాల్లో ఇన్నోవేషన్ ఎగ్జిబిషన్లు ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో పల్లె, పట్టణం తేడా లేకుండా నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 15న అన్ని జిల్లా కేంద్రాల్లో 'ఇన్నోవేషన్ ఎగ్జిబిషన్'ను ప్రభుత్వం ప్రారంభించనుంది. 'ఇంటింటా ఇన్నోవేటర్'పేరిట జరిగే ఈ ఎగ్జిబిషన్‌లో తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ ఎంపిక చేసిన ఆవిష్కరణలతోపాటు ఆయా జిల్లాలకు చెందినవారు తమ ఆవిష్కరణలను ప్రదర్శించేందుకు అవకాశం ఇస్తున్నారు. ఆవిష్కరణలకు సంబంధించిన నూతన ఆలోచనలపై టీఎస్ఐసీ నెలక్రితం రాష్ట్ర వ్యాప్తంగా దరఖాస్తులు ఆహ్వానించగా 33 జిల్లాల నుంచి ఐదు వందలకుపైగా దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 360 ప్రదర్శనలు అర్హత సాధించగా, వడపోతలో 220 దరఖాస్తులను ఎంపిక చేశారు. వీటిలోని ఆరు ఆవిష్కరణలను స్టార్టప్‌లుగా ఎంపిక చేయాలని నిర్ణయించారు. 'పెద్ద చదువులు చదివినవారు మాత్రమే శాస్త్రవేత్తలు కాదు, పాఠశాలవిద్య పూర్తి చేయనివారు కూడా ఆవిష్కర్తలుగా మారడానికి అవకాశం ఉంది'అని టీఎస్ఐసీ చీఫ్ ఇన్నోవేటివ్ ఆఫీసర్ ఫణీంద్ర సామ వెల్లడించారు. ఏడాదిన్నరలో టీఎస్ఐసీ ద్వారా ఎంతోమంది ఆవిష్కర్తలను కలుసుకున్నామని, చెప్పారు.

టీ-హబ్ ఫుల్

▶ మొదటి పేజీ తరువాయి

ఆవిష్కరణలను సాకారం చేయడం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పెంచే ఉద్దేశంతో టీహబ్‌ను తెలంగాణ ప్రభుత్వం 2015లో గచ్చిబౌలిలో ఏర్పాటు చేసిన విషయం విదితమే. స్టార్టప్ కంపెనీలు ప్రారంభించాలనుకునే సాంకేతిక నిపుణులకు టీహబ్ ఓ దిక్సూచిగా మారిందని నాస్‌కామ్ తాజా నివేదికలో పేర్కొనడం విశేషం. ఇక్కడ పురుడుపోసుకున్న పలు స్టార్టప్‌లు దేశ, విదేశాల్లో పనిచేస్తున్న ఐటీ, బీపీవో, కేపీవో, సేవా, బీమా, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, హెల్త్‌కేర్, ఇండస్ట్రీ రంగాల్లో సేవలందిస్తోన్న కంపెనీలకు సాంకేతిక సహకారం అందిస్తున్నాయి.

అద్భుతాలు సృష్టించిన టీ-హబ్ స్టార్టప్‌లివే..

ఎనీటైమ్‌లోన్.ఐఎన్: నాన్‌బ్యాంకింగ్ ఆర్థిక సంస్థగా పేరొందిన ఈ సంస్థ గత

నేడు ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బుధవారం ఒకటి, రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశముందని, గురువారం తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మంగళవారం గాంగేటిక్ పశ్చిమ బెంగాల్ దక్షిణ ప్రాంతం, దానిని ఆనుకుని ఉన్న ఉత్తర ఒడిశా ప్రాంతాల్లో కేంద్రీకృతమై ఉండటంతో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని పేర్కొంది. ఇది కాస్తా రానున్న 24 గంటల్లో మరింత తీవ్రంగా మారే అవకాశముందని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

తెలంగాణ ప్రభుత్వం
గవర్నమెంట్ మెడికల్ కాలేజ్, మహబూబ్‌నగర్
నోటిఫికేషన్ నం.03/2019 తేది: --08-2019
గవర్నమెంట్ మెడికల్ కాలేజ్/ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్, మహబూబ్‌నగర్‌లో పనిచేయుటకు కాంట్రాక్ట్ ప్రాతిపదికన సీనియర్ రెసిడెంట్స్/ జూనియర్ రెసిడెంట్స్ ఉద్యోగాల నియామకానికి అర్హత గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరబడుచున్నవి. సీనియర్ రెసిడెంట్స్ (06), జూనియర్ రెసిడెంట్స్ (24) జూనియర్ రెసిడెంట్స్: MBBS డిగ్రీ, సీనియర్ రెసిడెంట్స్: సంబంధిత స్పెషాలిటీలో MD/MS/DNB* డిగ్రీ (ఇటీవలి MCI మార్గదర్శక సూత్రాల ప్రకారం DNB). దరఖాస్తు దాఖలు తేది: 10.08.2019. వాక్ ఇన్ ఇంటర్వ్యూ: 16.08.2019. దరఖాస్తుల పరిశీలన: 16.08.2019న ఉ.11 గం.కు. తదుపరి వివరాల కోసం http://dme.telangana.gov.in, http://gmcmbnr.ts.org లో చూడవచ్చును.
సం/- డైరెక్టర్, గవర్నమెంట్ మెడికల్ కాలేజ్/ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్, మహబూబ్‌నగర్
DIPR RO.No.888-DP/CL/Advt/1/2019-20, Dt: 13.08.2019

తెలంగాణ ప్రభుత్వం
సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయం, PR రీజియన్, కరీంనగర్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
నోటీస్ నం. 133 to 153/SE/Tenders/2019-20, తేది: 06.08.2019
రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ & పెద్దపల్లి జిల్లాలలోని వివిధ (గ్రా) & (మం)లలో CC రోడ్ & SWG డ్రెయిన్ పైప్ & బాక్స్ టైప్ డ్రెయిన్ & షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణము (4వ పిలుపు). కమ్యూనిటీ హాల్ & భవిత భవనం నిర్మాణం (3వ పిలుపు), MPPS వద్ద అదనపు తరగతి గదుల నిర్మాణం/ లింక్ రోడ్డు వేయుట (2వ పిలుపు) & ఇతర సివిల్ పనులు. ECV: రూ: 1076.32 లక్షలు. బిడ్ లోడింగ్ ప్రారంభ & ముగింపు తేది: 14-08-2019 నుండి 22-08-2019 వరకు. తదుపరి వివరాల కోసం www.tenders.telangana.govin లో చూడవచ్చును.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, PR రీజియన్, కరీంనగర్
DIPR RO. No.887-DP/CL/Advt/1/2019-20, Dt: 13.08.2019

THE TELANGANA STATE DAIRY DEVELOPMENT COOPERATIVE FEDERATION LTD., LALAPET:: HYDERABAD - 500017
Website: tsdairy.telangana.gov.in
Tender Notice No.18&21/EE(c)/TSDDCFL/2019 Date:13-08-2019
The tenders are invited for the following works, 1. Providing water supply line from MPF to Head Office, Hyderabad for the tender value of Rs.901252.00 schedule closed on **21.08.2019 by 5.00PM(2nd Call)**. 2. Construction of 2 lakhs liters capacity UGR in MPF, Hyderabad for the tender value of Rs.1726629.00 schedule closed on **28.08.2019 by 5.00PM**. Further detail visit **https://tender.telangana.gov.in** and further enquiry contact EE© in HO Ph:**9391841211** during the office hours.
EXECUTIVE ENGINEER (CIVIL)

గొర్రెల పంపిణీలో అవకతవకలు...

అధికారులపై వేటు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గొర్రెల పంపిణీ పథకాన్ని అధికారులు నీరుగార్చారు. కొనుగోళ్లలో నిబంధనలు పాటించకుండా అక్రమాలకు పాల్పడ్డారు. దీంతో ఈ పథకం ఉద్దేశం ఆశించిన మేర నెరవేరలేదని స్పష్టమవుతోంది. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు కూడా మొదటి విడత పంపిణీపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని తెలిసింది. కొనుగోళ్లలో అక్రమాలకు, అవకతవకలకు పాల్పడినప్పటికీ ఆ అధికారులపై నామమాత్రపు చర్యలు తీసుకోవడంతో క్షేత్రస్థాయిలో ఉన్న మిగతా అధికారులు యథేచ్ఛగా గొర్రెలను రీసైక్లింగ్ చేసినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. అలాగే కొనుగోళ్లు చేయకున్నా చేసినట్లు చూపించారని తేలింది. పెద్దఎత్తున అవినీతి చోటు చేసుకున్నప్పటికీ ఉన్నతాధికారులు బాధ్యులపై తీసుకున్న చర్యలు అంతంత మాత్రంగానే ఉన్నాయి.

మొత్తం 24 మంది పశువైద్యాధికారులపై చర్యలు తీసుకున్నారు. అక్ర మాలకు పాల్పడటం రీసైక్లింగ్‌ను ప్రోత్సహించడం, గొర్రెల రవాణాలో నిబంధనలు పాటించకపోవడం, తప్పుడు నివేదికలు పంపడం, బ్రోకర్లతో కుమ్మక్కవడం, అమ్మకందారుల నుంచి కమీషన్లు తీసుకోవడం, నాణ్యమైన గొర్రెలను కొనుగోలు చేయకపోవడం, ట్యాగులు వేయకపోవడం వంటివి కారణాలుగా పేర్కొన్నారు. ఇందులో ఏడుగురిపై సస్పెన్షన్ వేటు పడగా మిగతా వారిపై శాఖపరమైన విచారణకు ఆదేశించారు. సస్పెన్షన్‌కు గురైన అధికారులు కూడా నెల రోజుల్లోనే తిరిగి విధుల్లో చేరడం గమనార్హం. ఈ పథకం లక్ష్యం ప్రకారం రెండేళ్లలో 7.28 లక్షల మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 20 గొర్రెలు, ఒక పొట్టేలు చొప్పున మొత్తం 1.53 కోట్ల గొర్రెలను పంపిణీ చేయాల్సి ఉంది. ఇందులో లిస్ట్-ఏ లో 3.67 లక్షల మందికి 77 లక్షల గొర్రెలకుగాను 71 లక్షలు, లిస్ట్ బిలో 3.61 లక్షల మంది లబ్ధిదారులకు 6 లక్షల వరకు గొర్రెలు పంపిణీ చేసినట్లు గొర్రెల, మేకల అభివృద్ధి సమాఖ్య అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. రెండో విడత గొర్రెల పంపిణీని ఈ జూన్ నుంచే ప్రారంభించాల్సి ఉంది. అయితే ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాకపోవడంతో ఇది ఇంకా మొదలుకాలేదు. ఇదిలాఉండగా, ఈసారి టెండర్ల ద్వారా గొర్రెలను పంపిణీ చేసే అవకాశాలున్నాయన్న చర్చ కూడా జరుగుతోంది.

24 మందిపై చర్యలు తీసుకున్న పశుసంవర్ధక శాఖ

- పథకాన్ని దుర్వినియోగం చేయడమే కారణం
- సస్పెన్షన్‌కు గురైన అధికారులు నెలలోపే విధుల్లోకి..
- అవినీతికి చెక్ పెట్టేందుకు టెండర్ల ద్వారా గొర్రెల పంపిణీ చేపట్టాలని సర్కారు యోచన

- నారాయణ్‌ఖేడ్ టీడీపీ మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి మంగళవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్‌ను ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన బీజేపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. ప్రధాని మోదీ పనితీరు, ఆయన చేస్తున్న అభివృద్ధిని చూసి తాను బీజేపీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. ఈ నెల 18న బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేపీ నడ్డా సమక్షంలో ఆయన పార్టీలో చేరుతారని లక్ష్మణ్ చెప్పారు.

తెలంగాణ ప్రభుత్వం
రోడ్లు మరియు భవనాల శాఖ
జాతీయ రహదారులు
ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు
NIT No.02/TS/EE/R&B/NHD/2019-20/101 తేది: 05.08.2019
పని వివరణ: తెలంగాణ రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2019-20 సంవత్సరానికి NH-30 (పాత NH-221) కి. మీ.165/0 నుండి 171/6 వరకు విజయవాడ నుండి జగదల్‌పూర్ రోడ్డును వార్షిక నిర్వహణ. అంచనా వ్యయం: రూ.2,32,500.00 లక్షలు. బిడ్ డాక్యుమెంట్ల జారీ: 13.08.2019 మ.01.30 గం. నుండి 30.08.2019 మ.2.00 గం.వరకు. బిడ్ దాఖలుకు చివరి తేది మరియు సమయం: 30.08.2019 మ.2.30 గం. తెరచు తేది: 31.08.2019 ఉ.11.00 గం. ఫోన్ నం.8333923755. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా www.tender.telangana.gov.inలో చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (R&B), NH-డివిజన్: ఖమ్మం
DIPR RO.No.881-DP/CL/Advt/1/2019-20, Dt:13.08.2019

తెలంగాణ ప్రభుత్వం
రోడ్లు మరియు భవనాల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
NIT No.1416/DCE (R)/EE-R/DEE-5/AEE-1/2019-20 తేది: 07.08.2019
ఆదిలాబాద్ సర్కిల్ పరిధిలో ఒక బ్రిడ్జి పని కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్ ద్వారా ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరుదారులు టెండరు షెడ్యూళ్ళను 14.08.2019 సా.4.00 గం. నుండి ఇ-మార్కెట్‌ప్లేస్ అంటే http://tender.telangana.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. 2018 సంవత్సరానికి జైపూర్ మండలంలోని శెట్పల్లి గ్రామంలో CSR పథకం క్రింద ఒక బ్రిడ్జి పని కోసం టెండర్ల స్వీకరణకు చివరి తేది 21.08.2019న లేదా ఆలోగా మ.3.30 గం.వరకు. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా http://tender.telangana.gov.inలో చూడవచ్చును.
సం/- ఇంజినీర్ ఇన్ చీఫ్ (R&B), స్టేట్ రోడ్స్ & CRN
DIPR RO.No.884-DP/CL/Advt/1/2019-20, Dt: 13.08.2019

11,800 ఎకరాల్లో పంట నష్టం

- 9,726 ఎకరాల్లో నీట మునిగిన వరి
- వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనా



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గత పది రోజుల్లో కురిసిన వర్షాలతో ఏడు జిల్లాల్లో పంట నష్టం వాటిల్లింది. కొన్నిచోట్ల అతి వర్షంతో, మరికొన్నిచోట్ల ప్రాజెక్టుల నుంచి వదిలిన నీరు కారణంగా పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ ప్రాథమికంగా నిర్ధారించింది. ఆదిలాబాద్, పెద్దపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో దాదాపు 11,800 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. ఇందులో ప్రధానంగా వరినాట్లు నీట మునిగినట్లు వ్యవసాయశాఖ తన ప్రాథమిక అంచనా నివేదికలో పేర్కొంది. వరినాట్లు 9,726 ఎకరాల్లో నీటమునిగి రైతులు నష్టపోయారు. అలాగే పత్తి పంట 1,600 ఎకరాల్లో నీటిలో మునిగింది. వర్షాలు అధికంగా కురవడం, పైనుంచి వరద రావడంతో కృష్ణా నదికి ప్రవాహం పెరగడం, దాని దిశ మారడంతో నారాయణపేట జిల్లాలో 6,100 ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. ఇలా 900 మీటర్ల వరకు నది తన సహజత్వానికి విరుద్ధంగా ప్రవర్తించింది. పెద్దపల్లిలోని కాళేశ్వరం బ్యాక్ వాటర్‌తోనూ అక్కడక్కడ వరినాట్లు నీట మునిగాయి. జూరాల నుంచి నీటి విడుదలతో 260 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. తుంగభద్రలోకి వరద ప్రవాహం పెరగడంతో జోగులాంబ గద్వాల జిల్లాలో 1,750 ఎకరాల్లో వరి, 460 ఎకరాల్లో పత్తి పంట, కంది మొలకలు 230 ఎకరాల్లో నీట మునిగినట్లు నివేదికలో పేర్కొన్నారు. మొత్తం 19 మండలాల్లోని 95 గ్రామాల్లోని రైతులకు అతి వర్షాలు నష్టం చేకూర్చినట్లు వ్యవసాయ శాఖ పేర్కొంది.

క్లుప్తంగా...

ఎంఐఎంను బూచిగా చూపి రెచ్చగొడుతోంది..

సాక్షి, హైదరాబాద్: ఎంఐఎంతో టీఆర్ఎస్ దోస్తీని బూచిగా చూపి బీజేపీ ప్రజలను రెచ్చగొడుతోందని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం అసెంబ్లీలోని టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో తలసాని మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కల్వకుంట్ల ప్రభుత్వం నడుస్తోందంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ చేసిన విమర్శలను ఆయన ఖండించారు. దేశంలో మోదీ ప్రభుత్వం నడుస్తున్నపుడు.. రాష్ట్రంలో కల్వకుంట్ల ప్రభుత్వం నడవడంలో తప్పేముందని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబ సభ్యులు ప్రజలు ఆశీర్వదిస్తేనే గెలిచారన్నారు. పుల్వామా దాడి తర్వాత బీజేపీకి ఎంఐఎం మద్దతు పలికిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలో బీజేపీ ప్రజాస్వామ్యబద్ధంగా బలపడటాన్ని ఎవరూ కాదనరని, నాలుగు సీట్లు గెలిచిన బీజేపీ.. స్థాయికి మించి మాట్లాడుతోందని తలసాని ఎద్దేవా చేశారు. తెలంగాణ, ఏపీ నడుమ సత్సంబంధాలు కొనసాగాలనే తపనతో కేసీఆర్ చొరవ చూపుతున్నారన్నారు.

'కొప్పుల జోక్యం లేదు'

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర పార్టీ వ్యవహారాల్లో ఏఐసీసీ నేత కొప్పుల రాజు జోక్యం ఏమాత్రం లేదని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఆర్.సి. కుంతియా స్పష్టం చేశారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో టికెట్ల కేటాయింపులోనూ ఆయనకు సంబంధం లేదన్నారు. పార్టీ ఎన్నికల కమిటీ నిర్ణయం మేరకే ఈ టికెట్ల కేటాయింపు జరిగిందని మంగళవారం ఒక ప్రకటనలో ఆయన తెలిపారు. రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ ఇవ్వకుండా రాజు అడ్డుకున్నారని కొందరు సీనియర్ నేతలు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. రాహుల్ వ్యవహారాలను ఆయన వ్యక్తిగత కార్యదర్శి చూసుకుంటారని తెలిపారు. సీనియర్ నేతలు బహిరంగ ఆరోపణలు చేయడం కన్నా సమస్య ఉంటే పార్టీ అంతర్గత వేదికలపై మాట్లాడితే మంచిదని ఆయన సూచించారు.

ఉనికి కోసమే కాంగ్రెస్‌పై విమర్శలు: మల్లు రవి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో బీజేపీకి సమర్థ నాయకుడు లేడని, ఉనికి కోసమే కాంగ్రెస్‌పై ఆ పార్టీ విమర్శలు చేస్తోందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి పేర్కొన్నారు. రాష్ట్రంలో సరైన కేడర్ కూడా లేని బీజేపీ ఇప్పుడు ఇతర పార్టీ నేతల ఇళ్ల చుట్టూ తిరిగి పార్టీలో చేర్చుకుంటున్నారని ఎద్దేవా చేశారు. గాంధీభవన్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ..గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 103 స్థానాల్లో డిపాజిట్లు కోల్పోయిందని, ఈ ఏడాది లోక్‌సభ ఎన్నికల్లో నాలుగు చోట్ల గెలిచినా ఆ పార్టీకి రాష్ట్ర వ్యాప్తంగా వచ్చింది 17% ఓట్లేనన్న విషయాన్ని గుర్తెరగాలన్నారు. ప్రధాని మోదీ, సీఎం కేసీఆర్‌ల మధ్య రహస్య ఒప్పందం ఉందని, ఆ మేరకు రెండు పార్టీలు కలసి పనిచేస్తున్నాయని ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ మతిస్థిమితం లేకుండా మాట్లాడుతున్నారని, నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడితే బాగుంటుందని హితవు పలికారు.

నేడు అఖిలపక్ష భేటీ

హైదరాబాద్: మెడికల్ కౌన్సెలింగ్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు జరిగిన అన్యాయంపై చర్చించేందుకు బుధవారం అన్ని రాజకీయ పార్టీల నేతలతో అఖిలపక్ష భేటీని నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య తెలిపారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఉదయం ప్రారంభమయ్యే ఈ భేటీకి అన్ని రాజకీయ పార్టీల నేతలు హాజరవుతారన్నారు. విద్యానగర్ బీసీభవన్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రానికి మొత్తం 2,487 మెడికల్ సీట్లుండగా ఇందులో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు న్యాయబద్ధంగా 1,243 సీట్లు దక్కాల్సి ఉందన్నారు. వెబ్‌సైట్లో చూసినప్పుడు రిజర్వేషన్ కేటగిరీ కింద 981 సీట్లు మాత్రమే ఈ వర్గాలకు కేటాయించినట్లు లెక్కలు చూపుతోందన్నారు. ఎస్సీ,ఎస్టీ, బీసీలకు దాదాపు 262 సీట్లు దక్కకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే తప్పులను సరిదిద్దుకొని 262 మంది అభ్యర్థులకు ఎంబీబీఎస్ సీట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రిజర్వేషన్లు పాటించకుంటే యూనివర్సిటీ ముట్టడి..

సాక్షి,హైదరాబాద్: మెడికల్ కౌన్సెలింగ్‌లో రిజర్వేషన్లు పాటించకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు మెడికల్ సీట్లు దక్కకుండా చేశారని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. కాళోజీ హెల్త్ యూనివర్సిటీ అధికారులు, వీసీ ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. రిజర్వేషన్ల ప్రకారం సీట్లు కేటాయించకపోతే ఈనెల 17న కాళోజీ వర్సిటీని ముట్టడిస్తామని జాజుల హెచ్చరించారు.

గోదారి కడలిపాలు!

- గత 70 రోజుల్లో 1,260 టీఎంసీలు వృథాగా సముద్రంలోకి
- ఈ వాటర్ ఇయర్‌లో 3-4 వేల టీఎంసీల సముద్రంపాలయ్యే అవకాశం
- రాష్ట్రంలో పలు ప్రాజెక్టుల నిర్మాణం పూర్తికాకపోవడమే కారణం
- కృష్ణా-గోదావరి అనుసంధానంపై నేడు తెలంగాణ, ఏపీ చర్చలు

సాక్షి, హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలతో గోదావరి ఉరకలేస్తోంది. దీనికితోడు గత 15 రోజులుగా ఎగువన కురుస్తున్న వర్షాలతో నదిలకి భారీగా వరద వచ్చి చేరుతోంది. అయితే గోదావరి నీటిని సద్వినియోగం చేసుకోవడానికి వీలుగా రాష్ట్రంలో చేపట్టిన పలు సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం పూర్తికాకపోవడంతో ఆ నీరంతా వృథాగా సముద్రం పాలవుతోంది. ఇప్పటివరకూ గోదావరికి చిట్టచివరిగా ఉన్న ఏపీలోని ధవళేశ్వరం బ్యారేజీ నుంచి కేవలం 70 రోజుల వ్యవధిలో ఏకంగా 1,260 టీఎంసీల నీరు బంగాళాఖాతంలో కలిసిపోయింది.

రోజుకు 18 టీఎంసీలు సముద్రంలోకి...

గోదావరిలో ఉమ్మడి రాష్ట్రానికి 1,486 టీఎంసీల నీటి కేటాయింపులు ఉండగా ఇందులో తెలంగాణకు 954 టీఎంసీల వాటా ఉంది. రాష్ట్రంలో ఇప్పటికే నిర్మాణం పూర్తయిన శ్రీరాంసాగర్, సింగూరు, నిజాంసాగర్ వంటి ప్రాజెక్టుల కింద ఏటా వినియోగం సరాసరిన 470 టీఎంసీల మేర ఉండగా ఈ ఏడాది ఈ మూడు ప్రాజెక్టుల్లోకి కేవలం 10 టీఎంసీలే కొత్త నీరు వచ్చి చేరింది. సింగూరు, నిజాంసాగర్‌లోకి అయితే చుక్క నీరు కూడా రాలేదు. మరోవైపు మరింత వాటా నీటిని వినియోగంలోకి తెచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం కాళేశ్వరం (180 టీఎంసీలు), దేవాదుల (60 టీఎంసీలు), తుపాకులగూడెం (100 టీఎంసీలు), సీతారామ (60 టీఎంసీలు) వంటి ఎత్తిపోతల పథకాలను చేపట్టింది. ఈ ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే మరో 520 టీఎంసీల మేర నీరు వినియోగంలోకి రానుంది. కానీ ప్రస్తుతం తుపాకులగూడెం ప్రాజెక్టు ఇంకా నిర్మాణ దశలోనే ఉండగా సీతారామ ప్రాజెక్టు ఈ ఏడాది అక్టోబర్, నవంబర్ నుంచి పాక్షికంగా వినియోగంలోకి రానుంది. అలాగే దేవాదులలో అత్యంత కీలకమైన పనులు ఇప్పుడిప్పుడే వేగం పుంజుకున్నాయి. ఇక కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీటిని కొంతమేర ఎత్తిపోసినా ఎల్లంపల్లి దిగువన మిడ్‌మానేరు వరకు పనుల్లో జాప్యంతో ఎత్తిపోతలు ఇప్పటిదాకా సాధ్యం కాలేదు. అయితే ఒకట్రెండు రోజుల్లోనే ఈ పనులు పూర్తికానుండటంతో ఎల్లంపల్లి నుంచి మిడ్‌మానేరుకు పూర్తిస్థాయిలో ఎత్తిపోతలు సాధ్యం కానుంది. అప్పుడు కొంత మేర గోదావరికి అడ్డుకట్ట పడనుంది. కానీ ఈలోగానే మేడిగడ్డ బ్యారేజీ ప్రాంతాన్ని దాటుతూ 300 టీఎంసీల మేర నీరు దిగువకు వెళ్లిపోయింది. అలాగే దిగువనున్న ఇంద్రావతి, శబరి నదుల నుంచి కలిపి మొత్తంగా ఇప్పటికే 1,260 టీఎంసీలు సముద్రంలోకి వెళ్లింది. గత ఏడాదంతా 2,446 టీఎంసీల నీరు సముద్రంలోకి వెళ్లగా ఈ ఏడాది 70 రోజుల వ్యవధిలోనే రోజుకు 18 టీఎంసీల చొప్పున 1,260 టీఎంసీలు సముద్రంపాలయ్యాయి. ఈ వాటర్ ఇయర్ మొత్తంలో 3 వేల నుంచి 4 వేల టీఎంసీలు సముద్రంలోకి వెళ్లే అవకాశం ఉందని నీటిపారుదల వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇక కృష్ణా బేసిన్‌లో ఈ ఏడాదిలో తొలిసారి భారీ వరదల కారణంగా ఆల్మట్టి నుంచి పులిచింతల వరకు అన్ని ప్రాజెక్టుల గేట్లు ఎత్తడంతో మంగళవారం నుంచి కృష్ణా నీరు సైతం సముద్రంలో కలుస్తోంది. మంగళవారం ఒక్కరోజే 20 టీఎంసీలు సముద్రంలో కలిసినట్లు నీటిపారుదల వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుత వరదల దృష్ట్యా ఈ ఏడాది గరిష్ట స్థాయిలో నీరు సముద్రంలోకి వెళ్లే అవకాశం ఉంది.

నేడు ఇరు రాష్ట్రాల ఇంజనీర్ల కమిటీల చర్చలు

వృథాగా సముద్రంపాలవుతున్న నీటికి అడ్డుకట్ట వేసేందుకు కృష్ణా, గోదావరి నదుల అనుసంధానం చేపట్టాలని నిర్ణయించిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఈ అంశంపై బుధవారం హైదరాబాద్‌లో మరోమారు చర్చలు జరపనున్నాయి. ఇరు రాష్ట్రాల ఇంజనీర్ల కమిటీలు దీనిపై చర్చించనున్నాయి. ఇప్పటికే తుపాకులగూడెం ఎగువ నుంచి, రాంపూర్, దుమ్ముగూడెంల నుంచి నీటిని నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులకు తరలించే విషయమై తయారు చేసిన ప్రతిపాదనల గురించి ఇరు రాష్ట్రాలు చర్చించనున్నాయి. ముందస్తు కసరత్తులో భాగంగా మంగళవారం తెలంగాణ ఇంజనీర్ల కమిటీ జలసౌధలో సమావేశమై సిద్ధం చేసిన ప్రతిపాదనలకు తుది మెరుగులు దిద్దింది.

ధవళేశ్వరం (ఫైల్)

గత 15 ఏళ్లలో సముద్రంపాలైన గోదావరి, కృష్ణా వరద (టీఎంసీల్లో)

సంవత్సరం	గోదావరి	కృష్ణా
2005-06	3,772	1,249
2006-07	4,874	986
2007-08	2,853	899
2008-09	1,865	305
2009-10	707	707
2010-11	4,053	411
2011-12	1,538	209
2012-13	2,969	55
2013-14	5,827	399
20014-15	1,987	73
2015-16	1,611	9
2016-17	2,895	55
2017-18	1,025	0
2018-19	2,446	39
2019-20	1,260	20
		(ఆగస్టు13 వరకు)

కృష్ణా ప్రాజెక్టులన్నీ నిండుకుండలు

సాక్షి, హైదరాబాద్: కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వస్తున్న వరదతో కృష్ణాలో నీటి ప్రవాహాలు స్థిరంగా కొనసాగుతున్నాయి. నిన్నమొన్నటితో పోలిస్తే బేసిన్ ప్రాజెక్టులకు కొద్దిమేర వరద ఉధృతి తగ్గినా భారీగానే వరద వస్తోంది. ఇప్పటికే ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల, శ్రీశైలం ప్రాజెక్టులన్నీ నిండటంతో వచ్చిన నీటిని వచ్చినట్లుగా దిగువకు వదిలేస్తున్నారు. దీంతో సాగర్‌లోకి మంగవారం సాయంత్రం 8.14 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదుకాగా ప్రాజెక్టులో నీటి నిల్వ 312 టీఎంసీలకుగాను 275 టీఎంసీలకు చేరింది. పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకుగాను 576 అడుగులకు చేరింది. ఎగువ నుంచి వస్తున్న వరద ఉధృతిని దృష్టిలో పెట్టుకొని ప్రాజెక్టు నుంచి 5.35 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువనున్న పులిచింతలకు విడుదల చేస్తున్నారు. పులిచింతలలో సైతం ఎగువ వరదనుబట్టి నీటి నిల్వ ఉంచి మరో 4.24 లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. ఈ వరద ప్రకాశం బ్యారేజీ మీదుగా బంగాళాఖాతంలోకి వెళుతోంది.

ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు ఇలా..

(నిల్వ-టీఎంసీల్లో, ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో-క్యూసెక్కుల్లో)

ప్రాజెక్టు	పూర్తి నిల్వ	ప్రస్తుత నిల్వ	ఇన్‌ఫ్లో	ఔట్‌ఫ్లో
ఆల్మట్టి	129.72	110.32	6,04,814	5,70,000
నారాయణపూర్	37.646	27.40	6,05,000	5,94,550
జూరాల	9.65	5.84	7,45,000	7,31,549
శ్రీశైలం	215.807	185.14	882,980	8,83,797
తుంగభద్ర	100.86	96.86	1,56,979	1,15,957
ఉజ్జయినీ	117	117.24	22,760	10,950
నాగార్జున సాగర్	312.045	275	8,14,931	5,35,931
పులిచింతల	45.77	23.27	7,11,847	4,24,349
కడెం	7.60	6.80	1,376	808
ఎల్లంపల్లి	20.18	19.56	13,292	5,570
ఎస్సారెస్పీ	90.31	16.79	5,920	389

నోట్: మంగళవారం సాయంత్రం 6 గంటలకు అధికారిక బులెటిన్ ప్రకారం నీటి లెక్కలు

డిగ్రీలో స్పాట్ అడ్మిషన్లు..

- షెడ్యూల్ ప్రకటించిన దోస్త్
- ఇప్పటివరకు ప్రవేశాలు పొందిన 1,74,239 మంది
- చివరి దశలో ఆప్షన్లు ఇచ్చుకున్న 16 వేల మంది
- నేడు చివరి దశ సీట్ల కేటాయింపు..
- 15, 16 తేదీల్లో కాలేజీల్లో రిపోర్టింగ్
- మిగిలిన సీట్లకు నేటి నుంచి స్పాట్ అడ్మిషన్లు



సాక్షి, హైదరాబాద్: డిగ్రీ కాలేజీల్లో స్పాట్ అడ్మిషన్లకు ప్రభుత్వం ఓకే చెప్పింది. మూడేళ్లుగా స్పాట్ అడ్మిషన్లకు అవకాశం ఇవ్వాలంటూ యాజమాన్యాలు చేస్తున్న విజ్ఞప్తికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈనెల 14 నుంచి స్పాట్ అడ్మిషన్లు చేపట్టుకోవచ్చని యాజమాన్యాలకు డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) కన్వీనర్ ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి ప్రకటించారు. దోస్త్ కౌన్సెలింగ్ తర్వాత స్పాట్ ప్రవేశాలకు అవకాశం లేకపోవడంతో మిగిలిపోయే సీట్లలో యాజమాన్యాలు సొంతంగా ప్రవేశాలు చేపట్టే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో డిగ్రీ కాలేజీ యాజమాన్యాల సంఘం ఏటా మంత్రులను కలసి విజ్ఞప్తులు చేస్తూనే ఉంది. ఈ ఏడాది కూడా విద్యా శాఖ మంత్రిని, టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లను కలసి విజ్ఞప్తులు చేసింది. దీంతో ఎట్టకేలకు స్పాట్ అడ్మిషన్లకు ప్రభుత్వం ఓకే చెప్పింది. దీంతో దోస్త్ కౌన్సెలింగ్ తర్వాత మిగిలిపోయే సీట్లలో తాము కోరుకునే కాలేజీల్లో విద్యార్థులు ప్రవేశాలు పొందేందుకు వీలు ఏర్పడిందని డిగ్రీ కాలేజీ యాజమాన్యాల సంఘం ప్రధాన కార్యదర్శి పరమేశ్ పేర్కొన్నారు. ఆర్థిక స్థోమత కలిగిన విద్యార్థులకు దోస్త్ ద్వారా కోరుకున్న కాలేజీల్లో సీట్లు రావట్లేదని, స్పాట్ అడ్మిషన్ల ద్వారా అలాంటి వారికి కోరుకున్న చోట సీట్లు లభిస్తాయని వివరించారు. కాగా, రాష్ట్రంలోని డిగ్రీ కాలేజీల్లో కౌన్సెలింగ్ ద్వారా చేపట్టే ప్రవేశాలు పోగా మరో 1.76 లక్షల సీట్లు ఖాళీగా ఉన్నాయి. వాటిల్లో యాజమాన్యాల ఆధ్వర్యంలో ప్రవేశాల కోసం స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియను ఈ నెల 14 నుంచి 18 వరకు చేపట్టి పూర్తి చేయాలని లింబాద్రి వెల్లడించారు. ప్రవేశాలను పూర్తి చేసి, విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. స్పాట్ అడ్మిషన్ల ద్వారా కాలేజీల్లో చేరే విద్యార్థులు రూ.400 రిజిస్ట్రేషన్ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు. విద్యార్థులు ఈ చివరి అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని వివరించారు.

నేడు స్పెషల్ రౌండ్ సీట్ల కేటాయింపు

ఇప్పటి వరకు ఐదు దశల్లో చేపట్టిన డిగ్రీ కౌన్సెలింగ్ ద్వారా 1,74,239 మంది విద్యార్థులు కాలేజీల్లో చేరారు. అయితే విద్యార్థుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు దోస్త్ మరో విడత కౌన్సెలింగ్‌ను స్పెషల్ రౌండ్ పేరుతో ఈ నెల 9 నుంచి 13 వరకు నిర్వహించింది. ఇందులో 6,997 మంది విద్యార్థులు డిగ్రీ ప్రవేశాల కోసం కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వారితో పాటు గతంలో తమ మార్కులకు అనుగుణంగా సరిపడా వెబ్ ఆప్షన్లు ఇవ్వకపోవడంతో సీట్లు రాని వారు, సీట్లు వచ్చినా కాలేజీల్లో రిపోర్ట్ చేయని వారు కలిపి మొత్తం 16 వేల మంది విద్యార్థులు తాజాగా వెబ్ ఆప్షన్లు ఇచ్చుకున్నారు. వారికి ఈ నెల 14న సీట్లు కేటాయిస్తామని లింబాద్రి వెల్లడించారు. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 15, 16 తేదీల్లో కాలేజీల్లో రిపోర్ట్ చేయాలని సూచించారు. ప్రైవేటు కాలేజీలతో పాటు సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, దోస్త్ పరిధిలో లేకుండా సొంతంగా ప్రవేశాలు చేపట్టిన కాలేజీలన్నీ విద్యార్థుల సమగ్ర వివరాలను ఈనెల 18 లోగా అందజేయాలని వివరించారు.

మీవి విద్వేష రాజకీయాలు

- తెలంగాణపై అడుగడుగునా వివక్ష చూపారు
- బీజేపీపై ఎమ్మెల్యే బాల్క సుమన్ ధ్వజం

సాక్షి, హైదరాబాద్: బీజేపీతోనే బంగారు తెలంగాణ సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ చేసిన వ్యాఖ్యలు దయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందని చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్ పేర్కొన్నారు. విద్వేష రాజకీయాలు రెచ్చగొట్టి, రక్తపుటేరులు పారించే లక్ష్యం బీజేపీది అని ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం ఆయన బీజేపీకి బహిరంగ లేఖ రాశారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాలకు రూ.24 వేల కోట్ల నిధులివ్వాలని నీతి ఆయోగ్ సిఫార్సు చేసినా చిల్లిగవ్వ ఇవ్వని మీ పార్టీతో బంగారు తెలంగాణ సాధ్యమా అని నిలదీశారు. ''కాళేశ్వరానికి నిధులివ్వాలని, జాతీయ హోదా కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నెత్తీనోరూ కొట్టుకున్నా రూపాయి కూడా విదల్చని మీరు బంగారు తెలంగాణ చేస్తారంటే ప్రజలు నమ్ముతారనుకుంటున్నారా? యూపీఏ-2 ప్రభుత్వం ఇచ్చిన ఐటీఐఆర్ ప్రాజెక్టును మూలన పడేసింది మీ ప్రభుత్వం కాదా? రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన ఎస్టీ, బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లులను కేంద్ర సర్కారు బుట్టదాఖలు చేసిందనే విషయం రాష్ట్ర బీజేపీ నాయకత్వానికి తెలియదా? విభజన హామీలను గత ఐదేళ్లలో ఏనాడూ కేంద్రం పరిశీలించలేదు. వీటిపై రాష్ట్ర బీజేపీ నాయకత్వం ఎప్పుడైనా కేంద్రాన్ని అడిగిందా? అలాంటి మీరు బంగారు తెలంగాణ గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉంది''అని సుమన్ పేర్కొన్నారు.

విభజన చట్టంలోని హామీలేవి?

తెలంగాణ అభివృద్ధి విషయంలో బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అడుగడుగునా వివక్ష చూపించిందని బాల్క సుమన్ ఆరోపించారు. విభజన చట్టంలోని ట్రైబల్, హార్టీకల్చర్ యూనివర్సిటీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. అలాగే ఖమ్మం జిల్లా బయ్యారంలో నిర్మించ తలపెట్టిన ఉక్కు పరిశ్రమ ఏమైంది? ఖాజీపేటలో పెడతామన్న కోచ్ ఫ్యాక్టరీ ఏమైంది? వెనకబడిన జిల్లాల అభివృద్ధికి ఇస్తామన్న గ్రాంట్లు ఏమయ్యాయి? తెలంగాణలో కొత్త జిల్లాలు ఏర్పడి మూడేళ్లు గడుస్తున్నా ప్రతి జిల్లాకు ఇవ్వాల్సిన కేంద్రీయ విద్యాలయం, నవోదయ విద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రాలు ఎక్కడ''అని నిలదీశారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు తెలంగాణ అభివృద్ధికి సహకరించకపోగా అడుగడుగునా తెలంగాణపై విషం చిమ్ముతూ అబద్ధాలు చెబుతూ వచ్చారని మండిపడ్డారు. సమయం సందర్భం లేకుండా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై అక్కసు ప్రదర్శిస్తున్నారని ధ్వజమెత్తారు. ''2014లో తెలంగాణ బిల్లును లోక్‌సభలో ఆమోదించే సందర్భంలో మీ కేంద్ర నాయకత్వం అడుగడుగునా ఆటంకాలు సృష్టించింది వాస్తవం కాదా? రాజ్యసభలో సవరణల పేరుతో బిల్లును అడ్డుకోవాలని కుట్రలు చేసింది నిజం కాదా? ఏనాడూ మీ పార్టీ తెలంగాణ విషయంలో స్పష్టమైన వైఖరిని, చిత్తశుద్ధిని ప్రదర్శించలేదు. అలాంటి మీతో బంగారు తెలంగాణ సాధ్యమా? మీ విద్వేష రాజకీయాలను, తెలంగాణ వ్యతిరేక వైఖరిని, ప్రజలు ఎన్నటికీ మరచిపోరు''అని సుమన్ ఆ లేఖలో పేర్కొన్నారు.

ఖర్చు చేసిందెంత.. చేయాల్సిందెంత?

ప్రాజెక్టుల వ్యయంపై సీఎం కేసీఆర్ సమాధానం చెప్పాలి: లక్ష్మణ్

సాక్షి, హైదరాబాద్: 'కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులను ఎన్ని రోజుల్లో పూర్తి చేస్తారు, వాటి అంచనా వ్యయం ఎంత, ఇప్పటి వరకు ఖర్చు చేసింది ఎంత, ఇంకా ఖర్చు చేయాల్సింది ఎంతో సీఎం కేసీఆర్ సమాధానం చెప్పాలి'అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దేవుడి దయతో వర్షాలు పడి ప్రాజెక్టులు నిండితే అది కేసీఆర్ గొప్పతనం ఎలా అవుతుందని ప్రశ్నించారు. కృష్ణా నదిపై ప్రాజెక్టులు పూర్తయి ఉంటే దక్షిణ తెలంగాణలో కరువు వుండేదే కాదని, కేసీఆర్ నిర్వాకం వల్ల నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు పూర్తి కాకపోవడంతో కృష్ణా నీళ్లు వృథా అయి దక్షిణ తెలంగాణ కరువుతో కొట్టుమిట్టాడుతోంది' అని పేర్కొన్నారు. రాజకీయ అవసరాలకు అనుగుణంగా సెంటిమెంటును వాడుకోవడం ఒక్క కేసీఆర్‌కే చెల్లుతుందని, అయితే అన్నివేళలా అది పనిచేస్తుందనుకోవడం మూర్ఖత్వమే అవుతుందన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ పార్టీని ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు.

రాయలసీమ అభివృద్ధిని ఏపీ సీఎం చూసుకుంటారు..

కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.లక్ష కోట్లు ఖర్చు చేసినా తెలంగాణకు నీళ్లివ్వని కేసీఆర్ రాయలసీమను రతనాలసీమగా మార్చేందుకు కృషి చేస్తాననడం హాస్యాస్పదంగా ఉందని లక్ష్మణ్ పేర్కొన్నారు. రాయలసీమ, ఆంధ్ర సెటిలర్ల లో ఉన్న వ్యతిరేకతను తగ్గించుకొని రానున్న మున్సిపల్ ఎన్నికల్లో లబ్ధి పొందాలని కేసీఆర్ చూస్తున్నారని అన్నారు. రాయలసీమ అభివృద్ధిని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చూసుకుంటారని పేర్కొన్నారు. తెలంగాణ కరువు కష్టాలు తీరేమార్గం చూడకపోగా, ఆలస్యంగా వర్షాలు పడ్డాయి కదా అని కరువేలేదని భావించడం సరైంది కాదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు గతంలో కంటే చాలా తక్కువగా సాగుచేశాని, దీనిపై ఉన్నత స్థాయి సమీక్ష జరిపి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. ప్రాజెక్టుల నిర్మాణానికి అయిన ఖర్చుపై శ్వేతపత్రం విడుదల చేయాలని లక్ష్మణ్ డిమాండ్ చేశారు.

ఆరోగ్య తెలంగాణ లక్ష్యం

సిరిసిల్లలో ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న కేటీఆర్, ఎల్వీ ప్రసాద్, హెటెరో సంస్థల ప్రతినిధులు

- అందరి హెల్త్ ప్రొఫైల్స్ తయారు చేస్తున్నాం
- పేదల సేవలో ప్రైవేటు సంస్థలు ముందుండాలి
- ఐదేళ్లలో రాష్ట్రంలో కంటి సమస్యలు పరిష్కారం
- టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- సిరిసిల్లలో ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన

సిరిసిల్ల: ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుకు సాగుతున్నారని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కె.తారక రామారావు అన్నారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో హైదరాబాద్‌కు చెందిన ఎల్వీ ప్రసాద్ వైద్యవిజ్ఞాన సంస్థ సిరిసిల్లలో ఏర్పాటు చేస్తున్న కంటి ఆస్పత్రి భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కంటి సమస్యల పరిష్కారానికి కంటి వెలుగు పథకాన్ని సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. వచ్చే ఐదేళ్లలో రాష్ట్రంలో క

రాములోరి వారసులం..

అయోధ్యలో రామజన్మభూమి-బాబ్రీ మసీదుకు సంబంధించిన వివాదాస్పద స్థల యాజమాన్య హక్కులపై సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో.. తాజాగా శ్రీరాముడి వారసుల అంశం తెరపైకి వచ్చింది. శ్రీరాముడి వారసులెవరైనా ఇంకా అయోధ్యలో ఉన్నారా? అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ విచారణలో భాగంగా ఇటీవల ప్రశ్నించడంతో రఘుకుల రాముడి వారసులం మేమేనంటూ కొన్ని రాజవంశాలు ప్రకటించాయి. ఆ వివరాలు..

కుశుడి వంశస్తులం: జైపూర్ యువరాణి దియా కుమారి

రాముడి వారసులం తామేమని జైపూర్ యువరాణి, రాజ్ సమంద్ ఎంపీ దియా కుమారి ప్రకటించారు. తమ రాజవంశీకుల చరిత్రను సుప్రీంకోర్టు ఎదుట సాక్ష్యాధారాలతో సహా రుజువుచేసేందుకు సిద్ధమన్నారు. పదేళ్ళ క్రితం జైపూర్ మహారాణి దియా కుమారి తల్లి పద్మినీదేవి కూడా తాము రాముడి వారసులమని ప్రకటించిన విషయం గమనార్హం. జైపూర్ రాజు, తన భర్త భవానీ సింగ్ కుశుడికి 309వ వంశీకుడని ఆ రోజు ఆమె ప్రకటించారు.

మాది లవుడి వంశం: సతేంద్రరాఘవ్



'రాముడికి నిజమైన వారసులం మేమే' అని రాజస్తాన్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి సత్యేంద్ర రాఘవ్ చెప్పారు. అందుకు వాల్మీకి రామాయణంలో కూడా సాక్ష్యాలున్నాయన్నారు. తాము రాముడి కుమారుడైన లవుడి తరువాత మూడవ తరానికి చెందిన బద్గుజార్ గోత్రస్తులమన్నారు. 'బద్గుజార్ వంశం రాముడి పెద్ద కుమారుడు లవుడి వంశం. ప్రస్తుత అయోధ్యలోని నార్త్ కౌశల్ నుంచి ఛత్తీస్‌గఢ్‌లోని సౌత్ కౌశల్ వరకు లవుడి సామ్రాజ్యం విస్తరించి ఉందని వాల్మీకి రామాయణం స్పష్టం చేస్తోంద'న్నారు.

మాదీ శ్రీరాముని వంశమే: మేవార్ రాజకుటుంబం

శ్రీరాముడి వంశమైన ఇక్ష్వాక వంశం వారసులం తామని మేవార్ రాజకుటుంబీకులు చెబుతున్నారు. ' మేము రాముని వారసులం అనేది చరిత్ర చెప్పే సత్యం. అయితే, మేం రామజన్మభూమిపై హక్కులు కోరబోం. అక్కడ రామాలయం నిర్మించాలన్నదే మా అభిమతం' అని **అరవింద్ సింగ్ మేవార్** ట్వీట్ చేశారు.

సూర్యవంశీ రాజ్‌పుత్‌లు కూడా..

'సూర్యవంశీ రాజ్‌పుత్‌లమైన మేం కూడా శ్రీరాముడి వంశస్తులమే. ఇది సత్యం. మా వద్ద సాక్ష్యాలు కూడా ఉన్నాయి. కోర్టు కోరితే ఇస్తాం' అని రాజస్తాన్ రవాణా శాఖ మంత్రి **ప్రతాప్ సింగ్ కచరియావాలా** స్పష్టం చేశారు.

క్లుప్తంగా...

వివాదాస్పద స్థలంలో రామాలయం ఉండేదా?

న్యూఢిల్లీ: వివాదాస్పద రామ జన్మభూమి-బాబ్రీ మసీదు కేసు రోజువారీ విచారణలో భాగంగా మంగళవారం రామాలయానికి సంబంధించిన పలు అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. ప్రస్తుతం వివాదాస్పదంగా ఉన్న స్థలంలో గతంలో రామాలయం ఉండేదా? అనే అంశంపై రామ్ లల్లా విరాజ్‌మాన్ అనే హిందూ సంస్థ తరపున సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ సుప్రీంకోర్టులో వాదనలు వినిపించారు. ప్రస్తుతం మసీదు ఉన్న ప్రాంతంలో ఒకప్పుడు ఆలయం ఉండేదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనానికి నివేదించారు.

...అందుకే ఫీజు పెంచాం

న్యూఢిల్లీ: భారీ స్థాయిలో పెంచిన 10, 12 తరగతుల బోర్డు పరీక్షల ఫీజుపై సీబీఎస్ఈ వివరణ ఇచ్చింది. రూ. 200 కోట్ల ఆర్థిక లోటు వల్లే ఫీజులు పెంచాల్సి వచ్చిందని బోర్డు కార్యదర్శి అనురాగ్ త్రిపాఠీ మంగళవారం తెలిపారు. 10, 12 తరగతుల పరీక్షా నిర్వహణకు దాదాపు రూ. 500 కోట్ల ఖర్చు అవుతోందని అన్నారు. ఇప్పటి వరకూ నీట్, జేఈఈ వంటి పరీక్షల నిర్వహణ ద్వారా ఆర్థిక వెసులుబాటు ఉండేదన్నారు. ఇప్పుడు అవి మానవ వనరులు, అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కిందకు వెళ్లిపోయాయన్నారు. దీంతో తప్పనిసరై పరీక్ష ఫీజులను పెంచాల్సి వచ్చిందన్నారు. ఇప్పటికే బోర్డు రూ. 200 కోట్ల లోటుతో నడుస్తోందన్నారు.

మన్మోహన్ నామినేషన్

జైపూర్: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ రాజస్తాన్ నుంచి రాజ్యసభ స్థానానికి జైపూర్‌లో మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. రాజస్థాన్ అసెంబ్లీలోని రిటర్నింగ్ అధికారికి నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలను ఆయన అందజేశారు. బీజేపీ సీనియర్ నేత, ఎంపీ మదన్‌లాల్ సైనీ కన్నుమూయడంతో ఖాళీ అయిన రాజ్యసభ స్థానానికి మన్మోహన్ పోటీ పడుతున్నారు. ఈ నెల 26న దీనికి ఎన్నికలు జరగనున్నాయి. మన్మోహన్ మూడు దశాబ్దాలుగా అస్సాం నుంచి పెద్దల సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. రాజస్తాన్‌లో కాంగ్రెస్‌కు మెజారిటీ స్థానాలుండటంతో మన్మోహన్ సునాయాసంగా ఎన్నికయ్యే అవకాశముంది.

భ్రమల్లో బతకొద్దు..!

సరిహద్దులో భారత జవాను పహారా

- స్వదేశీయులకు హితవు పలికిన పాక్ విదేశాంగ మంత్రి ఖురేషి
- అంతర్జాతీయ సమాజం కలిసిరాదని స్పష్టీకరణ
- ఎల్‌వోసీలో బలగాల పెంపుపై ఆందోళన వద్దన్న భారత ఆర్మీ చీఫ్

ఖురేషి

ఇస్లామాబాద్/న్యూఢిల్లీ/జమ్మూ: దాయాది దేశం పాకిస్తాన్ ఎట్టకేలకు సత్యం తెలుసుకుంది. కశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపత్తిని రద్దు చేస్తూ భారత్ తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా ఐరాసతోపాటు అంతర్జాతీయ సమాజం మద్దతు కూడగట్టడం అసాధ్యమని తెలుసుకుంది. ఈ విషయం స్వయంగా పాక్ విదేశాంగ మంత్రి షా మహ్మూద్ ఖురేషీ మాటల్లోనే తెలిపోయింది. కశ్మీర్‌పై భ్రమల్లో జీవించడం ఆపేయాలని ఆయన స్వదేశీయులకు హితవు పలికారు. మంగళవారం పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ముజఫరాబాద్‌లో ఖురేషీ మీడియాతో మాట్లాడుతూ ఐరాస మద్దతు పొందేందుకు కొత్తగా పోరాటం ప్రారంభించాలని పిలుపునిచ్చారు. 'మీరు (ప్రజలు) భ్రమల్లో జీవించడం మానేయాలి. మీ కోసం ఐక్యరాజ్యసమితిలో పూలదండలు పట్టుకుని సిద్ధంగా ఎవరూ లేరు. అక్కడ ఎవరూ మీకోసం ఎదురుచూడటం లేదు' అని వ్యాఖ్యానించారు. 'ప్రపంచంలో ఒక్కో దేశానికి ఒక్కో రకమైన ప్రయోజనం ఉంటుంది. కోట్లాది మంది జనాభా ఉన్న దేశం భారత్. చాలా దేశాలు అక్కడ భారీగా పెట్టుబడులు పెట్టాయి. ముస్లిం దేశాలు మన వెనుకే ఉంటాయని మనం తరచూ అనుకుంటుంటాం. కానీ, వారికీ భారత్‌తో అనేక ఆర్థిక స్వయోజనాలున్నాయి. అందుకే, ముస్లిం దేశాలు కశ్మీర్ విషయంలో మనకు మద్దతు ఇవ్వకపోవచ్చు..' అంటూ ప్రత్యేకంగా ఏ దేశం పేరునూ ప్రస్తావించకుండా ఆయన పేర్కొన్నారు. అత్యంత సన్నిహిత దేశం చైనా కూడా భారత్, పాక్‌లు రెండూ పొరుగుమిత్రులంటూ చర్చల ద్వారానే విభేదాలను పరిష్కరించుకోవాలనడం తెలిసిందే.

దీటుగా స్పందిస్తాం: ఆర్మీ చీఫ్

జమ్మూకశ్మీర్‌లో పరిణామాల నేపథ్యంలో నియంత్రణ రేఖ (ఎల్‌వోసీ) వెంబడి పాక్ అదనపు బలగాలను మోహరించిందన్న వార్తలపై భారత్ ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్ స్పందించారు. 'గత కొద్ది రోజులుగా ఎల్‌వోసీ వెంట పాక్ బలగాల సంఖ్య పెరిగినా దానిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అన్ని ముందు జాగ్రత్తలు తీసుకున్నాం. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు మన బలగాలు సిద్ధంగా ఉన్నాయి' అని తెలిపారు.

దశలవారీగా ఆంక్షల సడలింపు

'ప్రాణనష్టం నివారించేందుకే ప్రజలకు అసౌకర్యం కలిగించక తప్పడం లేదు. వాస్తవ పరిస్థితుల ఆధారంగా దశలవారీగా ఆంక్షల సడలింపు చర్యలు చేపట్టే అధికారం స్థానిక యంత్రాంగానికే ఇచ్చాం' అని జమ్మూకశ్మీర్ ప్రిన్సిపల్ సెక్రటరీ రోహిత్ కన్సల్ తెలిపారు.

జమ్మూలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీట్

అక్టోబర్ 12 నుంచి శ్రీనగర్‌లో మూడు రోజుల పాటు గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమిట్ నిర్వహించనున్నట్లు జమ్మూకశ్మీర్ యంత్రాంగం ప్రకటించింది.

కాల్పులు అబద్ధం: హోం శాఖ

ఈ నెల 9న శ్రీనగర్ శివారులోని సౌరాలో ప్రజలపైకి భద్రతా బలగాలు కాల్పులు జరిపాయంటూ వస్తున్న వార్తలను కేంద్రం ఖండించింది. కశ్మీర్లో ఒక్క బుల్లెట్ కూడా పేల్చలేదని స్పష్టం చేసింది. '9వ తేదీన సౌరాలోని మసీదు నుంచి ప్రార్థనలు చేసి వస్తున్న వారిలో కలిసిపోయిన అల్లరిమూకలు భద్రతా బలగాలపై రాళ్లు రువ్వి రెచ్చగొట్టేందుకు యత్నించాయి. అయితే, బలగాలు సంయమనం పాటించాయి. ఎటువంటి కాల్పులు జరగలేదు' అని హోం శాఖ తెలిపింది. అయితే, ప్రభుత్వం చెబుతున్నట్లుగా కశ్మీర్లో అంతా ప్రశాంతంగా లేదని కొన్ని మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. భద్రతా దళాలకు చెందిన పెల్లెట్ గన్ గాయాలతో శ్రీనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరు చిన్నపిల్లల ఉదంతాలను చూపుతున్నాయి. ఆ ఇద్దరు చిన్నారుల్లో ఒకరు సోమవారం గాయపడగా, మరో బాలిక గత వారం గాయపడినట్లుగా పేర్కొన్నాయి.

బీజేపీలోకి 10 మంది ఎమ్మెల్యేలు

గ్యాంగ్‌టక్: ఈశాన్య రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో లేని లేదా అధికార సంకీర్ణంలో లేని రాష్ట్రం సిక్కిం ఒక్కటే. తాజాగా ఆ రాష్ట్రంలోనూ అధికారాన్ని చేజిక్కించుకునే దిశగా కమలదళం అడుగులు వేస్తోంది. అందులో భాగంగానే సిక్కిం డెమొక్రాటిక్ ఫ్రంట్(ఎస్‌డీఎఫ్)కు చెందిన 10 మంది ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకుంది. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జేపీ నడ్డా, ఈశాన్య రాష్ట్రాల పార్టీ ఇన్‌చార్జి రాంమాధవ్‌ల సమక్షంలో మంగళవారం వారు బీజేపీలో చేరారు. ప్రస్తుతం సిక్కింలో ఎస్‌కేఎం అధికారంలో ఉంది. ఇటీవలి ఎన్నికల్లో మొత్తం 32 స్థానాలకు గానూ 17 సీట్లను ఎస్‌కేఎం గెలుచుకుంది. పవన్ కుమార్ చామ్లింగ్ నేతృత్వంలోని సిక్కిం డెమొక్రాటిక్ ఫ్రంట్ 15 సీట్లను గెలుచుకుంది. వారిలో ఇద్దరు రాజీనామా చేయడంతో ఆ పార్టీకి ప్రస్తుతం 13 మంది ఎమ్మెల్యేలే ఉన్నారు. వారిలో 10 మంది ఇప్పుడు బీజేపీలో చేరడంతో ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలుచుకోని బీజేపీకి ఇప్పుడు సిక్కింలో ప్రధాన ప్రతిపక్ష హోదా లభించనుంది. మూడింట రెండు వంతులకు పైగా ఎమ్మెల్యేలు బీజేపీలో చేరినందున ఫిరాయింపుల నిరోధక చట్టం వారికి వర్తించదు. రాష్ట్రంలో నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరిస్తామని రాంమాధవ్ చెప్పారు.

కేంద్రానికి సమయం అవసరం

కశ్మీర్‌పై సుప్రీంకోర్టు వ్యాఖ్య

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లో పరిస్థితి చాలా సున్నితమైందని, అక్కడ ప్రశాంత వాతావరణం నెలకొనేలా కేంద్ర ప్రభుత్వానికి కొంత సమయం ఇవ్వాల్సి ఉందని సుప్రీంకోర్టు పేర్కొంది. ఆర్టికల్ 370 రద్దు అనంతరం కేంద్రం ఆ రాష్ట్రంపై విధించిన ఆంక్షలను తక్షణమే ఎత్తివేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను మంగళవారం విచారించిన అత్యున్నత న్యాయస్థానం ఈ విషయమై కేంద్రానికి ఆదేశాలు జారీ చేసేందుకు నిరాకరించింది. ఆర్టికల్ 370 రద్దు తర్వాత కేంద్ర ప్రభుత్వం జమ్మూకశ్మీర్‌పై పలు ఆంక్షలు విధించి, దూకుడుగా వ్యవహరించిందంటూ కాంగ్రెస్ నేత తెహ్సీన్ పూనావాలా దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను జస్టిస్ అరుణ్ మిశ్రా నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా కేంద్రం తరపున అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ వాదనలు వినిపించారు. 'రాష్ట్రంలో పరిస్థితులపై జిల్లాల మేజిస్ట్రేట్ల నుంచి ప్రభుత్వం రోజువారీ వాస్తవ నివేదికలను తీసుకుని సమీక్షిస్తోంది. తదనుగుణంగా ఆంక్షల సడలింపు చేపడుతోంది'అని తెలిపారు. ఇందుకు స్పందించిన ధర్మాసనం 'కశ్మీర్ చాలా సున్నితమైన అంశం. అక్కడ రాత్రికి రాత్రే అద్భుతాలు జరిగిపోవు. ఆ రాష్ట్రంలో వాస్తవంగా ఏం జరుగుతోందో ఎవరికీ తెలియదు. కానీ, ఆర్టికల్ 370 రద్దు తర్వాత ఇప్పటి వరకు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఒకవేళ ఏదైనా జరిగితే అందుకు కేంద్రానిదే బాధ్యత అవుతుంది. అందుకే సాధారణ పరిస్థితులు నెలకొన్నాక రెండు వారాల అనంతరం ఈ పిటిషన్‌ను విచారిస్తాం' అని తెలిపింది. వాదనల సందర్భంగా పిటిషనర్‌పై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. 'రాష్ట్రంలో సమాచార, ప్రసార వ్యవస్థలు పూర్తిగా స్తంభించిపోయాయి. అక్కడ మోహరించిన సైనికులకు కూడా తమ కుటుంబసభ్యులతో ఫోన్ ద్వారా మాట్లాడే అవకాశం లేకుండా చేశారు' అని పిటిషనర్ తరపు న్యాయవాది మేనకా గురుస్వామి తెలపగా ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రజలు కనీసం ఆస్పత్రులు, విద్యాసంస్థలు, పోలీస్‌స్టేషన్‌లకు కూడా వెళ్లేందుకు అవకాశం లేకుండా పోతోందని, వారి హక్కులకు భంగం కలుగుతోందంటూ న్యాయవాది గురుస్వామి పేర్కొనగా ఆధారాలుంటే చూపించాలని బెంచ్ కోరింది. 'తీవ్రతను అర్థం చేసుకోకుండా, వాస్తవాలు తెలియకుండా చాలా నిర్లక్ష్యంగా, ఆషామాషీగా ఈ పిటిషన్ వేసినట్లు కనిపిస్తోంది' అని అంది.

సాక్షి
బుధవారం, ఆగస్టు, 14

వానలు, వరదలు

పదేళ్ల సుదీర్ఘకాలం తర్వాత దేశంలో వర్షాలు సమృద్ధిగా పడుతున్నాయి. పదిరోజులుగా విడవకుండా కురుస్తున్న వానలతో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గోవా, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాల్లో జనావాసాలను వరదలు ముంచెత్తుతున్నాయి. ఎప్పుడూ లేనివిధంగా దక్షిణాది రాష్ట్రాల్లో రిజర్వాయర్లన్నీ నిండు కుండల్లా ఉన్నాయి. కృష్ణా బేసిన్‌లో పాతికేళ్ల తర్వాత తొలిసారి అన్ని ప్రాజెక్టుల గేట్లూ ఎత్తేయక తప్పలేదంటే పరిస్థితిని అంచనా వేయొచ్చు. ఆల్మట్టి, నారాయణపూర్, ఉజ్జయిని, తుంగభద్ర, జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టులన్నిటా అన్ని క్రస్ట్ గేట్లూ ఎత్తేయవలసి వచ్చింది. గోదావరి కూడా అదే జోరు ప్రదర్శించి కాస్త శాంతించింది. ఎప్పటిలాగే ఈసారి కూడా రుతుపవనాలు దెబ్బతీశాయని అనుకునేంతలోనే కురిసిన ఈ వర్షాలు సహజంగానే ప్రజానీకానికి ఎంతో ఊరటనిచ్చాయి. అయితే మహారాష్ట్ర, కేరళ, కర్ణాటకల్లో జనావాసాల్లోకి వరద నీరు ప్రవేశించడంతో ఆస్తినష్టంతోపాటు ప్రాణనష్టం తప్పలేదు. దేశవ్యాప్తంగా వరదల వల్ల దాదాపు 200మంది మరణించారు. లక్షలమందిని సురక్షిత ప్రాంతాలకు తరలించవలసి వచ్చింది. ఇప్పుడిప్పుడే వర్షాల తీవ్రత తగ్గడంతో నదులు శాంతిస్తున్నాయి.

నిన్న మొన్నటి వరకూ కరువుతో అల్లాడిన ప్రాంతాలన్నీ కుంభవృష్టి పర్యవసానంగా చిగురుటాకులా వణుకుతుండటం ఒక వైచిత్రి. మానవ తప్పిదాల కారణంగా పర్యావరణం దారుణంగా దెబ్బతిని వాతావరణ పరిస్థితులు ఊహకందని రీతిలో మారిపోతున్నాయి. అదునుకు వర్షాలు కురవక అనేక ప్రాంతాలు కరువుకోరల్లో చిక్కుకోవడం... కురిసిన సందర్భాల్లో ఒక్కసారే పదుల సెంటీమీటర్ల వర్షం ముంచెత్తడం ఇటీవలకాలంలో తరచు చూస్తున్నాం. ఈసారి అనేక ప్రాంతాల్లో 50 శాతం మొదలుకొని 140 శాతం అధిక వర్షపాతం నమోదైంది. మైసూరు వంటి ప్రాంతాల్లో ఇంతకు మించి మరెన్నో రెట్లు ఎక్కువగా వర్షపాతం నమోదైంది. మూడు వైపులా సముద్రం ఉన్న మన దేశానికి వాయుగుండాలు, తుపానులు, వరదలు తప్పవు. వీటివల్ల తరచుగా భారీగా ప్రాణనష్టం, ఆస్తి నష్టం తప్పడం లేదు. 'వాన రాకడ, ప్రాణం పోకడ ఎవరికీ తెలియద'ంటారు. వైజ్ఞానిక ప్రగతి పర్యవసానంగా ఆ రెండూ తెలుసుకోవడం ఇప్పుడెంతో మెరుగైంది. కానీ ఇప్పటికీ అవి పూర్తిగా అంచనా వేయడం అసాధ్యమవుతున్నది. ఎల్ నినో పర్యవసానంగా వర్షాభావ పరిస్థితులు ఏర్పడవచ్చునని లేదా లా నినా వల్ల కుంభవృష్టి తప్పదని వాతావరణ శాఖ చెబుతుంటుంది. రాగల 24 గంటలు లేదా 48 గంటలూ ఎలాంటి పరిస్థితులుంటాయో అంచనా వేస్తోంది. అవి చాలావరకూ మెరుగ్గానే ఉంటున్నాయి. కానీ మరింత నిర్దిష్టంగా, నిర్దుష్టంగా చెప్పడం మాత్రం ఇంకా సాధ్యపడటం లేదు. విషాదమేమంటే చెప్పిన మేరకైనా ప్రభుత్వాలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోలేకపోతున్నాయి. మహారాష్ట్రలోనైనా, కర్ణాటకలోనైనా పరిస్థితి ఇదే. అక్కడ వరదలు ముంచెత్తాక సైన్యం, విపత్తు నివారణ బృందాలు రంగంలోకి దిగి సేవలందించాయి. అదంతా ప్రశంసించదగ్గదే. కానీ ఆ రాష్ట్రాల్లో అవసరమైన స్థాయిలో సమన్వయం లేకపోవడం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. అధికార యంత్రాంగంలోని భిన్న వ్యవస్థలు ఎప్పటికప్పుడు సంప్రదించుకుంటూ, ఎక్కడేది అవసరమో చూసుకుంటూ ముందస్తు చర్యలు తీసుకుంటే నష్టాన్ని కనిష్ట స్థాయికి పరిమితం చేసే వీలుండేది. ముఖ్యంగా ఎగువ ప్రాంతాల్లోని రిజర్వాయర్లలో నీటిని విడతల వారీగా విడుదల చేస్తే ఇంతచేటు నష్టం ఉండేది కాదని నిపుణులు చెబుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలు తలెత్తినప్పుడల్లా ఇలాంటి లోపాలపై చర్చ జరగడం రివాజుగా మారినా అధికార యంత్రాంగాల్లో మార్పు రావడం లేదు. మనకు మొత్తంగా 5,344 భారీ ఆనకట్టలున్నాయి. వీటిల్లో 75 శాతం పాతికేళ్ల నాటివి. మరో 164 వందేళ్లక్రితానివి. దాదాపు 40 ఆనకట్టలు తెగిపడిన సందర్భాలున్నాయి.

మన దేశానికి 7,517 కిలోమీటర్ల పొడవునా తీరప్రాంతం ఉంది. ఇక్కడ ఉన్న 84 జిల్లాల్లో 77 నగరాలు, 130 పట్టణాలు ఉన్నాయి. ముంబై, కోల్‌కతా, చెన్నై, విశాఖపట్టణంవంటి నగరాలు దేశ ఆర్థిక వ్యవస్థకూ, దాని పురోగతికీ ఎంతగానో ఆయువుపట్టువంటివి. దాదాపు 26 కోట్లమంది ప్రజానీకం లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్నారు. ఈ తీరప్రాంతాన్ని ప్రాణప్రదంగా చూసుకుంటేనే పర్యావరణం పదిలంగా ఉంటుంది. కనుకనే సముద్ర తీరం, జల వనరులుండే చోట 500 మీటర్ల సమీపంలో ఎలాంటి శాశ్వత కట్టడాలు, నిర్మాణాలు చేయకూడదని కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సీఆర్‌జడ్) నిబంధనలు చెబుతున్నాయి. అయితే ఆ నిబంధనల్ని ప్రభుత్వాలే బేఖాతరు చేసి విచ్చలవిడిగా అనుమతులిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు హయాంలో కృష్ణా కరకట్టమీద అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకపోగా, ప్రభుత్వమే 'ప్రజావేదిక' పేరుతో భవనం నిర్మించింది. రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వచ్చాక ఆ భవంతిని కూల్చడానికి చర్యలు తీసుకుంటే చంద్రబాబు ఎంత గగ్గోలు పెట్టారో అందరూ చూశారు. కృష్ణానదిలో వరద నీటి ప్రవాహం ఆగకుంటే ఆయన ఉంటున్న నివాసం కూడా ఇప్పుడు మునిగే ప్రమాదం ఉంది. అక్కడే కాదు...ఆ రాష్ట్రంలో చాలాచోట్ల సీఆర్‌జడ్ నిబంధనలను అడ్డగోలుగా ఉల్లంఘించారు. ఇష్టానుసారం రిసార్ట్‌లు, హోటళ్లు వగైరాలు నిర్మించారు. నిజానికి సీఆర్‌జడ్ నిబంధనల్ని కూలంకషంగా అధ్యయనం చేసి, జరుగుతున్న నష్టాల్ని గమనించి వాటిని ఎప్పటికప్పుడు సవరిస్తూ వచ్చారు. అయినా ఉల్లంఘనలు తరచు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పుడొచ్చిన వరదలు చూశాకైనా ఇలాంటి నియంత్రణలపై రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తంగా ఉండాలి. కఠినంగా వ్యవహరించాలి. అలాగే ఇప్పుడు అనుసరిస్తున్న వరద నియంత్రణ చర్యల్లోనూ, సహాయం అందించడంలోనూ ఎదురవుతున్న సమస్యల్ని గమనించి, లోటుపాట్లను గుర్తించి సరిదిద్దుకోవాల్సిన అవసరం ఉంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, తిథి శు.చతుర్దశి ప.2.45 వరకు
తదుపరి పౌర్ణమి, నక్షత్రం శ్రవణం పూర్తి (24 గంటలు)
వర్జ్యం ఉ.10.01 నుంచి 11.43 వరకు
దుర్ముహూర్తం ఉ.11.38 నుంచి 12.28 వరకు
అమృతఘడియలు... రా.8.26 నుంచి 10.11 వరకు.

సూర్యోదయం : 5.45
సూర్యాస్తమయం: 6.25
రాహుకాలం : ప. 12.00 నుంచి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుంచి 9.00 వరకు

ఏది విజయం.. ఏది వైఫల్యం?

విశ్లేషణ

ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

స్వాతంత్ర్య దినోత్సవం అంటే ఒకప్పుడు పిల్లలకు పండుగదినం. 72 ఏళ్ల క్రమంలో నచ్చిన పార్టీకి ఓటువేసే, నచ్చని పార్టీని తిరస్కరించే రాజకీయ స్వేచ్ఛ మనకు వచ్చిందేమో కానీ మన సామాజిక వ్యవస్థ నేటికీ అప్రజాస్వామ్యంగానే కొనసాగుతోంది. కులం, అంటరానితనం, మహిళల అసమానత దీని మౌలిక లక్షణాలు. దేవుడు భారతీయులను అసమానంగా సృష్టించాడన్న ఆధ్యాత్మిక ఫాసిజం ఇప్పుడు మతం రూపంలో రాజ్యమేలుతోంది. ఆగస్టు 15, జనవరి 26 రావచ్చు, వెళ్లిపోవచ్చు. కానీ మన మేధో చింతనలో ఆధ్యాత్మిక ప్రజాస్వామ్యం కీలక చర్చనీయాంశంగా మారకపోతే మన రాజ్యాంగ సంవిధానం ఏ సమయంలోనైనా కుప్పకూలే ప్రమాదం ఉంది. మన ప్రజాస్వామ్యంలో మానవులకంటే జంతువులు మరింత గౌరవప్రదంగా మనుగడ సాగిస్తున్నాయి. వాటికి ఆధ్యాత్మికం, సామాజికం, రాజకీయం అనేవి తెలీవు కాబట్టి.

ఆగస్ట్ 15 అంటే మేం చదువుకునే రోజుల్లో పాఠశాలకు పండుగ దినం అన్నమాట. 1950ల చివర్లో, 1960ల ప్రారంభంలో నా పాఠశాల రోజుల్లో ఈ రోజుకు ఒక ప్రత్యేకత ఉండేది. జెండా వందనం, తీపి మిఠాయి తినడం మా జ్ఞాపకాల్లో మిగిలి ఉంటోంది. 8 లేక 9 ఏళ్ల వయస్సులో గొడ్లు కాచే పని నుండి బలవంతంగా బడిచదువుకు మారిన అబ్బాయిగా బడి అంటే నాకు జైలులాగే తలపించేది. కానీ స్కూల్లో చేరిన తర్వాత తొలి ఆగస్టు 15 వచ్చినప్పుడు ఏదో తెలీని ఆనందం కలిగింది. ఆరోజు కాళ్లు ముడుచుకుని దుమ్ము నేలపై కూర్చునే పని ఉండేది కాదు. అది రహదారులపై ఆడుకునే రోజు. ఆరోజు పెన్సిల్ లేక కొత్త పలక వంటి చిన్ని బహుమతులు పొందవచ్చు అనే ఆశ పరవశం కలిగించేది. స్కూల్లో చేరిన తర్వాత తొలి ఆగస్టు 15న మా అన్నకు బహుమతి వచ్చింది. నాకు రాలేదని నాకు ఇప్పటికీ గుర్తు ఉంది. ఇక్కడే నా వైఫల్యం, దాంతోపాటు అసూయ మొదలయ్యింది. బహుమతి రాకపోవడం అనేది వైఫల్యంతో ఇంకా ఎక్కువగా ఎలా పోరాడాలో నేర్పింది. అసూయ అనేది వైఫల్యాన్ని ఎలా అధిగమించాలో నేర్పించింది.

ఆ తర్వాత అనేక ఆగస్టు 15లు గడిచిపోయాయి. ఆనాడు నా తొలి ఆటలో నేను ఓడిపోయినట్లుగా భారతజాతి వైఫల్యం పొందిందా లేక ఇరుగుపొరుగు దేశాల్లో అసూయ రేకెత్తించడం ద్వారా మా తమ్ముడిలాగా విజయం పొందిందా? అనే అంశాన్ని మదింపు చేయాలనుకుంటున్నాను. మనది రాజకీయ ప్రజాస్వామ్యం. ఇక్కడ నాకు నచ్చని పార్టీ అధికారంలోకి వచ్చినప్పటికీ, వచ్చే ఎన్నికల్లో దానికి వ్యతిరేకంగా ఓటు వేసే స్వాతంత్ర్యం నాకు ఉంటుంది. వచ్చే ఎన్నికల్లో దానికి వ్యతిరేకంగా ఓటు వేస్తాననే ఆశతో నేను జీవిస్తాను. ఇది నా విజయం.

కానీ మనకు అప్రజాస్వామికమైన సామాజిక వ్యవస్థ ఉంది. పార్టీలు అధికారంలోకి వస్తుంటాయి, తప్పుకుంటాయి. కానీ కులం, అంటరానితనం, మహిళల అసమానతలతో కూడిన భారత అప్రజాస్వామిక సామాజిక వ్యవస్థ కొనసాగుతూనే ఉంటుంది. నామీద, ప్రతి ఒక్కరిమీద అణచివేత, హింస వేలాడుతూనే ఉంది. ఈ సామాజిక వ్యవస్థలో పేదలు, పీడితులు కడగండ్లపాలవుతుండగా, ధనికులు సైతం అభివృద్ధి చెందిన మానవులుగా జీవించడం లేదు. ఇది మన వ్యవస్థ ఘోర వైఫల్యం. అప్రజాస్వామికమైన సామాజిక వ్యవస్థ భారత రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎలా కలిసి మనుగడ సాగిస్తోంది? ఎందుకంటే నా దృష్టిలో భారతీయ పౌర సమాజం అప్రజాస్వామికమైన ఆధ్యాత్మిక వ్యవస్థకు బంధీయై ఉంది.

ఈ 21వ శతాబ్ది ఆధునిక పెట్టుబడిదారీ వ్యవస్థలోనూ మన సామాజిక సంబంధాలను పాలించడంలో మతం కీలకపాత్ర పోషిస్తూ ఉంది. ప్రస్తుతం హిందూయిజంగా పేరుమార్చుకున్న భారతీయ బ్రాహ్మణవాదం దేవుడు భారతీయులను అసమానంగా సృష్టించాడన్న ఆధ్యాత్మిక ఫాసిజాన్ని నియమబద్ధంగా సంస్థాగతం చేసిపడేసింది. ఈ నేలపై కొనసాగుతున్న ఇతర మతాలు కూడా తమ సామాజిక సంబంధాలను (ఇస్లాం, క్రిస్టియానిటీ, సిక్కిజం తదితరాలు)

విశాల ప్రాతిపదికన బ్రాహ్మణవాద నైతిక వ్యవస్థ పరిధిలోనే కొనసాగిస్తున్నాయి. అందువల్లనే భారత రాజ్యాంగం దేశంలోని అన్ని ఆధ్యాత్మిక వ్యవస్థలకు చెందిన దిగువకులాలు, నిరుపేదలు, మహిళలకు సమానహక్కులను అందిస్తున్నప్పటికీ అనేక సామాజిక రంగాల్లో వీరు అవమానాలు, అసమానతల బారిన పడుతున్నారు.

పీడకుల హృదయ పరివర్తనవల్ల కాకుండా, పీడితులు త్యాగాలు చేస్తున్న కారణంగానే భారతీయ రాజ్యాంగ సంవిధానం మనుగడ సాగిస్తోంది. హిందువులకు (రామరాజ్యం) ఓటు వేసి అధికారం కల్పిస్తే స్వర్గం నేరుగా భారతీయ భూమిపైకి వచ్చి వాలుతుందని బీజేపీ, ఆరెస్సెస్ ప్రకటిస్తున్నాయి. మన దేశంలో కొంతమంది గోవులను పూజించదల్చినట్లయితే, పశువులను తోలుకుపోయేవారిని చిత్రహింసలకు గురిచేస్తారు. కొంతమంది ప్రజలు తమ దేవుడిపై నమ్మకం లేని ఇతరులను కూడా ఆ దేవుడినే పూజించాలని ఒత్తిడికి గురిచేస్తుంటారు. ఫలానా దేవుడిని మేం ఆరాధిస్తాం అని దళితులు ప్రకటిస్తే వారిని దేవాలయం నుంచి వెళ్లగొడతారు, చావగొట్టి చిత్రహింసలు పెడతారు. ఇతరులను చిత్రహింసలకు గురిచేసే ప్రతి ఒక్క అంశాన్ని, ప్రజాస్వామ్యానికి నమూనాగా నిర్వచిస్తుంటారు.

దేశంలోని అన్ని రాజ్యాంగ వ్యవస్థలూ ఆధ్యాత్మిక ఫాసిజం ఆదేశానుసారమే పనిచేస్తుంటాయి. ప్రజాస్వామ్యానికి అర్థం ఇదేనని రాజ్యాంగబద్ధ సంస్థలు ఆమోదిస్తుంటాయి. మన దేశంలోని మేధావులు చాలా తీవ్రమైన గందరగోళంలో ఉన్నారు. ఎందుకంటే, వీరు ప్రజాతంత్ర వాతావరణంలో ఉన్న కుటుంబాలలో పుట్టినవారు కాదు. మతపరమైన సెక్యులర్ మేధావులిద్దరికీ ఆధ్యాత్మిక ప్రజాస్వామ్యంలోనే ఉమ్మడి మూలాలున్నాయి. వీరిరువురూ ఒకే కుదురులోంచి వచ్చారు. అందుకే వీరు ఒక గొర్రెలకాపరిని మేధావిగా పరిగణించరు. మీరు లౌకికవాది అయితే ఈ అంశాన్ని ఉపేక్షించవచ్చు. లేదా మీరు హిందువైనట్లయితే దీన్ని జాతి వ్యతిరేకమనుకోవచ్చు. మనందరం ఎప్పటికీ గొర్రెల్లాగానే ఉండాలి. అంతే తప్ప మనం సమానత్వ దేవుడు సృష్టించిన జంతువులన్నింటినీ సమానంగా చూసే విమర్శనాత్మకమైన గొర్రెల కాపరిగా ఎన్నటికీ మారకూడదు.

మనుషులందరినీ సమానులుగా దేవుడు సృష్టించాడు అనే సూత్రబద్ధతతోనే మానవ జీవితంలోకి దైవ భావన ప్రవేశించింది. కానీ ఈదేశంలో బ్రాహ్మణ వాదం తన రచనల ద్వారా, రోజువారీ జీవితాచరణ ద్వారా, దేవుడు మనుషులను అసమానులుగా సృష్టించాడని ప్రకటించింది. దాన్ని భారతీయ ఇస్లాం, భారతీయ క్రిస్టియ నిజం కూడా ఆమోదించడమే కాకుండా తమ జీవితాచరణలో కూడా అసమానత్వాన్నే కీలకమైన అంశంగా స్వీకరించింది. మన దేశంలో చాలామంది మేధావులు తాము లౌకికవాదులమని భావిస్తుంటారు కానీ అన్ని మతాల పుట్టుకకు ఆధ్యాత్మక ఫాసిజమే మూలమనే అంశంపై చర్చించరు. వీరి దృష్టిలో వివిధ మతాలు ఉనికిలో ఉండటం అనేది సుందరమైన బహుళత్వానికి, వైవిధ్యతకు సంకేతమట. ఇలాంటి లౌకికవాదం వల్ల కూడా ఈదేశంలోని దళితులు, ఆదివాసులు, శూద్రులు కష్టాల్లో మునిగితేలుతున్నారు.

ఈ అంశాన్ని ఘనత వహించిన మన లౌకిక మేధావులు చర్చించరు. సామాజిక శాస్త్రం కాదు కాబట్టి ఆధ్యాత్మక వ్యవస్థపై చర్చ అనవసరం అనే బౌద్ధిక నిజాయితీ రాహిత్యం వీరిది. ప్రతి ఆధ్యాత్మిక అప్రజాస్వామ్యాన్ని చివరకు ఆధ్యాత్మిక ఫాసిజాన్ని కూడా సెక్యులరిజం తన ముసుగులో కప్పిపెడుతుంది. ఇదే యూనివర్సిటీల్లో, సివిల్ సర్వీసులో, రాజకీయరంగంలో వారి ఉద్యోగాలను కాపాడుతోంది మరి. అసమానత్వాన్ని దేవుడి ప్రసాదంగా ఎంచే మతం పాలిస్తున్నప్పుడు నిర్దిష్ట రాజకీయ ప్రజాస్వామిక చర్చ ఆ మతాన్ని కూడా చర్చలోకి లాగాల్సిందే. లేకుంటే ఆధ్యాత్మిక బానిసల సమ్మతితో విద్రోహులు అధికారం చేజిక్కించుకుంటారు.

ఆధ్యాత్మిక నిరంకుశాధికారత్వం, చివరకు ఫాసిజం కూడా వ్యవస్థాగత ఆధ్యాత్మికవాదంలో భాగమే. ఎందుకంటే బ్రాహ్మణవాదం ప్రతి భారతీయుడిలోకి చొచ్చుకుపోయింది. మానవులను అది బానిసత్వంలో లేక ఆధిపత్యం కింద జీవించేలా చేసింది. బ్రిటిష్ హయాంలో కొన్ని సంస్కరణలు ప్రారంభమైనా, భారతీయ ఆధ్యాత్మిక వ్యవస్థలు మాత్రం అప్రజాస్వామికంగానే కొనసాగుతూ వచ్చాయి. ప్రజాస్వామ్యం అంటే వీటి దృష్టిలో మానవ చింతనకు, పౌరసమాజానికి అతీతంగా జీవించే స్వయం ప్రతిపత్తి వ్యవస్థ అని అర్థం. కాని ఇది నిజం కాదు. 72 ఏళ్ల రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యం తర్వాత కూడా మానవ అసమానత్వం అనేది మన కాలానికి, వయస్సుకు, మనం స్వీకరించిన రాజకీయ వ్యవస్థకు ఏమాత్రం సరిపోలడం లేదు.

మన మేధో చింతన ప్రక్రియలో ఆధ్యాత్మిక ప్రజాస్వామ్యం కీలక చర్చనీయాంశంగా మారకపోయినట్లయితే మన రాజ్యాంగ సంవిధానం ఏ సమయంలోనైనా కుప్పకూలే ప్రమాదం ఉంది. ప్రపంచంలోని పలు దేశాల్లో దీన్ని మనం చూస్తున్నాం.

ప్రతి సంవత్సరం ఆగస్టు 15, జనవరి 26 (గణతంత్రదినం) రావచ్చు, వెళ్లిపోవచ్చు. యువత ముసలితనంలోకి ప్రవేశించవచ్చు. వృద్ధులు ఈ దేశంలో ఆధ్యాత్మక, సామాజిక సంబంధాల్లో మౌలిక మార్పులను చూడకుండానే మరణించవచ్చు కూడా. కానీ నా దేశ ప్రజాస్వామ్యంలో మానవులకంటే జంతువులు మరింత గౌరవప్రదంగా మనుగడ సాగిస్తున్నాయి. ఎందుకంటే వాటికి ఆధ్యాత్మకం, సామాజికం, రాజకీయం అనేవి తెలీవు కాబట్టి.

వ్యాసకర్త డైరెక్టర్, సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇంక్లూజివ్ పాలసీ

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

తప్పులు

"కశ్మీర్‌పై ఆర్టికల్ 370 ఎత్తివేయడంతో కొంపలు మునిగిపోయినట్టు ప్రతిపక్షాలు హాహాకారాలు చేస్తున్నాయి. దేశంలో అల్లర్లు చెలరేగుతాయని కూడా బెదిరిస్తున్నాయి. నోట్ల రద్దు సందర్భంలో ప్రతిపక్షాలు ఇలాంటి ఆరోపణలే చేసిన సంగతి గుర్తుకు వస్తోంది. గతంలో చేసిన తప్పుల నుంచి గుణపాఠం నేర్చుకుంటే అలాంటివేమీ జరగవనే సంగతి వారికి అర్థమయ్యేది"

– నైతిరి, డాక్టర్

జర్నలిజం

"కశ్మీర్ విషయంలో జర్నలిజం విలువలకు మేము కట్టుబడి ఉన్నాం. కశ్మీర్‌లో జరుగుతున్న సంఘటనలను వక్రీకరిస్తున్నామన్న ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నాం. మేము వాస్తవాలను మాత్రమే అందిస్తున్నాం. భద్రతా దళాలు భాష్పవాయువు ప్రయోగించాయి. షాట్ గన్స్‌తో కాల్పులు జరిపాయి. ఆర్టికల్ 370 ఎత్తివేసినప్పటి నుంచీ స్థానికులు నిరసన తెలుపుతున్నారు. యువకులు రాళ్లు రువ్వుతున్నారు. నిన్నంతా కర్ఫ్యూ విధించారు. పెద్దపెద్ద మసీదుల్లో ప్రార్థనలు అనుమతించలేదు. నిరసనలను చిత్రీకరిస్తుంటే సైనికులు అడ్డుకున్నారు. అంతర్జాతీయ సమాజంలో దేశ ప్రతిష్టకు భంగం కలుగుతుందన్నారు"

– షలూ యాదవ్, బీబీసీ జర్నలిస్ట్

సాధారణం

"కర్ఫ్యూ కొనసాగుతోంది. మీడియాపై ఆంక్షలు కొనసాగుతున్నాయి. ఇంటర్నెట్, మొబైల్ ఫోన్లు పనిచేయడం లేదు. 800 మంది రాజకీయ నాయకులు, కార్యకర్తలు ఇంకా అరెస్ట్ అయ్యే ఉన్నారు. కశ్మీర్ ప్రశాంతంగా ఉందనే నకిలీ వీడియోలు, ఫొటోలు విస్తృతంగా షేర్ అవుతున్నాయి. ప్రభుత్వం దీన్నేనా సాధారణ పరిస్థితి అంటున్నది? ప్రభుత్వం సుప్రీం కోర్టుకు ఒక రకంగా, ప్రజలకు మరో రకంగా సమాచారం ఇస్తోంది. వాస్తవ పరిస్థితులు తెలిసేదెలా?"

– సంఘమిత్ర, జర్నలిస్ట్

అన్నీ ఉన్నా..

'రాష్ట్రంలో వరద తీవ్రతను తగ్గించడానికి అవసరమైన ఆర్థిక వనరులు అటు కేంద్రం నుంచీ, ఇటు రాష్ట్రం నుంచీ కూడా ముఖ్యమంత్రి యడియూరప్పకు అందుబాటులో ఉన్నాయి. కానీ, మంత్రివర్గం లేకపోవడంతో మీరు అశక్తులు. మీకున్న పాతిక మంది అసమర్థ ఎంపీలు కనీసం వరదకు గురైన వారి నియోజకవర్గాలను కూడా సందర్శించలేదు"

– రామకృష్ణ నింబగల్, స్థానికుడు

దేశభక్తి

"ప్రతిసారీ స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు ఇలాగే ఉంటుందేమో. కానీ, ఈసారి ఢిల్లీ, నోయిడా రోడ్లపై చాలా ఎక్కువగా త్రివర్ణ పతాకాల అమ్మకాలు సాగుతున్నాయి. నన్ను కూడా ఆపి కొనమని అడిగారు. ప్రజల్లో దేశభక్తి బాగా పెరిగిపోయిందనేది మాత్రం స్పష్టం"

– అమన్ శర్మ, జర్నలిస్ట్

పండుగ చేసుకుందాం!

కశ్మీరులో శాంతి నెలకొంటుందని హామీ ఇవ్వండి
నేను ఎప్పటికీ ఈద్ జరుపుకుంటాను
పట్టపగలు, లక్షలాది ప్రజల మధ్య
రోడ్లన్నీ దుఃఖపు రంగు పులుముకున్నాయి
అబద్ధాలతో నా ప్రజలు దిగ్భ్రాంతి చెందుతున్నారు
ఇవన్నీ చూస్తూ నేను పండుగ చేసుకోలేను
ఆనందమంతా ఆవిరైపోతోంది.
కానీ, నా లోయలో శాంతి నెలకొంటుందని హామీ ఇస్తే
నేను ఎప్పటికీ ఈద్ జరుపుకుంటాను
అందమైన చిన్నచిన్న పిల్లలు/వారి తండ్రి ఇంట్లో లేడు
బలమైన నేల పొరల్లో కలిసిపోయాడు
అతడు వస్తాడని, బొమ్మలు తెస్తాడని
వారు ఎదురు చూస్తున్నారు
వారి ఆనందం బందీ అయిపోయింది
తన ఇంట్లో సంతోషాలను పంచడానికి
అతను ఇక ఎప్పటికీ రాడు/అతడి ఇల్లు ధ్వంసమైంది
సంతోషాన్ని కన్నీళ్లు కమ్మేస్తున్నప్పుడు
హృదయాలు మొద్దుబారిపోయినప్పుడు
సంబరాలు జరుపుకోలేను/నొప్పి నన్ను ఆక్రమించుకుంది
కానీ, నా లోయలో శాంతి నెలకొంటుందని హామీ ఇస్తే
నేను ఎప్పటికీ ఈద్ జరుపుకుంటాను
ముళ్లకంచెలైన రోడ్లు, తాళాలు వేసిన తలుపులు
స్వర్గధామంలో అణిచివేయబడిన ఆనందానిదే ఆధిపత్యం
నిలిచిపోయిన ఫోన్లు, రక్తప్రసరణ మధ్య
స్వర్గధామంలో ఏ అరుపులూ అదృష్టాన్ని నిర్ణయించలేవు
అక్కడ ఒక తల్లి తన కొడుకు కోసం ఎదురుచూస్తోంది
ఆ కొడుకేమో నేలతల్లి బరువును మోస్తున్నాడు
నక్షత్రాలు వెలుతురులో దాక్కున్నాయి
మా అమ్మకు చెప్పండి నేను పగలూ, రాత్రి కూడా
ఆమె సాన్నిహిత్యాన్ని కోల్పోతున్నానని.
సహనం సహనం సహనంతో ఉండమని ఆమెకు చెప్పండి
సహనం మాత్రమే కోరికను ఓడించగలదు
ఓ తండ్రి దుఃఖిస్తున్నాడు
ఆరు పగళ్లూ రాత్రుల తర్వాత కొడుకు గొంతు విని
''ప్రియమైన కుమారుడా, ఉద్రేకాలను అదుపులో ఉంచుకో
శాంతితో ఉండు, మనం ప్రేమతో ఉందాం''
ఫోను పెట్టేస్తూ అతను చెప్పాడు
చలనంలేని చెక్కిళ్ల మీదుగా కన్నీళ్లు దొర్లాయి
పరిస్థితులేమీ బాగోలేవని అవి చెప్పి ఉండేవి
మీ లోయలో శాంతి నెలకొంటుందని నేను హామీ ఇస్తానని
మీరిప్పటికీ గుసగుసలాడుకుంటుంటే
నేను ఎప్పటికీ ఈద్ పండుగ జరుపుకుంటాను
''తమ్ముడూ.. తమ్ముడూ నేను నీ తల దువ్వుతా
నువ్వు వేసుకోవాల్సిన బట్టల్ని నేనే ఎంపిక చేస్తా''
ఈద్ పండుగ రోజు నేను హత్తుకుని వుంటే ఆమె చెప్పేది
ఆమె బహుమతి అడిగి ఉండేది, నవ్వుతూ ఉండేది
ఆమె ఓ వెలుతురు కిరణంలా భాసిల్లేది
ఓ సోదరీ, నీ సోదరుడు నీదీ, నాదీ అయిన
స్వర్గం కోసం ఇంకా నిలబడే ఉన్నాడు
మనలాంటి, మన స్వంతమైన, మన దగ్గరివారికోసం
నీ సోదరుడు ఇంకా పదాలు పాడుతూనే ఉన్నాడు
దువ్వెన సిద్ధంగా ఉంచుకో, మంచి సూట్ తీసిపెట్టు
ఎప్పటిలాగే నవ్వుతూ గుండెదిటవు చేసుకో
నీ సోదరుడు త్వరలోనే వస్తాడు
నీకు బహుమతినీ, ఆనందాన్నీ ఇస్తాడు
శాంతితో కూడిన మంచి రోజులను తెస్తాడు
నీ కాంతి కిరణాలను శాంతి చుట్టుముట్టినప్పుడు
అద్భుతాలు జరుగుతాయి, చాలా తరచుగా.
నిస్సహాయత, దుఃఖానికి అక్కడ తావులేదు
ఆ రోజు మనందరం కలిసి ఈద్ పండుగ జరుపుకుందాం.

(ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో జమ్మూకశ్మీర్‌కు చెందినవారు ఏర్పాటు చేసుకున్న విందులో జుబైర్ రషీద్ అనే యువ కవి చదివిన కవిత)

అనువాదం : దేశరాజు

బాబును క్షమించడం కల్లోమాటే!

సందర్భం

పురిఘళ్ల రఘురామ్

ఇప్పుడు దేశంలో అందరి చూపు బీజేపీపైనే బీజేపీ ఏం చేస్తోంది, ఎలా చేస్తోంది. ఎలా ప్రజల అభిమానం చూరగొంటోందన్నదానిపైనే అందరి మథనం. బీజేపీని విమర్శించడమే లక్ష్యంగా కొందరు కుట్రలు చేస్తున్నారు. గత ఎన్నికల్లో ఏపీలో చంద్రబాబు అందుకు నాయకత్వం వహించారు. దేశ వ్యాప్తంగా మోదీ ప్రభంజనం వీస్తున్నప్పటికీ... ధృతరాష్ట్రుడిలా దాన్ని చూడకుండా నానాయాగీ చేసి ఎన్నికల గోదాలో చతికిలపడ్డారు. కేంద్ర ప్రభుత్వ మద్దతుతో చేస్తున్న కార్యక్రమాలకు తన స్టిక్కర్లు వేసుకొని విర్రవీగిన చంద్రబాబుకు జనం కర్రుగాల్చి వాతపెట్టారు.

ఇదంతా కళ్ల ముందు కన్పిస్తున్న వాస్తవమైతే... కొందరు కమ్యూనిస్టు విశ్లే

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ బుధవారం
14-8-2019

బాల్యానికి రెక్కలుంటాయి.
ఛీ..! రెక్కల కష్టం మిగిలింది.
భవిష్యత్తు బంగారంలా ఉండాలి.
బంగారం లాంటి పిల్లల భవిష్యత్తు ఏమవుతోంది?
గిల్టుగా మారుతోంది.
అవును...
మన ఒంటి మీద తళతళలాడే ఈ గిల్టు ఆభరణాలు
ఆ పిల్లల బాల్యానికి భరణాలే.
మన మెడలో హారాలను...
పిల్లలు తమ స్వేదంతో కడుతున్నారు.

స్వేదపు హారాలు

''బంగారం, ప్లాటినం, వెండి వంటి విలువైన లోహాలతో తయారయ్యే ఆభరణాలకు బదులు, అనుకరణ నగలే ఇప్పుడు రాజ్యమేలుతున్నాయి. అయితే ఇండియన్ ఇమిటేషన్ ఆర్నమెంట్స్ మార్కెట్‌లో పాతిక శాతాన్ని చైనా ఆక్రమించేసింది. ఏడాదికి వెయ్యికోట్ల విలువైన ఆభరణాలు చైనా నుంచి ఇండియాకి దిగుమతి అవుతున్నాయి. మన ఇమిటేషన్ ఆభరణాలతో పోలిస్తే చైనా ఆభరణాల ధర తక్కువ. చైనాలో తయారవుతున్న ఇమిటేషన్ నగలన్నీ మెషీన్ మేడ్ ఆర్నమెంట్సే. మన దగ్గర అలా కాదు. చేత్తో తయారయ్యేవే ఎక్కువ. బంగారు, ప్లాటినం ఆభరణాలను పోలిన ఇమిటేషన్ నగలను తయారు చేసే నిపుణులు మన దగ్గరున్నారు. ఇమిటేషన్ నగల తయారీ దారులు ఇండియాలో ఇతర ప్రాంతాలతో పోలిస్తే గుజరాత్‌లో ఎక్కువ మంది ఉన్నారు, తక్కువ కూలితో పని చేస్తున్నారు. ఈ ఇండస్ట్రీ రాజ్‌కోట్‌లో విస్తరించడానికి అదీ ఒక కారణం. మన దగ్గర వంద రూపాయల నుంచి ముప్పై వేల రూపాయల విలువ చేసే ఇమిటేషన్ నగలు తయారవుతున్నాయి. ప్రపంచంలో ఈ నగల తయారీలో చైనా తరవాతి స్థానం ఇండియాదే. మన నగలకు జర్మనీ, అమెరికా, పాకిస్తాన్, మధ్య ఆసియా దేశాలు, యూరప్, కెనడా, ఆస్ట్రేలియాలతో పాటు అనేక దేశాల్లో మంచి డిమాండ్ ఉంది. మన జువెలరీ తయారీ సంస్థలన్నీ వ్యవస్థీకృతం కావాలి'' ... ఇది రాజ్‌కోట్ ఇమిటేషన్ జ్యువెలరీ అసోసియేషన్ ప్రెసిడెంట్ వినోద్ వికారియా 2013లో అన్నమాట. వినడానికి బాగున్న మాట కూడ. మరి... ఇమిటేషన్ నగల తయారీలో చిద్రమవుతున్న బాల్యం మాటేమిటి?

ఇలా బయటపడింది

గుజరాత్, రాజ్‌కోట్‌లోని ఒక కృత్రిమ ఆభరణాల తయారీ యూనిట్‌లో పని చేస్తున్న పిల్లలను పోలీసులు రక్షించారు. ఆ పిల్లలకు ఏ నలుగురో, ఐదుగురో కాదు... ఏకంగా డెబ్బై మంది పిల్లలు. అదీ ఒక్క కార్ఖానాలోనే. ఇక మిగిలిన వర్క్ యూనిట్‌ల సంగతేమిటి? ఏడు వందల కార్ఖానాలున్న రాజ్‌కోట్‌లో ఎంత మంది పిల్లల బాల్యం అందమైన రంగు రాళ్ల నీడలో మసకబారుతుందవచ్చు? ఆ సంఖ్య వందలు కాదు వేలల్లో ఉండవచ్చనే అనుమానిస్తున్నారు పోలీసులు. గత ఏడాదిలో ఒక కార్ఖానా నుంచి ఇద్దరు పిల్లలు యజమాని కళ్లు కప్పి పారిపోయారు. వాళ్ల కోసం సాగిన దర్యాప్తులో తీగ లాగితే డొంక కదిలినట్లు పిల్లలు బిలబిల మంటూ బయటికొచ్చారు.

చట్టానికి దొరకని ట్రాఫికింగ్

ఇమిటేషన్ నగల తయారీలో పరిశ్రమల్లో పని చేస్తున్న పిల్లలంతా వెస్ట్ బెంగాల్ నుంచి పని కోసం గుజరాత్‌కి వచ్చిన వాళ్లే. ఇది చాలా పెద్ద నెట్‌వర్క్. కార్ఖానాల యజమానులకు నేరుగా ఎటువంటి సంబంధం ఉండదు. పిల్లలను సరఫరా చేసే ఏజెంట్‌లు ఉంటారు. ఆ ఏజెంట్‌లు పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి బేరం కుదుర్చుకుంటారు. నెలకు ఆరువేల జీతం ఇప్పిస్తామని చెప్పి పిల్లలను తీసుకొస్తున్నారు. ఇది చట్టం పరిధిలో ఏ సెక్షన్‌కూ దొరకని పిల్లల అక్రమరవాణా. తల్లిదండ్రుల సమ్మతితోనే జరుగుతుంది కాబట్టి, ఏజెంట్‌ల మీద ఎవరూ కేసు పెట్టరు. ఊపిరిసలపని పని పరిస్థితుల్లో పిల్లలు తమకు తామే బంధనాలను చేధించుకుని బయటకు రావడంతో ఈ దురాగతం అయినా బయటికొచ్చింది.

పగలు - రాత్రి పని

బ్రేస్‌లెట్‌లు, గాజులు, చెవి కమ్మలు, హారాలు, లాకెట్‌ల వంటి ఆభరణాలలో రాళ్లు పొదగడం వంటి సునిశితమైన పనుల్లో శిక్షణనిస్తారు. ఈ కార్ఖానాల్లో పగలు – రాత్రి పని జరుగుతుంటుంది. షిఫ్ట్‌ల వారీగా పిల్లల చేత పని చేయిస్తుంటారు. ఇక విశ్రాంతి సమయంలో ఒక పది– పన్నెండు మంది పిల్లలు నిద్రపోవాలి. ఇంత కష్టపడినా సరే... ముందు కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం మొత్తం వేతనం ఇవ్వరు, సగం ఇచ్చి సరిపెడతారు. ఇంత పెద్ద ఘోరం చాపకింద నీరులా జరిగిపోతోంది.

ఇంత పెద్ద స్కామ్ బయటపడిన తర్వాత కూడా రాజ్‌కోట్ ఇమిటేషన్ నగల వ్యాపారుల సంఘం ప్రతినిధులు మాత్రం... ''మా పరిశ్రమల్లో బాల కార్మికులు లేరు. మేము ఇళ్ల దగ్గర ఉండే ఆడవాళ్లకు మెటీరియల్ ఇచ్చి, వాళ్లు తయారు చేసిన ఆర్నమెంట్‌కి పీస్ లెక్కన వేతనం ఇస్తాం. ఇది అతి పెద్ద పరిశ్రమ. రాజ్‌కోట్‌లో ఏడాదికి ఎనిమిది వందల కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతోంది. ఇందులో ఎవరైనా చిన్న పిల్లల చేత పనులు చేయిస్తుంటే అది పూర్తిగా తప్పే. అలాంటి వాళ్లను తప్పకుండా శిక్షించాల్సిందే'' అని చేతులు దులుపుకున్నారు. ఇదంతా చట్టమే స్వయంగా చూసుకోవాలి... అన్నట్లు ముక్తాయించి ఊరుకున్నారు.

బడి చట్టం ఏమైంది?

''పువ్వుల్లా విచ్చుకోవాల్సిన బాల్యం ఆడంబరాల వెలుగు జిలుగులకు బలవుతోంది. బడిలో ఉండాల్సిన వయసులో పిల్లలు గాలి, వెలుతురు, కనీస సౌకర్యాలు లేని పరిశ్రమల్లో మగ్గిపోతున్నారు. మరి రైట్ టు ఎడ్యుకేషన్ యాక్ట్ ఏమైంది, ఆ చట్టాన్ని అమలు చేస్తే అక్షరాలు దిద్దాల్సిన చేతులు పూసలు అద్దవు కదా. ఈ నేరంలో ప్రత్యక్ష దోషులు కంపెనీ నిర్వహకులు, ఏజెంట్‌లు అయితే... మూల దోషి ప్రభుత్వమేనన్నారు పిల్లల హక్కుల కార్యకర్త శాంతాసిన్హా. మనకు చట్టాలున్నాయి, వాటిని పరిరక్షించాల్సిన ప్రభుత్వాలున్నాయి, ప్రభుత్వాలు విఫలమైనప్పుడు హెచ్చరించి బాధ్యత గుర్తు చేయడానికి న్యాయస్థానాలూ ఉన్నాయి. ఈ మూడు వ్యవస్థలకు సమస్యను ఎలుగెత్తి చాటే పత్రికలూ ఉన్నాయి, హక్కుల పరిరక్షణ కోసం పని చేసే కార్యకర్తలూ ఉన్నారు. అయినా బిగించిన పిడికిలి నుంచి జారిపోయే ఇసుకలాగ చట్టాలు నిర్వీర్యమైపోతుంటాయి. 'బేటీ బచావో, బేటీ పడావో' అంటూ ఆడపిల్లల కోసం ప్రభుత్వం ఒకవైపు స్పెషల్ డ్రైవ్ చేస్తోంది. మగపిల్లల బాల్యం కూడా భద్రంగా ఏమీ లేదనడానికి రాజ్‌కోట్ పెద్ద ఉదాహరణ.

– వాకా మంజులారెడ్డి

అందరి భాగస్వామ్యం ఉంది

పిల్లలు కార్మికులుగా మారుతున్నారంటే ఆ నేరం అందరిదీ. మొదటి దోషి ప్రభుత్వం, ఆ తర్వాత సమాజం. తల్లిదండ్రులు, పని ఇచ్చిన యజమాని వరకు అందరూ దోషులే. ఒక గ్రామంలో జనాభా రికార్డులో నమోదై ఉన్న పిల్లలందరూ ఆ ఊరి స్కూళ్లలో కానీ మరేదైనా స్కూళ్లలో కానీ నమోదై ఉన్నారా లేదా అని పర్యవేక్షించాల్సింది ప్రభుత్వమే. స్కూళ్లలో నమోదు కాకపోయినా, నమోదై వరుసగా నెలల పాటు ఆబ్సెంట్ అవుతున్నా ఆ స్కూల్ టీచర్లు, అధికారులు కారణాల కోసం అన్వేషించాలి. తల్లిదండ్రులతో మాట్లాడి సమాచారం తెలుసుకోవాలి. పిల్లలను పనుల్లో పెట్టడం నేరమని తల్లిదండ్రులను హెచ్చరించాలి. పిల్లలు తప్పకుండా బడికి వచ్చేటట్లు చూడాలి. పోషణ జరగని కుటుంబాలకు పనికి ఆహార పథకంలో పని కల్పించాలి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా, పిల్లల కోసం ఇన్ని పథకాలున్నా సరే... పిల్లలు బడిలో ఉండాల్సిన వయసులో పనిలో ఉన్నారంటే సమాజం బాధ్యత కూడా ఉందని చెప్పక తప్పదు. సమాజంలో అందరమూ... ఒక హోటల్, మరేదైనా దుకాణంలో పిల్లలు పని చేస్తున్నట్లు గమనిస్తే ఆ హోటల్‌కి, దుకాణానికి వెళ్లడం మానేయాలి. బాల కార్మికుల సర్వీసులను, ఉత్పత్తులను స్వీకరించడానికి ఎవరికి వారు స్వచ్ఛందంగా వ్యతిరేకించాలి. ఈ బహిష్కరించడం అనేది విదేశీ వస్తు బహిష్కరణలాగ ఒక ఉద్యమంలా జరగాలి. అప్పుడే పసితనానికి బాల్యం మిగులుతుంది.

– ప్రొఫెసర్ శాంతా సిన్హా, సామాజిక కార్యకర్త, మాజీ చైర్ పర్సన్, నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్

మానస

రాసుకున్న మాటలు

నాన్న మంచివాడు కాకపోతే కలిగే బాధ కన్నా, నాన్న మంచివాడు కాదు అనుకోవలసి వచ్చిన బాధ ఇంకా ఎక్కువ. ముఖ్యంగా కూతుళ్లకు!

నాన్న మంచివాడు కాదు! మనసు ఎన్ని నరాలను తెంపుకుంటే అనుకోగలిగిన మాట. కొడుకు వేరు. కూతుళ్లు నాన్న గురించి ఒక్క చెడ్డ మాటైనా వినేందుకు పుట్టనట్లుగా పెరుగుతారు. నాన్న తప్పా అది, మనుషుల్లోంచి దూరంగా లాగి, నాన్నను ఊహల్లో పెంచుకున్న కూతుళ్ల తప్పా? నాన్న మంచివాడు కాకపోతే కలిగే బాధ కన్నా, నాన్న మంచివాడు కాదు అనుకోవలసి వచ్చిన బాధ ఇంకా ఎక్కువ.

అమ్మెప్పుడూ నాన్న మీద పిల్లలకు కంప్లయింట్ చెయ్యదు. 'పిల్లలు చూస్తున్నారు' అని జాగ్రత్త పడుతుంది. అమ్మపై చెయ్యెత్తేటప్పుడు పిల్లలున్నారేమోనని నాన్నెప్పుడూ చూసుకోడు. అప్పుడూ అమ్మే జాగ్రత్త పడుతుంది. అప్పుడైనా తప్పించుకుని పిల్లల్లోకి వచ్చేయడం కాదు అమ్మ పడే జాగ్రత్త. పిల్లలకు నాన్న కనిపించకుండా తలుపులు దగ్గరగా వేస్తుంది. పిల్లల ముందు నాన్న పలుచన కాకూడదని ఆత్మాభిమానాన్ని గొంతులోనే దిగమింగేస్తుంది. అమ్మ జాగ్రత్తలు తీసుకున్నంత వరకే నాన్న మంచితనం. జీవితాంతం అమ్మ జాగ్రత్తలూ తీసుకుంటూ ఉంటే జీవితాంతం నాన్న మంచివాడే.

ఎంత జాగ్రత్తగా ఉండే అమ్మయినా, అమ్మ జాగ్రత్తగా లేకపోయిన రోజొకటొస్తే పిల్లల మనసుల్లోని మంచినాన్న తప్పించుకోలేడు. 'నాన్నా.. నువ్విలానా..' అనే నమ్మలేనితనం నుంచి పిల్లలూ తప్పించుకోలేరు. మానసకు పదిహేడేళ్లు. పీయూసీ చదువుతోంది. భూమిక పదిహేనేళ్లమ్మాయి. టెన్త్ స్టూడెంట్. అమ్మ రాజేశ్వరి (43). నాన్న సిద్ధయ్య. వీళ్ల కుటుంబం ఉండడం బెంగళూరు దగ్గరి శ్రీనగరలో. పందొమ్మిదేళ్ల క్రితం సిద్ధయ్యను పెళ్లి చేసుకున్నాక చామరాజనగర్ నుంచి భర్తతో పాటు శ్రీనగర వచ్చేసింది రాజేశ్వరి. సిద్ధయ్య ప్రభుత్వోద్యోగి. లైన్‌మ్యాన్. రెండు రోజుల క్యాంప్‌కని చెప్పి శుక్రవారం తమిళనాడు వెళ్లాడు. వెళ్లే ముందు రాజేశ్వరికి, సిద్ధయ్యకు గొడవైంది. నాన్న ఎంత ఆలస్యంగా ఇంటికొచ్చినా గొడవ పడని అమ్మ, నాన్న తాగొచ్చినా గొడవపడని అమ్మ, నాన్న చేయి చేసుకున్నా గొడవపడని అమ్మ.. ఎందుకోసం నాన్నతో గొడవపడుతోందో కొంతకాలంగా మానస, భూమికల గ్రహింపుకు వస్తూనే ఉంది. అమ్మ అడుగుతున్న ప్రశ్నలో తప్పులేదు. అమ్మ అడుగుతున్న ప్రశ్నకు నాన్న దగ్గర సమాధానం లేదు. అమ్మ కన్నీళ్లనైతే వాళ్లు చూడగలుగుతున్నారు గానీ అమ్మ కన్నీళ్లు కడిగేస్తున్న నాన్ననే చూడలేకపోతున్నారు! చివరిసారిగా శుక్రవారం నాడు అమ్మానాన్న మధ్య పెద్ద గొడవ జరిగింది. నిజంగా చివరిసారి.

రాజేశ్వరి తమ్ముడు పుట్టస్వామి అక్కడికి దగ్గర్లోనే గాంధీ బజార్ ప్రాంతంలో ఉంటాడు. అక్కంటే అతడికి ప్రాణం. అక్కపిల్లలంటే ముద్దు. బావంటే గౌరవం. అక్కాబావ గొడవపడినప్పుడు అక్కనే సర్దుకుపొమ్మని చెప్పేంత గౌరవం అతడికి బావగారి మీద! బావ క్యాంప్‌కి వెళ్లినట్లు అతడికి తెలీదు. సోమవారం వాట్సాప్‌లో మానస స్టాటస్ చూసి ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు. ఒక్క ఉదుటున లేచి అక్క ఇంటికి వెళ్లాడు. ఇంటి తలుపులకు లోపల్నుంచి తాళం వేసి ఉంది. తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లాడు. ముగ్గురూ గదిలోని ఫ్యాన్‌కు వేలాడుతున్నారు! కుప్పకూలిపోయాడు పుట్టస్వామి. అక్కడేం సూయిసైడ్ నోట్ కనిపించలేదు. కానీ మానస స్టాటస్‌లో రాసుకున్న రెండే రెండు మాటల్లో అంతకంటే పెద్ద మరణ వాఙ్మూలమే ఉంది. వాఙ్మూలం కాదు. మరణధ్వని. అది గుర్తుకొస్తోంది పుట్టస్వామికి. ''ప్రతి ఒక్కరికీ మంచి నాన్న ఉండాలి. ఆ వరాన్ని దేవుడు మాకు ఇవ్వలేదు''.. మానస స్టేటస్‌లోని మాటలివి. స్టేటస్‌లో ఏదైనా ఇరవై నాలుగు గంటలే ఉంటుంది. మానస రాసుకున్న ఆ మాటలు ఏ తరానికీ చెరిగిపోనివి. ●

ప్రతీకాత్మక చిత్రం

సిద్ధయ్య క్యాంప్ నుంచి మధ్యలోనే వచ్చి ఉంటాడు. తను కోల్పోయింది ఏమిటో తెలుసుకుని విలపించే ఉంటాడు. భార్య ఏళ్లుగా ప్రాధేయపడుతూ వచ్చింది. ఏళ్లుగా గొడవపడుతూ వచ్చింది. అయినా అతడు మారలేదు. ఆమె, ఇద్దరు కూతుళ్లు ఆత్మహత్య చేసుకునేంత వరకు వెళ్లింది అతడి పరస్త్రీ వ్యామోహం.

చెట్టు నీడ

అతి పెద్ద సంతోషం

అదొక ఆస్పత్రి. అందులో ఒకే గదిలో ఇద్దరు రోగులున్నారు. ఇద్దరికీ అంతకుముందు పరిచయం లేదు. ఇద్దరి మధ్య ఓ అడ్డుగోడ. ఒకరి పడక కిటికీ పక్కన. మరొకరి పడక పక్కన కిటికీ కూడా లేదు. నర్సో డాక్టరో వచ్చి మాట్లాడితే తప్ప అతనికి మరో ప్రపంచం లేదు. ఎప్పుడూ అతనికి ఏకాంతమే.

కిటికీ పక్కనే ఉన్న రోగికి క్యాన్సర్. మరొకరికి ఎముకల జబ్బు. కొన్ని రోజులకు వీరిద్దరూ మిత్రులయ్యారు.

ఎముకల జబ్బుతో బాధ పడుతున్న రోగి క్యాన్సర్ రోగితో ''నీకైనా కాలక్షేపానికి ఓ కిటికీ ఉంది. నాకు అది కూడా లేదు...'' అన్నాడు..

కిటికీ పక్కనే ఉన్న రోగి ''దిగులు పడకు... నేను కిటికీ నుంచి చూసేవన్నీ నీకు ఎప్పటికప్పుడు చెప్తాను... సరేనా'' అంటూ మరుక్షణం నుంచే తాను చూసినవన్నీ చెప్తూ వచ్చాడు.

కిటికీ బయట ఓ పెద్ద కొలనుంది. ఆ కొలను మధ్యలో ఓ చిన్న దీవి. కొలనులో చిన్న చిన్న పడవలు తేలియాడుతున్నాయి. కొలను తీరాన ఓ అందమైన పార్కు ఉంది. అక్కడ ప్రేమికులు తమను మరచిపోయి కథలు చెప్పుకుంటున్నారు.. ఇలా..

అతను చెప్పేవన్నీ ఎముకల జబ్బుతో బాధ పడుతున్న రోగికి కళ్లముందు చూస్తున్నట్లే అనిపించింది.

కిటికీ దగ్గరున్న రోగి మరుసటి రోజు మరికొన్ని విషయాలు చెప్పాడు.

అతని మనసు ఎంతో ఆనందంగా ఉంది.

ఓ రోజు కిటికీ పక్కనున్న రోగి చనిపోతాడు.

దాంతో ఎముకల జబ్బుతో బాధ పడుతున్న వ్యక్తికి మళ్లీ ఒంటరితనం తప్పలేదు. తనను చూడడానికి వచ్చిన నర్సుతో తన పడక కిటికీ పక్కకు మార్పించుకుంటాడు. ఇక తను నేరుగా కిటికీలోంచి అన్నీ చూడవచ్చు అనుకుని కిటికీలోంచి చూస్తాడు. అక్కడ ఓ పెద్ద గోడ కనిపిస్తుంది. మరేదీ లేదు.

మరి అటువంటప్పుడు చనిపోయిన రోగి చెప్పిన విషయాలన్నీ ఏమిటీ!

మరుసటి రోజు నర్సు రావడంతోనే జరిగినదంతా చెప్పాడు ఆ రోగి.

అతనికి ఇంజక్షన్ ఇస్తూ నర్స్ చెప్పింది..

మీరు చూసే గోడ కూడా అతను చూసుండడు. ఎందుకంటే క్యాన్సర్ తో బాధ పడిన రోగికి చూపు ఎప్పుడో పోయింది అని.

సంతోషంలోనే అతి పెద్ద సంతోషం ఎదుటివారిని సంతోషపెట్టడమే.

– యామిజాల జగదీశ్

బ్యూటిప్స్

కరివేపతో కొత్త కాంతి

- ఉప్మాలోనే కాదు... కరివేపాకును ఎప్పుడూ తేలిగ్గా తీసిపారేయకండి. ఎందుకంటే కరివేప మంచి సౌందర్య సాధనం కూడా.
- కరివేపాకుని శుభ్రంగా కడిగి మెత్తగా రుబ్బుకోవాలి. ఒక స్పూను కరివేపాకు ముద్దలో కొద్దిగా పసుపు కలిపి మోచేతులకు రాసుకుని పావుగంట తర్వాత గోరువెచ్చటి నీళ్లతో కడిగేసుకోవాలి. ఇలా వారానికి రెండు మూడు సార్లు చేస్తే మోచేతుల దగ్గర నలుపు పోతుంది.
- వేడినీళ్లలో కరివేప ఆకులు వేసి పావుగంట తర్వాత ఆకుల్ని తీసేసి అందులో చల్లటి నీళ్లు కలుపుకుని వాటితో ముఖాన్ని కడుక్కోవాలి. వర్షాకాలంలో ఇలా చేస్తే మంచిది. తరచూ ఇలా చేయడం వల్ల మొటిమల సమస్యలు కూడా తగ్గుతాయని ఆయుర్వేద నిపుణులు సూచిస్తున్నారు.

సందర్భం

ఉన్నది ఒకటే ఇల్లు

ఒక ఇంట్లోని వాళ్లంతా ఒకింటివాళ్లు అవుతారు తప్ప 'వాళ్లు' అవరు. ఒక దేశంలోని వాళ్లంతా ఒక దేశంవాళ్లు అవుతారు తప్ప 'వాళ్లు' అవరు. ఇంట్లో గానీ, దేశంలో గానీ 'వాళ్లు' అనే మాట వచ్చిందంటే అది వేరు చేసినట్లు కాదు. వేరు చేసుకున్నట్లు.

● మాధవ్ శింగరాజు

జర్నలిజంలోని బ్యూటీ ఏంటంటే, సాయంత్రం ఇంటికి క్యారీబ్యాగులో ఓ కిలో బియ్యం మోసుకుని వెళ్లేందుకు డ్యూటీ చేసినట్లుగా ఉండదు. గుప్పెడు అక్షరాల్ని చల్లి లోకంలోని బంజరుభూముల్ని పండించడానికి ఆఫీస్‌కి వచ్చినట్లుగా ఉంటుంది. ''మంచిదే కానీ, ప్రత్యేక అంశాలపై నీక్కొన్ని ప్రత్యేక అభిప్రాయాలు ఉన్నప్పుడు వాటిని నీ రాతల్లో వ్యక్తం చేయకుండా ఉండడం వల్ల కెరీర్‌లో నీకు నూకలు చెల్లకుండా ఉంటాయి'' అని సీనియర్ జర్నలిస్టు ఒకరు హితవు చెప్పినప్పుడు కూడా 'అతడు' బంజరు భూముల్ని పండించడం గురించే ఆలోచించాడు తప్ప, క్యారీబ్యాగులో బియ్యం మోసుకుపోతే సుఖం కదా అనుకోలేదు. ఇరవై ఏళ్ల క్రితం నాటి మాట ఇది.

అప్పుడు 'అతడు' ట్రైనీ. అదే 'అతడు' ఇప్పుడు ''ప్రత్యేక అంశాలపై మీక్కొన్ని ప్రత్యేక అభిప్రాయాలు ఉన్నప్పుడు వాటిని మీరు మీ రాతల్లో వ్యక్తం చేయకపోవడం వల్ల క్యారీబ్యాగులో ఇంటికి మీరు బియ్యం మోసుకెళ్లగలరు తప్ప, బంజరు భూముల్ని పండించలేరు'' అని చెబుతున్న సీనియర్ జర్నలిస్టు (ఈ వ్యాసకర్త). అప్పట్లో మెడ్రాస్ 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్'లో రషీదా భగత్ బ్యూరో చీఫ్‌గా ఉండేవారు. ''రషీదా భగత్ రాయొచ్చా సర్, ప్రత్యేకాంశాల మీద ప్రత్యేక అభిప్రాయాలు?'' అని అతడు అడిగినప్పుడు, ''రాయొచ్చు. కానీ నువ్వు రాయకూడదు. రాస్తే ఏ విలువా ఉండదు'' అనేవారు డెస్క్ ఇన్‌చార్జి. సీనియర్ జర్నలిస్టులు జూనియర్ జర్నలిస్టులకు ఏం చెప్పినా, చివరి మాట మీడియా యాజమాన్యాలదే. అవి వద్దన్న అభిప్రాయాలేవీ మర్నాడు పేపర్‌లలో కనిపించవు. ప్రత్యేకాంశాలపై ప్రత్యేక అభిప్రాయాల మీద పత్రికలు ఎప్పుడూ కాస్త జాగ్రత్తగానే ఉంటాయి. ఎవరి మనోభావాలకూ దెబ్బ తగలకుండా.

ఈ ఏడాది జూలై 30న రాజ్యసభలో తలాక్ బిల్లు అమోదం పొందగానే ఆ మర్నాడు అన్ని పేపర్లూ ఆ వార్తను వేశాయి కానీ, ఎప్పటిలా 'ప్రత్యేకాంశం' అయిన తలాక్‌పై ప్రత్యేక అభిప్రాయాలకు మాత్రం దాదాపుగా చోటివ్వలేదు. ప్రత్యేక అభిప్రాయాలంటే తలాక్ రద్దుపై ప్రభుత్వాన్ని వ్యతిరేకించని అభిప్రాయాలు. తర్వాత మెల్లిగా తలాక్ రద్దుపై ప్రభుత్వాన్ని సమర్థించని అభిప్రాయాలు ఒకటీ అరా కనిపించడం మొదలైంది. బాబ్రీ కట్టడం కూల్చివేత తర్వాత చాలాకాలం పాటు ఇలాంటి ప్రత్యేకాంశాలపై బలమైన మీడియా హౌస్‌లు కూడా 'తటస్థతే సుస్థిరత' అనే మోడ్‌లోకి వెళ్లిపోయాయి. వ్యూ, కౌంటర్ వ్యూ రెండూ ఉండేవి కాదు. 'వాళ్ల' మంచొద్దు. 'వాళ్ల' చెడొద్దు. ఇదీ ధోరణి! అసలు ఏది మంచి? ఏది చెడు? మంచి రాయబోయి చెడు రాసేస్తే? మంచి అనుకుని రాసింది చెడు అయిపోతే? అందుకే జూనియర్ జర్నలిస్టుల్ని ఈ ప్రత్యేకాంశాల దగ్గరకి రానిచ్చేవాళ్లు కాదు. సీనియర్ జర్నలిస్టులు ఎటూ ఆ దరిదాపులకు వెళ్లరు. ఇప్పుడా పరిస్థితి కొంచెం మారినట్లుంది. తలాక్ రద్దు మీద మీడియాలో ఈ రెండు వారాల్లోనూ ప్రధానంగా రెండు ప్రశ్నలు వచ్చాయి. తలాక్ చెబితే కౌన్సెలింగ్ ఇచ్చి పంపేలా బిల్లు ఉండాలి కానీ, ఏదో నేరం చేసినట్లు భర్తను జైల్లో పెట్టే బిల్లేమిటన్నది ఆ రెండిట్లో ఒక ప్రశ్న. 'తలాక్‌ను రద్దు చేశారు సరే, హిందువుల్లోని భర్తల్ని సంస్కరించేందుకు బిల్లు తేరేం?' అనేది రెండో ప్రశ్న. రెండు ప్రశ్నలూ మంచివే. రెండోది ఇంకా మంచి ప్రశ్న. అయితే ఈ ప్రశ్న వేసే విధానమే మరీ అంత మంచిది కాకుండా ఉంది! 'తలాక్' సరే.. 'మన' ఇంటి గుట్టో? అని అని ప్రశ్నించడంలో ఏం మంచి ఉంది? 'వాళ్ల' సంగతి ఎందుకు? అని ఆనాడు అన్నవాళ్లు, 'మన' సంగతేంటి? అని నేడు అంటున్నారు. రెండిటిలోనూ కనిపించే భావం ఒక్కటే. ఈ దేశం ఒకే కుటుంబం కాదని!

తలాక్ సంప్రదాయాన్ని రద్దు చేయాలని కోరుతూ పిటిషన్‌లు వేసి ఏళ్లుగా పోరాడుతున్న జకియా సోమన్, అతియా సాబ్రి, గుల్షన్ పర్వీన్, అఫ్రీన్ రెహ్మాన్, ఇష్రత్ జహాన్, సైరా భానులను ఈ 'ఇంటి' ఆడపడుచులు కాదు అనుకుని ఉంటే కోర్టులు పిటిషన్‌లను స్వీకరించేవా? ప్రభుత్వం ఇప్పుడు తలాక్‌పై ఒక నిర్ణయం తీసుకుని ఉండేదా? మనదంతా ఒకే కుటుంబం అని వ్యవస్థలే అనుకుంటున్నప్పుడు కుటుంబంలోని ఏ కొందరో, ఏ కారణం చేతనో కుటుంబంలోని కొందరికి అడగకుండానే మద్దతుగా నిలిచినంత మాత్రాన అదంతా ఒకే కుటుంబం కాకుండా పోతుందా?

తలాక్ చట్టం మాత్రమే కాదు, అలాంటి ఏ చట్టం ఉద్దేశమైనా కుటుంబాలకు మేలు చేయడమే అయి ఉంటుంది. చట్టం ఫలిస్తుందా, నిష్ఫలం అవుతుందా అన్నది కాలక్రమంలో తేలే విషయం. ఫలించడం అంటే చట్టానికి ఫిర్యాదుల గౌరవం దక్కటం. నిష్ఫలం అంటే ఫిర్యాదులే వెళ్లని గౌరవం దక్కటం. రెండేళ్ల క్రితం మీరట్‌లో అఫ్రీన్ బేగం (పై ఫొటో) అనే మహిళ తన భర్త పెట్టే గృహహింసను భరించలేక పోలీస్ స్టేషన్ బయటే పెద్దగా అరుస్తూ అతడికి తలాక్ చెప్పారు! 'భర్తకేనా! భార్యకు ఉండకూడదా తలాక్ చెప్పే హక్కు' అని ప్రశ్నించారు. ఇది ఒక బాధిత మహిళ చట్టాలతో నిమిత్తం లేకుండా తనకు తానుగా దక్కించుకున్న గౌరవం. ●

> తలాక్ రద్దుపై అటుగానీ, ఇటుగానీ నోరు మెదపకుండా మౌనం వహించడమంటే ఇంటి నుంచి, లేదా దేశం నుంచి ఎవర్ని వారు వేరు చేసుకోవడమే. అయితే తలాక్ రద్దును వ్యతిరేకిస్తూ ''అదే 'మనింటి' విషయంలోనైతే ఇలా చేస్తామా?'' అని వినిపిస్తున్న వాదనల కంటే నోరు మెదపని మౌనమే నయమేమో అనిపిస్తుంది.

కొడుకు, కూతురితో అఫ్రీన్ బేగం (ఫైల్ ఫొటో)

సాక్షి ఫ్యామిలీ సినిమా
నల్లగొండ ॥ బుధవారం
14-8-2019

లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్

ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ అన్నయ్యా! నేను ఇద్దరు అబ్బాయిలతో ఫ్రెండ్‌షిప్ చేస్తున్నాను. ఇద్దరూ మంచివాళ్లే. అయితే ఇద్దరూ నన్ను ప్రేమిస్తున్నారు. ఇద్దరూ నాకు లైఫ్ లాంగ్ కావాలి. ఇప్పుడు నేనేం చెయ్యను సార్?

- మాధురి

ఇంకో ముగ్గుర్ని చూడు చెల్లెమ్మా!!

'సార్.....!'

ఏంటా కేకలు నీలాంబరీ??

'సార్! వాట్ ఆర్ యూ టాకింగ్???'

ఫైవ్ ఫ్రెండ్స్ అయితే బెటర్ అంటున్నాను నీలూ!

'ఓ.. ఓహో!! ఫ్రెండ్స్ ఫర్ ఎవర్ అయితే ఫర్వాలేదులే సార్!'

మరి నువ్వేమనుకున్నావ్...???

'సార్! మీరు చాలా చిలిపి! దొరక్కుండా తప్పించుకుంటారు. ఇంకో ముగ్గురు అంటే ఎవరైనా ఏం అనుకుంటారు సార్???'

చేతి నిండా ఫ్రెండ్స్ ఉంటారనుకుంటారు నీలూ!!

'సార్! ఈ అమాయకపు ఫేస్ పెట్టి నన్ను ఫూల్ చెయ్యలేరు సార్! చేతికి ఐదువేళ్లు ఉన్నట్లు ఐదుగురు ఫ్రెండ్స్ ఏంటి సార్?'

నీకింకేదైనా ఆన్సర్ చెప్పాలనుంటే చెప్పు నీలూ!

'వద్దులే సార్! మాధురీ-ఇంకో ముగ్గురు ఫ్రెండ్స్‌ని ఆర్డర్ చెయ్యి!'

lovedoctorram@sakshi.com

నాగచైతన్య

ప్రేమకథ మొదలు

ప్రేమకథల్లో శేఖర్ కమ్ముల ప్రేమకథలు డిఫరెంట్. సున్నితంగా, ఆహ్లాదంగా సాగిపోతాయి. ఇప్పుడు మరో రొమాంటిక్ ప్రేమకథను తీయబోతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా ఈ నెలాఖర్లో మొదలవుతుందని తెలిసింది. నాగ చైతన్య, సాయి పల్లవి జంటగా శేఖర్ కమ్ముల ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌ను తెరకెక్కించనున్నారు. సునీల్ నారంగా నిర్మిస్తారు. డ్యాన్స్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా కథ తిరగనుందట. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ఈ నెల 25న ప్రారంభం కానుంది. తొలి షెడ్యూల్‌లో నాగచైతన్య, సాయి పల్లవి ఇద్దరూ పాల్గొంటారని సమాచారం. డిసెంబర్‌లోపు ఈ సినిమా షూటింగ్‌ను పూర్తి చేయాలనుకుంటున్నారు.

థ్రిల్ చేస్తారు

కీర్తి సురేశ్

కొడైకెనాల్ అంటే మంచు, మంచి వాతావరణం. అంతా బావుంటుంది. అంతు చిక్కని సంఘటనలు జరిగితే? మనం ఊహించని విషయాలన్నీ ఎదురైతే? వేసే ప్రతి అడుగు థ్రిల్ అయితే? ఇలాంటి సినిమానే చేయబోతున్నారు కీర్తీ సురేశ్. 'మహానటి'కి ఉత్తమ నటిగా నేషనల్ అవార్డు అందుకుని మంచి జోష్‌లో ఉన్నారామె. లేటెస్ట్‌గా ఓ లేడీ ఓరియంటెడ్ సినిమా చేస్తున్నట్టు ప్రకటించారు. నూతన దర్శకుడు ఈశ్వర్ కార్తీక్ దర్శకత్వంలో కీర్తీ సురేశ్ ముఖ్య పాత్రలో ఈ ఎమోషనల్ మిస్టరీ థ్రిల్లర్ తెరకెక్కనుంది. తమిళ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ సమర్పణలో కార్తికేయ సంతానం నిర్మించనున్నారు. కొడైకెనాల్‌లో ఎక్కువ శాతం షూటింగ్ జరుపుకోనున్న ఈ చిత్రం షూటింగ్ సెప్టెంబర్‌లో ఆరంభం కానుంది.

పన్నెండేళ్ల తర్వాత

నందితా దాస్

నందితా దాస్ ఫిల్మోగ్రఫీ భిన్నంగా ఉంటుంది. పది భాషల్లో సినిమాలు 40కి పైగా సినిమాలు చేశారు. నటిగా, దర్శకురాలిగా తనకో గుర్తింపు తెచ్చుకున్నారు. 2006లో 'కమ్లి' అనే తెలుగు సినిమాలో నటించారు. పన్నెండేళ్ల గ్యాప్ తర్వాత మళ్లీ తెలుగు సినిమాలో నటిస్తున్నారామె. రానా, సాయిపల్లవి ముఖ్య పాత్రల్లో 'నీదీ నాదీ ఒకే కథ' ఫేమ్ వేణు ఉడుగుల రూపొందిస్తున్న పీరియాడికల్ చిత్రం 'విరాట పర్వం'. ఇందులో టబు ఓ కీలక పాత్ర చేయాల్సి ఉంది. ఇప్పుడు ఆమె స్థానంలో నందితా దాస్ సినిమాలో భాగమయ్యారు. ఈ సినిమాలో తాను భాగమవ్వడం గురించి ట్వీట్ చేస్తూ - ''దర్శకుడి విజన్, కథ నచ్చి ఈ సినిమా చేస్తున్నా. ఎవరి స్థానంలో నటిస్తున్నాను అన్నది పట్టించుకోను. ఇవాళే షూటింగ్‌లో జాయిన్ అయ్యాను. చాలా ఏళ్లు అయింది తెలుగు మాట్లాడి'' అన్నారు నందితా. ఈ సినిమాను సుధాకర్ చెరుకూరి, ప్రసాద్ చుక్కపల్లి నిర్మిస్తున్నారు.

ఎవరూ నమ్మనప్పుడు పీవీపీగారు నన్ను నమ్మారు

- అడివి శేష్

రామ్‌జీ, పీవీపీ, అడివి శేష్, రజీనా, నవీన్ చంద్ర

''క్షణం' సమయంలో 'ఏముందిలే చిన్న సినిమా' అంటూ మా ఆఫీస్ బాయ్ వాళ్ల స్నేహితుడితో ఫోన్‌లో మాట్లాడాడు. ఆ రోజే ఫిక్స్ అయ్యాను. చాలా తీవ్రంగా కష్టపడాలని. '2.0' వెర్షన్‌లా మారిపోయాను. ఈ సినిమా అతనికే అంకితం చేస్తున్నాను'' అన్నారు అడివి శేష్. పీవీపీ నిర్మాణంలో అడివి శేష్, రెజీనా, నవీన్ చంద్ర ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'ఎవరు'. వెంకట్ రామ్‌జీ దర్శకుడు. ఈ సినిమా రేపు విడుదల కానుంది. ప్రీ-రిలీజ్ ప్రెస్‌మీట్‌లో శేష్ మాట్లాడుతూ - ''మా స్నేహితులకు ఈ సినిమా చూపించా. నమ్మకంగా పీవీపీగారితో ప్రీ-రిలీజ్ ఫంక్షన్ వద్దు. ప్రీమియర్ షో వేద్దాం అన్నాను. నన్ను ఎవరూ నమ్మని సమయంలో ఆయన నమ్మారు'' అన్నారు శేష్. ''టాలెంట్ ఉన్న వాళ్లను వెతికి పట్టుకోవడంలో పీవీపీగారు బెస్ట్. నమ్మితే ప్రశ్నించరు'' అన్నారు వెంకట్ రామ్‌జీ. ''సినిమా మీద చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాం'' అన్నారు నవీన్ చంద్ర''. ''కథ ఉమెన్ పాయింట్ ఆఫ్ వ్యూలో నడుస్తుంది. ఈ సినిమాకు ఇద్దరు అమ్మాయిలు అసిస్టెంట్ డైరెక్టర్స్‌గా చేశారు. ఒక సినిమాకి ఇద్దరమ్మాయిలు ఉండటం నా కెరీర్‌లో ఫస్ట్ టైమ్'' అన్నారు రెజీనా. ''తెలుగు సినిమా కొత్త దారిలో వెళ్తోంది. అందులో మా సినిమా కూడా ఉండబోతోంది. మా సెట్, ఆఫీస్ పని చేయడానికి చాలా సురక్షితమైన ప్రదేశం అని గర్వంగా చెబుతాను'' అన్నారు పీవీపీ.

నాకు తెలిసిందే తీస్తా!

సుధీర్‌వర్మ

"నేను ఏ కథ రాసినా క్రైమ్ వైపు మర్డర్ వైపు వెళ్లిపోతుంది. నాకు అలాంటి సినిమాల మీదే ఎక్కువ ఆసక్తి ఉండటం కూడా కారణం అనుకుంటా. నేను చేస్తున్న సినిమాలతో నేను చాలా హ్యాపీగా ఉన్నాను. నాకు రాని జానర్‌లు ట్రై చేసి హీరోల కెరీర్‌లు, నిర్మాతల డబ్బులు రిస్క్‌లో పెట్టదలుచుకోలేదు" అన్నారు సుధీర్ వర్మ. శర్వానంద్ హీరోగా సుధీర్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'రణరంగం'. కాజల్ అగర్వాల్, కల్యాణీ ప్రియదర్శన్ హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రాన్ని పీడీవీ ప్రసాద్ సమర్పణలో నాగవంశీ నిర్మించారు. ఈ సినిమా రేపు విడుదల కానున్న సందర్భంగా సుధీర్ వర్మ చెప్పిన విశేషాలు.

- ఈ కథను రవితేజగారితో తీయాలని సిద్ధం చేసుకున్నాను. ఆయన వేరే సినిమాలతో బిజీగా ఉన్నారు. ఈ మధ్యలో శర్వానంద్, నేను ఓ సినిమా చేయాలనుకున్నాం. కొన్ని కథలు అనుకున్నాం. మాటల్లో రవితేజగారి కోసం అనుకున్న కథ గురించి చెప్పాను. నచ్చి, చేస్తాను అన్నాడు శర్వా. రవితేజగారిని అడిగితే చేసుకోమన్నారు.
- శర్వా సినిమాల్లో నాకు 'ప్రస్థానం' బాగా ఇష్టం. అందులో తన పాత్ర చాలా డెప్త్‌గా ఉంటుంది. తనతో చేస్తే ఇంటెన్స్ సబ్జెక్టే చేయాలనుకున్నాను. ఈ సినిమాతో అది కుదిరింది. ఇందులో హీరో పాత్ర రెండు షేడ్స్‌లో ఉంటుంది. 40 ఏళ్ల వయసు పాత్రలో శర్వా సూట్ అవుతాడా? అని చిన్న సందేహం ఉంది. లుక్ టెస్ట్ జరిగాక పూర్తి నమ్మకం వచ్చేసింది.
- ఈ సినిమాకు ముందు 'దశపతి' టైటిల్ పెట్టాలనుకున్నాం. కానీ అది వేరేవాళ్లు రిజిస్టర్ చేసుకున్నారు. మా నిర్మాత నాగవంశీగారు 'రణరంగం' టైటిల్ సూచించారు. నా కెరీర్‌లో చాలెంజింగ్ సినిమా ఇది. ఈ సినిమా కథ 1990 నుంచి 2015 వరకూ జరుగుతుంది. 1990 కాలంలో జరిగిన సీన్లు చిత్రీకరించినప్పుడు కొంచెం కష్టపడాల్సి వచ్చింది. అందుకే ఓ కాలనీ సెట్‌ను హైదరాబాద్‌లో వేశాం.
- 'స్వామిరారా' తర్వాత చినబాబుగారు అడ్వాన్స్ ఇచ్చారు. ఇప్పటికి వాళ్ల బ్యానర్‌లో చేయడానికి కుదిరింది. ఈ సినిమాకు బడ్జెట్ ఎంతైందో నాకు తెలియదు. నాగవంశీ అంత ఫ్రీడమ్ ఇచ్చారు. నెక్స్ట్ సినిమా మాకే చేయాలి.. ఏ హీరో కావాలని అడుగుతుంటారు.
- సినిమా ప్రోమోల్లో కాజల్‌ను ఎక్కువ చూపించకపోవడానికి కారణం తనది చిన్న పాత్ర కావడమే. ప్రేక్షకుడు సినిమాకి వచ్చి నిరాశ చెందకూడదు.
- కమర్షియల్ స్టైల్‌లో చేసిన 'దోచేయ్' అనుకున్నంత ఆడలేదు. ఈ సినిమాను నాకు నచ్చిన విధంగా తీశాను. ఏమనుకున్నానో అదే తీశాను. ఏ సినిమా అయినా నాకు కంఫర్ట్‌బుల్‌గా ఉండేలా, నాకు తెలిసిందే తీస్తాను.
- ఈ సినిమాకు సీక్వెల్ తీయొచ్చు అనే ఐడియాను శర్వానంద్ ఈ మధ్య చెప్పాడు. ఐడియా బావుంది. చూడాలి. నెక్స్ట్ రవితేజగారితో సినిమా ఉంటుంది.

ఈ సినిమా రెండేళ్ల నుంచి మేకింగ్‌లో ఉంది. సుమారు 700 రోజుల్లో మేం షూట్ చేసింది 70 రోజులు మాత్రమే. శర్వా 'పడిపడి లేచె మనసు' పూర్తయ్యే వరకు వేచి ఉండాల్సి వచ్చింది. ఆ సినిమాలో లుక్ ఇందులో లుక్ డిఫరెంట్. అందుకే ఆలస్యం అయింది.

ఈ సినిమా ఐడియాను 'గాడ్ ఫాదర్ 2' నుంచి తీసుకున్నాను. మనం ఎక్కడ నుంచి స్ఫూర్తి పొందామో ముందే చెప్పేస్తే ఇది అందులో ఉంది.. ఇందులో ఉంది అని చెప్పకుండా చూస్తారని నమ్ముతాను.

స్టార్‌ని చేయాలనే పెద్ద సినిమాలు చేయించా

- బెల్లంకొండ సురేశ్

అమలా పాల్

''రాక్షసుడు' సినిమా బడ్జెట్ రూ.22 కోట్లు అయ్యింది. ఆంధ్ర, సీడెడ్, నైజాం థియేట్రికల్ రైట్స్ రూ.12 కోట్లు అమ్ముడు కాగా, హిందీ శాటిలైట్ రూ.12 కోట్లు, తెలుగు శాటిలైట్ రూ.5.90కోట్లు వ్యాపారం జరిగింది. మొత్తంగా రూ.30 కోట్లకు ఈ సినిమాను అమ్మాం. థియేట్రికల్ రైట్స్‌కు పెట్టిన ఖర్చు రూ.12 కోట్లు సోమవారానికే వచ్చాయి'' అని బెల్లంకొండ సురేశ్ అన్నారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమా పరమేశ్వరన్ జంటగా రమేశ్ వర్మ పెన్మత్స దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'రాక్షసుడు'. కోనేరు సత్యనారాయణ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 2న విడుదలైంది. మంగళవారం జరిగిన ప్రెస్‌మీట్‌లో బెల్లంకొండ సురేశ్ మాట్లాడుతూ- ''చాలా చోట్ల వర్షం వల్ల 'రాక్షసుడు' కలెక్షన్లకు అంతరాయం కలిగింది. వర్షం లేకుంటే కలెక్షన్స్ సునామీ సృష్టించేది. ఫస్ట్ వీక్ కంటే సెకండ్ వీక్ బాగున్నాయి. వైజాగ్, ఈస్ట్ హక్కులను నేనే కొన్నాను. వైజాగ్‌లో సోమవారానికే రూ.2 కోట్లు వచ్చాయి. ఇంత మంచి సినిమాను నాకు ఇచ్చిన రమేశ్ వర్మగారికి, కోనేరు సత్యనారాయణగారికి, హవీశ్‌గారికి రుణపడి ఉంటాను. ఈ సినిమాకు కథే హీరో.. ఆ తర్వాత పని చేసిన వారందరూ హీరోలే. జీబ్రాన్ ఫస్ట్ హీరో, ఆ తర్వాతే మా అబ్బాయే హీరో. ఈ నెల 15 తర్వాత టూర్ ప్లాన్ చేస్తాం. 'అల్లుడు శీను'కి మించిన వినోదం, పాటలుండి స్క్రిప్ట్ కుదిరితే మా అబ్బాయితో సినిమా చేస్తాను. గ్రాండ్ సినిమానే తీస్తాను. 'జయజానకీ నాయకా' భారీ బడ్జెట్‌తో తీశాం. కొంచెం నష్టపోయాం. మంచి కథ కుదరగానే మిర్యాల రవీందర్ రెడ్డితో కలిసి ఓ సినిమా చేస్తాను. అభిషేక్‌తో 'సాక్ష్యం' సినిమా చేశాను. ఆ తర్వాత 'కవచం, సీత' లాంటి సినిమాలు కొని, నష్టపోయినవాళ్లతో మా అబ్బాయి సినిమా చేసేలా చూస్తాను. మా అబ్బాయిని స్టార్ హీరోని చేయాలనే పెద్ద సినిమాలు చేసుకుంటూ వచ్చాను. ఎవరైనా తమ పిల్లలు పెద్ద పొజిషన్‌లోనే ఉండాలనుకుంటారు కదా. ఇండస్ట్రీలో, యూ ట్యూబ్‌లో తనకు మంచి బిజినెస్ క్రియేట్ అయ్యింది'' అన్నారు. ''రాక్షసుడు' సినిమాకి 10రోజుల్లోనే లాభాలు సాధించాం'' అన్నారు నిర్మాత 'మల్టీడైమన్షన్' వాసు. ''తొలివారంలో నాలుగో రోజు వసూళ్లు కాస్త డల్ కాగానే భయపడ్డా. రెండో వారంలో అద్భుతంగా ఉన్నాయి'' అన్నారు రమేశ్ వర్మ. సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ- ''మా సినిమా విడుదలైన 10వ రోజుకే డిస్ట్రిబ్యూటర్స్, ఎగ్జిబిటర్స్ సేఫ్ అయ్యారు. ఆర్టిస్ట్‌గా పేరు రావడం చాలా ఆనందంగా ఉంది. మా నాన్నను గర్వపడేలా చేయాలనుకున్నాను. అందరూ హీరోగా నా జాబ్ ఈజీ అనుకుంటారు. ఇక్కడికి రావడానికి చాలా కష్టపడ్డాను. ఇక్కడ పేరు తెచ్చుకుంటే నాన్నకు అది సంతోషం ఇస్తుంది. రీమేక్ సినిమా హిట్ చేయడం చాలా కష్టం. ఇందులో నేను చేసిన పాత్ర మిగతా సినిమాల్లా కాదు. చాలా అండర్ ప్లే చేయాల్సిన క్యారెక్టర్ నాది. అందుకే ప్రయోగాత్మక సినిమా అని చెప్పొచ్చు. ఇక పై కూడా మంచి కథల్ని ఎంపిక చేసుకుంటూ అలరిస్తాను'' అన్నారు.

బెల్లంకొండ, సాయి శ్రీనివాస్, సురేశ్

- మా అబ్బాయి సినిమాల్లో నేనెక్కువగా ఇన్వాల్వ్ అవుతానని అందరూ అనుకుంటారు. కానీ పెద్దగా జోక్యం చేసుకోను. సెట్‌కి కూడా తక్కువ వెళ్తాను. తమిళ 'రాక్షసన్'లో ఓ ఎమోషనల్ సీన్ ఉంది. ఆ సీన్ మా అబ్బాయి ఎలా చేస్తాడా? అనుకున్నా. ఆ సీన్ తీశాక చూశాను. అప్పుడే హిట్ అవుతుందనుకున్నా.
- మా రెండో అబ్బాయి గణేశ్‌ని కూడా హీరోని చేయబోతున్నాను. కథ, డైలాగ్ వెర్షన్ రెడీ అయ్యాయి.

జెర్సీ రీమేక్‌లో...

''కథాబలం ఉన్న కథలు, బలమైన పాత్రలు రావడంలేదు. అందుకే సినిమాలు వదిలేద్దామనుకున్నా'' అని ఇటీవల 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో అమలా పాల్ చెప్పారు. అయితే కథాబలం ఉన్న స్క్రిప్ట్ కావడంతో 'ఆమె'కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇటీవల ఈ చిత్రం విడుదలైన విషయం తెలిసిందే. ఇప్పుడు అమలా పాల్‌కి మరో బలమైన పాత్ర చిక్కింది. 'జెర్సీ' తమిళ రీమేక్‌లో అమలా పాల్‌ను కథానాయికగా అడిగారట. తెలుగు సినిమా చూసిన వారికి కథానాయిక శ్రద్ధా శ్రీనాథ్ పాత్రకు ఎంత ప్రాధాన్యం ఉందో తెలిసే ఉంటుంది. అందుకే ఈ చిత్రాన్ని అమలా పాల్ ఒప్పుకున్నారట. నాని, శ్రద్ధా శ్రీనాథ్ జంటగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం తమిళ రీమేక్‌ని హీరో రానా నిర్మించనున్నారు. నాని పాత్రలో విష్ణు విశాల్ నటిస్తారని తెలిసింది. అయితే ఇంకా దర్శకుడు ఖరారు కాలేదు. ఇదిలా ఉంటే ఈ చిత్రం హిందీ రీమేక్‌ని 'దిల్' రాజు, నాగవంశీ నిర్మించనున్నారు. ఇంకా తారాగణం ఎంపిక కాలేదు.

సినిమాలే సమాజం

- తెలకపల్లి రవి

తనికెళ్ల భరణి, సుద్దాల అశోక్ తేజ, పరుచూరి గోపాలకృష్ణ, తెలకపల్లి రవి

ప్రముఖ రచయిత, పత్రికా సంపాదకుడు, రాజకీయ విశ్లేషకుడు తెలకపల్లి రవి రాసిన 'మన సినిమాలు: అనుభవాలు-చరిత్ర-పరిణామం' పుస్తకావిష్కరణ మంగళవారం జరిగింది. ఈ పుస్తకాన్ని పవన్ కల్యాణ్ ఆవిష్కరించారు. తెలకపల్లి రవి మాట్లాడుతూ - ''సినిమాలను బాహుబలిగా చూపిస్తే తప్ప చూడలేని స్థితి ఎందుకు వచ్చింది? ప్రపంచీకరణ యుగంలో టెలివిజన్ వచ్చాక సినిమా ఎలా మారింది? ఆల్టర్నేటివ్ సినిమా ఎందుకు అదృశ్యం అయిపోయింది? ఇలాంటి అంశాలన్నీ ఈ పుస్తకంలో ఉంటాయి. సినిమాకి సోషల్ పవర్ ఉంది. సినిమాలే సమాజం. గౌరవప్రదమైన వారసత్వం తెలుగు సినిమాకి ఉంది. దాన్ని కాపాడుకోగల శక్తియుక్తులు మనకు ఉన్నాయని ఇటీవల ప్రకటించిన జాతీయ పురస్కారాలతో మరోసారి రుజువైంది. ఈ రచనా అధ్యయనం ఇకపై కూడా కొనసాగుతుంది. మరో రెండు మూడు పుస్తకాలు తీసుకురాబోతున్నాను'' అన్నారు. పరుచూరి గోపాలకృష్ణ, తనికెళ్ల భరణి, సుద్దాల అశోక్ తేజ, రావికొండల రావు తదితరులు పాల్గొన్నారు.

సీరియల్

యాడ్ ఫిల్మ్‌తో అవకాశం

'అగ్నిపూలు' సీరియల్ ద్వారా బుల్లితెరకు పరిచయమైన నటి పూర్ణికాసాన్వి. తెలుగింటి అమ్మాయి పూర్ణిక సీరియల్స్‌తో పాటు యాడ్ ఫిల్మ్స్‌లో మోడల్‌గా చేస్తూ, షార్ట్ ఫిల్మ్స్‌లో నటిస్తూ, తమిళం లోనూ రాణిస్తోంది. మంచి నటిగా గుర్తుంపు తెచ్చుకోవాలన్నదే తన లక్ష్యం అంటున్న పూర్ణిక చెబుతున్న ముచ్చట్లివి.

''మాది వైజాగ్. నాన్న రియల్ ఎస్టేట్ వ్యాపారి. అమ్మ గృహిణి. అన్నయ్య చదువుకుంటున్నాడు. మా నాన్న క్లోజ్ ఫ్రెండ్ డైరెక్టర్‌గా వర్క్ చేస్తున్నారు. మోడల్‌గా నే చేసిన ప్రకటనలు, షార్ట్ ఫిల్మ్స్ చూసి 'అగ్నిపూలు' సీరియల్‌లో నటించేందకు అవకాశం ఇచ్చారు. ఏడాదన్న రపాటు చేసిన ఆ సీరియల్‌లో నా పాత్రకు మంచి పేరొచ్చింది. 'ప్రణవి'గా తెలుగు ప్రేక్షకులకు దగ్గరయినందుకు ఆనందంగా ఉంది. ఇప్పుడు తమిళంలోనూ రెండు సీరియల్స్‌లో నటిస్తున్నాను.

ప్రకటనల పూర్ణిక

ఆన్ స్క్రీన్ అంటే చిన్నప్పటి నుంచి చాలా ఇష్టం ఉండేది. మా అమ్మ చిన్నాన్న సీనియర్ నటులు రంగనాథ్. అలా నాకూ నటన అంటే ఇష్టం ఏర్పడిందేమో అని అమ్మ అంటూ ఉంటుంది. చిన్నప్పటి నుంచీ టీవీలో వచ్చే యాడ్స్‌ని బాగా చూసేదాన్ని. వాటిల్లో యాక్ట్ చేయాలని నా డ్రీమ్. ఇప్పుడు యాడ్‌ఫిల్మ్‌లో నటిస్తూ నా కల నెరవేర్చుకుంటున్నాను.

ఇలా ఎంపికయ్యాను..

బీటెక్ ఫస్ట్ ఇయర్ చదివేటప్పుడు ఒక వెబ్‌సైట్‌లో మోడలింగ్ ఆడిషన్స్ ప్రకటన చూశాను. దాంట్లో నా పేరు రిజిస్టర్ చేయించుకున్నాను. ఇంట్లోముందు అమ్మనాన్న వద్దన్నారు. ఆ ఆడిషన్స్ జరిగే చోటు, వ్యక్తుల గురించి నా స్నేహితుల ద్వారా తెలుసుకొని అమ్మనాన్నలను ఒప్పించి ఆ ఆడిషన్స్‌కి వెళ్లి సెలక్ట్ అయ్యాను. అప్పటినుంచి చిన్నా పెద్ద యాడ్స్ చేస్తున్నాను.

ఫస్ట్ టైమ్ స్క్రీన్

బీటెక్ తర్వాత జాబ్ చేయడం ఇష్టం లేదు. యాక్టింగ్ ఫీల్డ్‌లో కొనసాగాలన్నది నా ఆశ. అమ్మనాన్నలకు మాత్రం పెళ్లి చేసేద్దామని ఆలోచన. ఈ లోగా వచ్చిన అవకాశాలను వినియోగించుకోవాలన్నది నా తపన. మోడల్‌గా, నటిగా ఎలా ఉంటానో అని ముందు భయపడినా ఫస్ట్ టైమ్ స్క్రీన్ మీద చూసినప్పుడు నా మీద నాకు కాన్ఫిడెంట్ వచ్చింది. దీంతో ఈ ఫీల్డ్ వద్దని చెప్పిన అమ్మనాన్నలు కూడా నా మీద నమ్మకంతో ఓకే చేశారు. నా స్నేహితులు కూడా నాకు సపోర్ట్‌గా ఉన్నారు.

నార్త్ ఇండియన్ లుక్

మోడలింగ్‌లో బాంబే మోడల్స్‌నే ఎంపికచేస్తారు అనే అభిప్రాయం ఉంది ఇన్నాళ్లూ. కానీ, స్క్రీన్ అప్పియరెన్స్ బాగుంటే తెలుగమ్మాయిలు కూడా మోడలింగ్‌లో రాణించవచ్చు. అలా రాణిస్తున్నవాళ్లూ ఉన్నారు. నేను చేసిన మోడల్‌గా చేసిన యాడ్ చూసిన వాళ్ల ద్వారా ఇప్పుడు మరిన్ని ఆఫర్లు వస్తున్నాయి. నార్త్ ఇండియన్ లుక్ ఉండటం కూడా మోడలింగ్‌లో కొంచెం ప్లస్ అయ్యింది.

ఫిట్‌నెస్ తప్పనిసరి

ఈ ఫీల్డ్‌లో పెళ్లిళ్లు అయ్యి, పిల్లలు ఉన్నవాళ్లూ ఉన్నారు. అయితే, తప్పకుండా ఫిట్‌నెస్ బాగుండాలి. స్లిమ్ ఉండాలి. వర్కవుట్స్ చేస్తుండాలి. స్కిన్‌టోన్ ఫ్రెష్‌గా ఉండాలి. బాడీ ఫిట్‌నెస్‌కు సంబంధించిన జాగ్రత్తలు తీసుకున్నా నేచురల్‌గా ఉండాలనుకుంటాను. మోడలింగ్‌లో రాణిస్తూనే సీరియల్ నటిగా కొనసాగాలనుకుంటున్నాను.''

– నిర్మలారెడ్డి

ఫ్లాప్‌లతో హిట్ షో

● ఫ్లాప్ షో



ఓ గవర్నమెంట్ డాక్టర్..

పేషంట్‌కి ఆపరేషన్ చేసి కత్తిని అతని కడుపులోనే మరిచిపోతాడు.

ఓ ప్రొఫెసర్..

తను చెప్పింది వినకపోతే విద్యార్థిని ఎంతకాలమైనా పాస్ చేయడు.

ఓ అధికారి..

చేయి తడపకపోతే ఫైల్ పైన సంతకం చేయనే చేయడు..

ఇవన్నీ మనదేశంలో ఎప్పుడూ తాజాగా వినిపించే వార్తలు. గవర్నమెంటు ఆఫీసులలో ఉద్యోగులు, కళాశాలలో ప్రొఫెసర్లు, ఆసుపత్రులలో డాక్టర్లు, పెద్ద పెద్ద ప్రభుత్వ నిర్మాణాలు చేపట్టే కాంట్రాక్టర్లు.. ఇలా ప్రభుత్వ ఉన్నతఅధికారుల నిర్లక్ష్య ధోరణిని వ్యంగ్యాత్మకంగా ఎండగట్టిన మొట్టమొదటి సీరియల్ 'ఫ్లాప్ షో.' ఈ దేశంలో సామాన్యుడు సామాజిక సమస్యలను ఏ విధంగా ఎదుర్కొంటున్నాడో కళ్లకు కట్టిన షో కూడా ఇదే. పదే పది ఎపిసోడ్స్ అయినా పది కాలాల పాటు అందరి మదిలో నిలిచిపోయిన 'ఫ్లాప్ షో'ని దూరదర్శన్ 1989లో ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చి పెద్ద సాహసమే చేసింది. బుల్లితెర చేసిన ఈ ఆలోచన ప్రేక్షకుడి మదిని తట్టిలేపింది. 'ఫ్లాప్ షో'ని కాస్తా హిట్ షోగా మార్చింది. ఈ వ్యంగ్య హాస్య సీరియల్‌కి మూలకర్త ఇండియన్ టెలి విజన్ పరిశ్రమలో ప్రముఖుడిగా పేరొందిన జస్పాల్ భట్టి.

ప్రభుత్వ యంత్రాంగ తీరుతెన్నులను వ్యంగ్యంగా చూపుతూనే వారు సమయాన్ని, డబ్బును ఎలా దుర్వినియోగం చేస్తుంటారో ఈ సీరియల్ ద్వారా ప్రజలకు తెలిసేలా పూనుకున్నారు జస్పాల్. మొత్తం పది ఎపిసోడ్లు. ప్రతీ ఎపిసోడ్‌లో ఓ ప్రభుత్వ అధికారి కుట్రపూరిత చర్యలు, నిర్లక్ష్యంతో కూడిన కథనం ఉంటుంది. ఈ సీరియల్‌కి దర్శకుడు, రచయిత మాత్రమే కాదు ఇందులోని ప్రధాన పాత్రధారి కూడా జస్పాల్ భట్టీయే. జస్పాల్ భార్యా సవితా భట్టి ఈ సీరియల్‌లో నటించడడమే కాకుండా నిర్మాతగానూ ఉన్నారు.

తప్పిపోయిన కుక్క

తప్పిపోయిన తన పెంపుడు కుక్కను వెతకడానికి ఓ అధికారి ప్రభుత్వ వనరులను వాడుకున్న విధం, అతని వృధా ఖర్చును ఈ షోలో చూపించడం విశేషం.

నకిలీ మెడికల్ బిల్స్‌తో బురిడీ

ప్రభుత్వ ఉద్యోగులకు మెడికల్ రీయింబర్స్‌మెంట్ కింద నగదు మొత్తం చెల్లిస్తుంది. దీని కోసం వీరు నకిలీ పత్రాలను సృష్టిస్తారనే వాదనను వ్యంగ్యాత్మకంగా తీసుకున్నారు జస్పాల్ భట్టి. ఇందులో జస్పాల్ గవర్నమెంట్ ఆఫీసర్. జస్పాల్ స్నేహితుడు అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరుతాడు. అతని మెడికల్ బిల్స్‌తో జస్పాల్ రీయింబర్స్‌మెంట్ కోసం నకిలీ పత్రాలను సృష్టిస్తాడు. అయితే, చికిత్స పొందుతూ జస్పాల్ స్నేహితుడు చనిపోతాడు. దీంతో అంతా జస్పాల్ చనిపోయినట్టు భావిస్తారు. హాస్యంగా భావించినా ఇందులోని వాస్తవాన్ని అంతా గుర్తించారు.

కాంట్రాక్టర్ల ఆస్తులు

రియల్ ఎస్టేట్ యజమానుల కష్టాలన్నీ డబ్బు చుట్టూతా తిరుగుతూ ఉంటాయి. రకరకాల వెంచర్ల పేరుతో కొత్త కొత్త స్కీములు సృష్టించడం వాటిలో ప్రజలను ఇరికించడం.. ఏ విధంగా ఉంటాయో వ్యంగ్యాత్మకంగా తీసుకున్నారు ఈ ఎపిసోడ్‌లో. ఇతరులకు చెందిన ఆస్తులను కబ్జా చేయడం, వారు సృష్టించే కొన్ని వంచక పథకాలను ఈ ఎపిసోడ్ హైలైట్ చేసింది. అంతేకాదు నాణ్యత లేకుండా ప్రభుత్వ భవనాని



ర్మాణాలను చేపట్టే కాంట్రాక్టర్ల పనికి మాలిన చర్యలను ఇందులో చూపించారు. కాంట్రాక్టర్లు నిర్మించిన ఈ నాణ్యతలేని భవనాలను ప్రభుత్వం ప్రజలకు ఇవ్వడం, ఆ గృహసముదాయాలలో నివాసితులు ఎలాంటి ఇబ్బందుల పాలవుతుంటారో చూపుతుంది ఈ ఎపిసోడ్.

బెదిరింపుల పీహెచ్‌డి

పోస్టుగ్రాడ్యుయేట్ రీసెర్చ్ విద్యార్థులు తమ గ్రంథ రచనకు ప్రొఫెసర్ల వద్ద చేరుతుంటారు. ప్రొఫెసర్ల చేతిలో ఆ విద్యార్థులు పడే పాట్లను 'ప్రొఫెసర్ అండ్ పీహెచ్‌డీ స్టూడెంట్స్ గైడ్' ఎపిసోడ్‌లో చూపింది. ప్రొఫెసర్ తన వద్ద రీసెర్చ్ స్టూడెంట్‌గా చేరిన అతని చేత తన ఇంటిపనులన్నీ చేయించుకుంటుంటాడు. చివరికి తన మరదలిని వివాహం చేసుకోవడానికి ఒప్పుకునేట్లయితేనే పాస్ చేస్తానని బెదిరిస్తాడు. ఇప్పటికీ ఇలాంటి ప్రొఫెసర్ల గురించి కథనాలు వెలువడుతూనే ఉండటం గమనార్హం.

పనికిమాలిన మీటింగ్‌లు..

కొంతమంది ప్రభుత్వ ఉన్నతోద్యోగులు రోజువారీ కార్యక్రమాల్లో భాగంగా అర్థం లేని సమావేశాలను ఏర్పాటు చేసుకొని బాతాఖానీ కొడుతుంటారని 'మీటింగ్' అనే ఎపిసోడ్‌లో చూపుతారు జస్పాల్.

పొట్టలో వాచీ

ప్రభుత్వ ఆసుపత్రులలో కొంతమంది డాక్టర్లు తమ విధుల పట్ల ఎంత నిర్లక్ష్యంగా ఉంటారో 'డాక్టర్' ఎపిసోడ్ చూస్తే ఇట్టే తెలిసిపోతుంది. జస్పాల్ భట్టి ఇందులో డాక్టర్ పాత్ర పోషించారు. రోగికి ఆపరేషన్ చేసి అతని పొట్టలో తన వాచీని మర్చిపోయిన విధానాన్ని ఈ ఎపిసోడ్‌లో చూపించారు. ఇలాంటి సంఘటనలను ఇప్పటికీ వార్తల్లో చూస్తుంటాం.

ముఖ్య అతిథి ఎప్పుడూ ఆలస్యమే...

ప్రజా వేదికలలో పాల్గొనాల్సిన ముఖ్య అతిథి కోసం జనం అంతా గంటలతరబడి ఎదురుచూస్తూ ఉంటారు. అయితే, ఆ వ్యక్తి ఎప్పుడూ ఫంక్షన్ టైమ్‌కి హాల్‌కి చేరుకోడు. ఇది తన ఒక ముఖ్యమైన అర్హతగా భావిస్తుంటాడు. ప్రభుత్వ అధికారులలో ఇప్పటికీ ఇలాంటి వారు ఉండటం గమనార్హం.

గజిబిజి కనెక్షన్ల లైన్‌మ్యాన్

ఇండియన్ టెలీఫోన్ డిపార్ట్‌మెంట్‌ని, అందులోని అధికారులను ఈ ఎపిసోడ్‌లో తూర్పారబట్టారు భట్టీ. ఇప్పుడంటే స్మార్ట్‌ఫోన్ల పరంపర వల్ల టెలీఫోన్ కనెక్షన్లు గురించి దిగుల్లేదు కానీ నాటి రోజుల్లో ఇదో పెద్ద తపస్సు. టెలీఫోన్ కనెక్షన్ కోసం అప్లయ్ చేసుకోవడం, నెలలు గడుస్తున్నా కనెక్షన్ రాకపోవడం, వచ్చినా నాణ్యతలేని టెలిఫోన్ పరికరాలను అమర్చడం.. వంటివెన్నో జరిగేవి. వాటన్నింటినీ ఈ ఎపిసోడ్‌లో చూపించారు.

అర్హతలు లేనివారి చేతిలో సృజన

సీరియల్ అన్నదే సృజన ఉన్న కంటెంట్. అయితే, దానిని కొంతమంది టీవీ నిర్మాతలు ఎలా విస్మరిస్తారో ఇందులో చూపించారు. ఎలాంటి అర్హతలు లేని డబ్బున్న వ్యక్తులు టెలివిజన్ కార్యక్రమాలు నిర్మించడం గురించి ఈ ఎపిసోడ్ చూపుతుంది.

ఇవన్నీ చదువుతుంటే ఇప్పటికీ ఇలాంటి ఎన్నో సంఘటనలు మనమధ్యే జరుగుతున్నట్టు అనిపిస్తుంది. ఇందులో కొన్ని మనం ఫేస్ చేసినవే అయుంటాయి. ఎప్పటికీ ఎవర్‌గ్రీన్‌గా నిలిచే ఈ స్ట్రాంగ్ కథనాలను 80ల కాలంలోనే దూరదర్శన్ ప్రేక్షకుడి కళ్లకు కట్టింది. 'ఫ్లాప్ షో' హిట్ ఫార్ములాగా ప్రజల మనసులను గెలుచుకుంది.

– ఎన్.ఆర్

జస్పాల్ భట్టీ

80-90ల కాలంలో దూరదర్శన్ చూసేవారికి జస్పాల్ భట్టీ పరిచయమే. అమృతసర్ వాసి అయిన జస్పాల్ 'కింగ్ ఆఫ్ కామెడీగా, కింగ్ ఆఫ్ సెటైర్'గా పేరొందారు. 'ఫ్లాప్ షో' తో పాటు 'ఉల్టా పల్టా', 'ఫుల్ టెన్షన్' లోనూ జస్పాల్ నటించి మెప్పించారు. వ్యంగ్య, హాస్య నటుడు, రచయిత, దర్శకుడు అయిన జస్పాల్ 2012లో మరణించారు. జస్పాల్ మరణించిన ఏడాదికి పద్మభూషణ్ అవార్డ్, అత్యున్నత పౌరపురస్కారాలతో భారత ప్రభుత్వం జస్పాల్‌ని గౌరవించింది.

పరి పరిశోధన

పంటి మూలాన్ని మళ్లీ పెంచవచ్చు!

వయసు రీత్యా.. లేదంటే ప్రమాదాల కారణంగానో మనం కోల్పోయిన పళ్లు మళ్లీ పెరిగితే ఎలా ఉంటుంది? ఆహారాన్ని చక్కగా ఆస్వాదించడమే కాదు.. అనేక ఇతర ఆరోగ్య ప్రయోజనాలు కూడా పొందవచ్చు. ఈ దిశగా జరుగుతున్న ప్రయత్నాల్లో కీలకమైన ముందడుగు పడింది. యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియా శాస్త్రవేత్త యాంగ్ చాయ్ పరిశోధనల పుణ్యమా అని ఇప్పుడుమన పళ్ల మూలాలు (రూట్)ను పునరుజ్జీవింప చేయడం సాధ్యం కానుంది. ఇది కాస్తా మళ్లీ మళ్లీ పళ్లను పెంచుకునేందుకు దారితీస్తుందని అంచనా. పిప్పిపళ్ల సమస్య బాగా తీవ్రమైనప్పుడు మనం రూట్ కెనాల్ థెరపీ చేయించుకుంటాం. దీంతో ఆ ప్రాంతంలో మళ్లీ పన్ను వచ్చేందుకు అస్సలు అవకాశం ఉండదు. మొదలంటా శుభ్రం చేసి ఉండటం దీనికి కారణం. అయితే డీఎన్ఏలో మార్పులేవీ చేయకుండానే కొన్ని జన్యువులను నియంత్రించడం ద్వారా పంటి మూలాలను మళ్లీ అభివృద్ధి చేయవచ్చునని చాయ్ తదితరులు ప్రయోగపూర్వకంగా తెలుసుకోగలిగారు. మన ముఖం ఎముకలు అభివృద్ధి చెందేందుకు ఈజెడ్‌హెచ్ 2 అనే ప్రొటీన్ ఉపయోగపడుతుందని చాలాకాలంగా తెలిసినా.. పంటి రూట్ విషయంలో దీని పాత్ర ఏమిటన్నది

పరిశీలించేందుకు చాయ్ తదితరులు ప్రయత్నం చేశారు. ఇంకో ప్రొటీన్ ఆర్‌ఐడి1ఏతో సమానంగా ఉంటే రూట్ వృద్ధి చెందేందుకు, దవడ ఎముకలతో రూట్స్ అనుసంధానమయ్యేందుకు వీలేర్పడుతోందని వీరు గుర్తించారు. అయితే నోట్లోని అన్ని రకాల పళ్లను కాకపోయినా సమీప భవిష్యత్తులో దవడ పళ్లను మళ్లీ మళ్లీ పెరిగేలా చేసేందుకు తాను ప్రయత్నిస్తున్నట్లు చాయ్ తెలిపారు.

ఈ నీటిమొక్క... పోషకాల పుట్ట!

మన్ కాయి డక్‌వీడ్! నాచులా.. నీటి వనరుల ఉపరితలంపై పెరిగే చిన్నసైజు మొక్కలు ఇవి. చాలామంది ఈ మొక్కలను చెత్త అనుకుంటారుగానీ... ప్రపంచం ఇప్పుడిప్పుడే దీని ప్రాముఖ్యతను గుర్తిస్తోంది. ఇదో పోషకాల గుట్ట అని చెబుతోంది. బెన్ గురియాన్ యూనివర్శిటీ శాస్త్రవేత్తల పరిశోధనల ప్రకారం.. ఈ మన్‌కాయి డక్‌వీడ్ కార్బోహైడ్రేట్లు బాగా తిన్నప్పుడు రక్తంలో గ్లూకోజు మోతాదు పెరిగిపోకుండా అడ్డుకోగలదు. అంటే.. ముధుమేహానికి మంచి విరుగుడన్నమాట. కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉన్న మరో ఆహారంతో పోల్చి చూసినప్పుడు మన్‌కాయి తీసుకున్న వారిలో అత్యధిక గ్లూకోజ్ మోతాదు తక్కువగా ఉన్నట్లు స్పష్టమైంది. దీంతోపాటు శరీరం నుంచి గ్లూకోజ్ వేగంగా తొలగిపోవడం.. ఉదయాన్నే పరగడుపున ఉండాల్సిన గ్లూకోజ్ కూడా తక్కువగా ఉండటాన్ని గుర్తించారు. అంతేకాకుండా.. మన్‌కాయి తీసుకున్న వారు చాలాకాలం పాటు కడుపు నిండుగా ఉన్న అనుభూతిని పొందారు. అంతేకాదు.. హిటా జెలీజా అనే శాస్త్రవేత్త జరిపిన పరిశోధన ద్వారా ఈ డక్‌వీడ్ కనీసం 45 శాతం ప్రొటీన్ అని తెలిసింది. హైడ్రోపోనిక్స్ పద్ధతిలో ఏడాది పొడవునా దీన్ని

పండించవచ్చునని శాస్త్రవేత్తలు అంటున్నారు. ఆగ్నేయాసియా ప్రాంతంలో వందల సంవత్సరాలుగా ఆహారంగా తీసుకుంటున్న మన్‌కాయిలో పాలిఫినాల్స్, ఫ్లేవనాయిడ్స్, పీచుపదార్థం, ఇనుము, జిక్ లాంటి మినరల్స్, ఏ, బీ కాంప్లెక్స్, బీ12 వంటి విటమిన్లు సమృద్ధిగా ఉన్నట్లు పరిశోధనల్లో స్పష్టమైంది.

ఇంటిప్స్

- గులాబ్‌జామ్ పిండిలో కొద్దిగా పన్నీరు తురుము కానీ జీడిపప్పు పొడి కానీ కలిపితే జామూన్లు ఎంతో మృదువుగా వస్తాయి!
- చీమలకు ఉప్పు అంటే పడదు. కాబట్టి చీమలు పడుతున్న చోట కాస్త ఉప్పు కలిపిన నీళ్లు చల్లితే సరి!
- సోఫా మీద నూనె మరకలు పడితే... ముందుగా వాటి మీద నిమ్మరసం చల్లాలి. తర్వాత దూదిని పెట్టి ఒత్తితే మరకలు పోతాయి.
- పులుసులు పెట్టినప్పుడు కొద్దిగా శెనగపిండి వేస్తే... పులుసు మరీ నీళ్లగా కాకుండా చిక్కగా వస్తుంది. రుచి కూడా బాగుంటుంది.
- మూడు కప్పుల నీళ్లలో ఓ కప్పు వెనిగర్ వేసి కలపాలి. స్ట్రాబెర్రీస్, గ్రేప్స్ లాంటి పండ్లని ఈ నీటితో కడిగి, బట్టతో తుడిచి, ఆపైన మూత గట్టిగా ఉండే డబ్బాలో వేసి ఫ్రిజ్‌లో ఉంచితే... కొన్ని వారాల పాటు పాడవకుండా ఉంటాయి.
- దుమ్ము కారణంగా కారు హెడ్‌లైట్స్ మీది అద్దాలు డల్‌గా అయిపోతే... ముందుగా టూత్‌పేస్ట్‌తో రుద్ది, ఆపైన మెత్తని బట్టతో తుడిచెయ్యాలి. అద్దాలు కొత్తవిలా మెరుస్తాయి.
- కార్పెట్‌కి బబుల్‌గమ్ అతుక్కుపోతే... ఓ ఐస్‌ముక్క తీసుకుని, గమ్ మీద బాగా రుద్దండి. కాసేపటికి ఊడి వచ్చేస్తుంది.

చెక్క గరిటెలకు నూనె జిడ్డు అంటుకుని వదలకపోతే... వాటిమీద కాస్త టేబుల్ సాల్ట్ చల్లి, టిష్యూ పేపర్‌తో తుడవాలి.

ఈఎన్‌టి కౌన్సెలింగ్

సర్జరీ తర్వాత మాట సరిగా రావడం లేదు

నాకు ఈమధ్యే గుండెకు సంబంధించిన సర్జరీ అయ్యింది. ఆ తర్వాత నుంచి ఎంత ప్రయత్నించినా మాట సరిగా రావడం లేదు. ఆ మాట కూడా గాలిలా వస్తోంది. అంతకముందు నాకు ఎప్పుడూ గొంతుకు సంబంధించిన సమస్యలు లేవు. ఇదేగాక... తినేటప్పుడు, తాగేటప్పుడు, మింగే సమయంలో ఇబ్బందిగా ఉంది. గొంతుకు ఏదో అడ్డు పడినట్లుగా ఉంది. నాకు తగిన పరిష్కారం చూపండి.

– కె.వి.జె. రాజు, గుంటూరు

మీ సమస్యకు సంబంధించిన వివరాలు పరిశీలించాక మీకు స్వరపేటికలోని ఒక భాగం అయిన 'వోకల్ ఫోల్డ్'లో సమస్య ఉన్నట్లుగా తెలుస్తోంది. గుండెకు సంబంధించిన ఆపరేషన్లు (ముఖ్యంగా ఓపెన్ హార్ట్ సర్జరీ), ట్రకియాస్టమీ, ఊపిరితిత్తులకు సంబంధించిన ఆపరేషన్స్‌లో కొన్నిసార్లు వోకల్‌ఫోల్డ్‌కు ఒత్తిడి తగలడం లేదా అది దెబ్బతిన డానికి అవకాశాలు ఎక్కువ. మీకు కూడా అలాగే జరిగినట్లుగా అనిపిస్తోంది. దీనివల్ల మీరు చెప్పిన విధంగానే మింగడం, మాట్లాడటంలో సమస్యలు రావచ్చు. కొన్ని సార్లు వోకల్ ఫోల్డ్ పెరాలసిస్ రావడానికి అవకాశం ఉంది. మీ సమస్యను నిర్ధారణ చేయడానికి మొదట మీరు అనుభవజ్ఞులైన ఈఎన్‌టీ వైద్యుడిని సంప్రదించండి. మీకు అవసరాన్ని బట్టి లారింగోస్కోపీ, ఎండోస్కోపీ వంటి పరీక్షలు చేయించాల్సి ఉంటుంది. అంతేకాదు... మీరొకసారి స్పీచ్ థెరపిస్ట్‌ను సంప్రదించి అవసరమైన ఎక్సర్‌సైజ్‌లు కూడా ప్రాక్టీస్ చేయాల్సి ఉంటుంది.

ఫ్యామిలీ డాక్టర్

మాట్లాడుతుంటే నత్తి వస్తోంది... పరిష్కారం చూపండి

నేను బీటెక్ చదువుతున్నాను. నేను సరిగా మాట్లాడలేకపోతున్నాను. మాట్లాడుతుంటే నాకు నత్తిలా వస్తోంది. వేగంగా మాట్లాడటం కష్టమవుతోంది. నా చదువు ఈ సంవత్సరంతో అయిపోతుంది. భవిష్యత్తులో ఉద్యోగం, కెరియర్ గురించి ఆలోచిస్తే నాకు భయంగా ఉంటోంది. ఈ సమస్య నుంచి ఎలా బయటపడాలో తెలియక చాలా బాధపడుతున్నాను. నాకు తగిన పరిష్కారం చూపండి.

– డి. విశాల్, సికింద్రాబాద్

మీ సమస్యను వైద్య పరిభాషలో స్టట్టరింగ్ అంటారు. దీనికి గల ముఖ్యకారణాల్లో జన్యుపరమైన అంశం ప్రధానమైనది. మీరు మీ సమస్య తీవ్రత ఎంత, ఏయే సందర్భాల్లో నత్తి వస్తోంది అన్న అంశాలు తెలుసుకోడానికి మొదట అనుభవజ్ఞులైన స్పీచ్ థెరపిస్ట్‌లను సంప్రదించవలసి ఉంటుంది. కొన్ని సార్లు అవసరమైతే సైకాలజిస్ట్‌ను కూడా సంప్రదించాల్సి ఉంటుంది. మీరు దీని గురించి మానసికంగా బాధపడితే ఈ సమస్య ఎక్కువవుతుంది. మీకు అవకాశాలు వచ్చినప్పుడు ప్రయత్నపూర్వకంగా మాట్లాడండి. దిగులు పడకుండా ధైర్యంగా సంభాషించండి. స్పీచ్ థెరపిస్ట్, సైకాలజిస్ట్‌ల నుంచి కౌన్సెలింగ్ తీసుకుని వారు చెప్పినట్లుగా ఇంటిదగ్గర ప్రాక్టీస్ చేస్తే ఈ సమస్యను చాలావరకు అధిగమించవచ్చు.

ముక్కులో ఏదో అడ్డం పడినట్లుగా ఉంటోంది...

నాకు ముక్కులో ఎప్పుడూ ఏదో అడ్డం పడినట్లుగా అనిపిస్తుంది. ఎంత ప్రయత్నించినా ఈ సమస్య వదలడం లేదు. చాలా రకాల మందులతో పాటు డాక్టర్ సలహా మేరకు ముక్కులోకి చుక్కల మందు వాడుతున్నాను. అది వాడినప్పుడు మాత్రం సమస్య తగ్గినట్లే తగ్గి మళ్లీ వస్తోంది. ఆ మందుకు అలవాటు అవుతానేమో అని మానేశాను. రాత్రిపూట రెండు ముక్కు రంధ్రాలు మూసుకుపోతున్నాయి. చాలాసార్లు నోటితో గాలి తీసుకోవాల్సి వస్తోంది. నా సమస్య ఏమిటి? దీనికి తగిన పరిష్కారం తెలియజేయగలరు.

– డి. శివరామ్, నేలకొండపల్లి

ఇటీవల కాలుష్యం వల్ల, జీవనశైలిలో మార్పుల వల్ల చాలామందిలో అలర్జీ సంబంధిత సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. అలర్జీ సంబంధిత సమస్యలలో మొదట ఉండేది ముక్కుకు సంబంధించిన సమస్యలే. మీరు చెప్పిన వివరాలను బట్టి మీకు ముక్కు దూలం వంకరపోవడం లేదా అలర్జీ లేదా ముక్కులో పాలిప్స్ లేదా ఈ అన్ని సమస్యలు కలగలిసి ఉండవచ్చు. మీరు మొదట నిపుణులైన ఈఎన్‌టీ వైద్యులను సంప్రదించి ముక్కుకు సంబంధించిన పరీక్షలు చేయించి, అవసరమైతే సీటీ స్కాన్ (పీఎన్ఎస్) కూడా తీయించాక మీ వ్యాధిని నిర్ధారణ చేయాల్సి ఉంటుంది.

మీకు ముక్కు దూలం వంకరపోతే దాన్ని ఒక చిన్న ఆపరేషన్‌తో సరిచేయవచ్చు. దీనినే సెప్టోప్లాస్టీ అంటారు. లేదా ముక్కులో పాలిప్స్ ఉన్నట్లయితే వాటిని కూడా ఆపరేషన్‌తో తొలగించవచ్చు. అలర్జీ వల్ల వచ్చే సమస్య అయి ఉంటే అందుకు కారణమైన అంశాలకు దూరంగా ఉండటం, ముఖ్యంగా కాలుష్యానికి దూరంగా ఉండటం, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, తాజా పదార్థాలు మాత్రమే తినడం, చల్లటి వాతావరణానికి, వస్తువులను దూరంగా ఉండటం వంటి చేయడం వల్ల మీ సమస్యను నివారించవచ్చు. కొన్నిరకాల నేసల్ స్ప్రేలు వాడటం వల్ల మీ సమస్యను అదుపులో ఉంచవచ్చు.

తరచూ జలుబు చేస్తోంది... తగ్గేదెలా?

నాకు తరచూ జలుబు చేస్తోంది. గత మూడేళ్ల నుంచి ఈ సమస్య మరీ ఎక్కువగా ఉంది. రోజువారీ పనులు చేసుకోలేక పోతున్నాను. టాబ్లెట్ వేసుకుంటే తగ్గుతుంది. ఆ తర్వాత మళ్లీ మళ్లీ వస్తోంది. దీనికితోడు ఈ మధ్య చాలా నీరసంగా కూడా ఉంటోంది. నా సమస్యకు పరిష్కారం చెప్పండి.

– కె.ఆర్. శ్రీనివాసమూర్తి, అమలాపురం

మీరు చెప్పిన వివరాలను పరిశీలిస్తే మీకు 'నేసల్ అలర్జీ' ఉండవచ్చు అనిపిస్తోంది. చిన్నప్పటి నుంచి మిమ్మల్ని ఈ సమస్య ఇబ్బంది పెడుతోంది అన్నారు కాబట్టి దీనికి మీరు సరైన చికిత్స తీసుకోలేదని అనిపిస్తోంది. ముక్కు, చెవి, గొంతు ఒకదానితో మరొకటి సంబంధం కలిగి ఉంటాయి. దానివల్ల ఒక భాగంలో సమస్య వస్తే అది మిగతా రెండుభాగాలను కూడా సమస్యకు గురిచేస్తుంది. మీరు చెప్పినట్లుగా యాంటీ అలర్జిక్ టాబ్లెట్ వాడటం శాశ్వత పరిష్కారం కాదు. పైగా దాన్ని ఎక్కువగా వాడటం వల్ల కొన్ని ఇతర సమస్యలు కూడా వస్తాయి. దీని కంటే 'నేసల్ స్ప్రే'లు వాడటం కొంత ఉపశమనాన్ని కలిగిస్తాయి. వాటితో సైడ్‌ఎఫెక్ట్స్ కూడా తక్కువగా ఉంటాయి. మీరు ముందుగా నిపుణులైన ఈఎన్‌టీ వైద్యులను సంప్రదించి వారి సూచనల ప్రకారం చికిత్స తీసుకోవడం మంచిది. దాంతోపాటు మీకు అలర్జీ కలిగించే అంశాలను గుర్తించి వాటి నుంచి దూరంగా ఉండండి.

డాక్టర్ ఇ.సి. వినయ కుమార్
హెచ్‌ఓడి & ఈఎన్‌టి సర్జన్,
అపోలో హాస్పిటల్స్, హైదరాబాద్

సాక్షి భవిత
మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక, రోడ్ నంబరు-1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. ఈ-మెయిల్ sakshieducation@gmail.com
స్పర్ధయా వర్ధతే విద్య
బుధవారం 14-8-2019

క్యాంపస్ ప్లేస్‌మెంట్స్



ఐటీ కంపెనీల్లో నియామకాలు జోరందుకునే అవకాశం కనిపిస్తోంది. ఐటీ దిగ్గజ సంస్థలు ఈ ఆర్థిక సంవత్సరంలో భారీ రిక్రూట్‌మెంట్స్‌కు తెరలేపే అవకాశం ఉన్నట్లు మార్కెట్ వర్గాల అంచనా. ఇప్పటికే ప్రముఖ ఐటీ కంపెనీ ఇన్ఫోసిస్ ఈ సంవత్సరం 18వేల మందికి ఆఫర్స్ ఇవ్వనున్నట్లు ప్రకటించింది. అలాగే, ఇతర టాప్ సాఫ్ట్‌వేర్ సంస్థలు టీసీఎస్, విప్రో, టెక్ మహీంద్ర, హెచ్‌సీఎల్ సైతం కొత్తగా నియామకాలు చేపట్టాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విద్యాసంవత్సరానికి సంబంధించి ప్లేస్‌మెంట్స్ ప్రక్రియకు ఐటీ సంస్థలు సిద్ధమవుతున్న వేళ.. ఆయా కంపెనీల నియామకాల తీరుతెన్నులను తెలుసుకుందాం...

ఐటీ ఆఫర్ అందుకునేదెలా..!

ఐటీ రంగంలోని ప్రముఖ కంపెనీలతో పాటు ఇతర సాఫ్ట్‌వేర్ సేవల సంస్థలు సైతం భవిష్యత్‌లో భారీగా అవకాశాలు కల్పించనున్నట్లు పలు సర్వేల అంచనా. ఇలాంటి తరుణంలో సంబంధిత కోర్సుల విద్యార్థులు.. ఇప్పటి నుంచే తమ నైపుణ్యాలకు పదును పెట్టుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఆయా ఐటీ సంస్థలు అనుసరిస్తున్న నియామక విధివిధానాల గురించి తెలుసుకొని.. అందుకు తగ్గట్టు సిద్ధమైతే సాఫ్ట్‌వేర్ కొలువు సొంతం చేసుకోవచ్చు. మార్కెట్ అంచనాల ప్రకారం- ఈ సంవత్సరం ఐటీ, ఐటీ ఆధారిత సంస్థలతో క్యాంపస్‌లు కళకళలాడనున్నాయి.

ఎంపిక ప్రక్రియ ఎలా

ఐటీ కంపెనీలు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో వేర్వేరు రిక్రూట్‌మెంట్ విధానాలు అవలంబిస్తున్నాయి. మొత్తమ్మీద అన్ని కంపెనీలు తప్పనిసరిగా 3-4 దశల్లో నైపుణ్యాలు పరీక్షించాకే ఆఫర్స్ ఇస్తున్నాయి. ప్రతిభావంతులను గుర్తించేందుకు మొదట స్క్రీనింగ్ టెస్ట్/ఆప్టిట్యూడ్ టెస్ట్ నిర్వహించడం సర్వసాధారణంగా మారింది. స్క్రీనింగ్ టెస్టుల్లో భాగంగా కమ్యూనికేషన్ స్కిల్స్, ఆప్టిట్యూడ్ పరీక్షిస్తున్నాయి. 45 నిమిషాల నుంచి గంట పాటు ఆన్‌లైన్‌లో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందులో క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, వెర్బల్ ఎబిలిటీ, లాజికల్ రీజనింగ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, ఇంగ్లిష్ సెక్షన్ల నుంచి ప్రశ్నలు ఉంటాయి. ఈ టెస్ట్‌లో ప్రతిభ ఆధారంగా ఆయా కంపెనీలు ఖాళీల సంఖ్యకు 1:5 లేదా 1:6 నిష్పత్తిలో విద్యార్థులను తదుపరి దశల్లోకి అనుమతిస్తున్నాయి.

అప్టిట్యూడ్ టెస్టు

- **అప్టిట్యూడ్ టెస్టులో** క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్/న్యుమరికల్ ఎబిలిటీ ముఖ్యమైంది. ఈ విభాగంలో.. టైమ్ అండ్ వర్క్, ప్రాబబిలిటీ, పర్ముటేషన్ అండ్ కాంబినేషన్స్, టైమ్ అండ్ డిస్టెన్స్, సగటు, నంబర్ సిస్టమ్స్, నిష్పత్తులు, లాభనష్టాలు, ట్రైన్స్ మీద ప్రశ్నలు వస్తాయి. అలాగే లాగరిథమ్, కసాగు, గసాభా మొదలైన అంశాలపై ఎక్కువ శాతం ప్రశ్నలు అడుగుతున్నారు. వీటితోపాటుగా వడ్డీలపై ప్రశ్నలు, బోట్స్ అండ్ స్ట్రీమ్స్, పార్టనర్‌షిప్స్, ఎత్తు-దూరం తదితర అంశాలపై ప్రశ్నలడిగే అవకాశముంది. అదేవిధంగా డేటా ఇంటర్‌ప్రిటేషన్‌కు సంబంధించి బార్‌గ్రాఫ్, లైన్‌గ్రాఫ్, పైచార్టులు, నెట్ డయాగ్రమ్స్, ట్యాబులర్ డేటా ఇచ్చి సమస్యలు పరిష్కరించమని కోరతారు.
- **లాజికల్ రీజనింగ్‌లో..** కోడింగ్-డీకోడింగ్, డైరెక్షన్స్, క్లాక్స్, పజిల్స్, డేటా సఫిషియన్సీ, లాజికల్ ప్రాబ్లమ్స్, క్యాలెండర్స్, క్యూబ్స్, వెన్ డయాగ్రమ్స్, అనాలజీస్, బ్లడ్ రిలేషన్స్, నాన్ వెర్బల్ తదితర విభాగాల్లో విద్యార్థుల ప్రతిభను పరీక్షిస్తారు.
- **వెర్బల్ ఎబిలిటీలో..** వొకాబులరీ, సినానిమ్స్, యాంటానిమ్స్, అనాలజీస్, సెంటెన్స్ కంప్లీషన్, సెంటెన్స్ కరెక్షన్, గ్రామర్ కాన్సెప్ట్స్, ఇడియమ్స్ అండ్ ఫ్రేజెస్, రీడింగ్ కాంప్రహెన్షన్ నుంచి ప్రశ్నలు అడుగుతారు.

కోడింగ్

ముఖ్యంగా ఐటీ సేవల, ఐటీ ఉత్పత్తుల సంస్థలు తదుపరి దశల్లో తప్పనిసరిగా కోడింగ్ నైపుణ్యాలను పరీక్షిస్తున్నాయి. వీటితోపాటు కంప్యూటర్ ఆధారిత పరీక్ష, బృంద చర్చలు, టెక్నికల్ రౌండ్, హెచ్‌ఆర్ రౌండ్‌లు ఉంటున్నాయి. కోడింగ్ టెస్టును కంప్యూటర్ టెస్టులతో కలిపి (లేదా) వేరుగా నిర్వహించే వీలుంది. అందులోనే కంప్యూటర్‌సైన్స్ సబ్జెక్టుల ప్రాథమిక భావనల అంశాలు కూడా ఉంటున్నాయి. సీ లాంగ్వేజ్, డేటాస్ట్రక్చర్స్, అల్గారిథమ్స్, సీ++ లాంగ్వేజ్, డీబీఎంఎస్, ఆపరేటింగ్ సిస్టమ్స్, కంప్యూటర్ నెట్‌వర్క్, జావా సబ్జెక్టుల బేసిక్ కాన్సెప్టుల నుంచి తప్పనిసరిగా ప్రశ్నలు ఉంటున్నాయి. అలానే, ఏదైనా ఒక సమస్య ఇచ్చి 'కోడింగ్ రాయమని పేర్కొంటాయి. ఆన్‌లైన్లోనే నిర్దేశిత సమయంలోపు కోడింగ్ చేయాలి.

ఐటీ రంగంలో భారీ ఆఫర్లు ఉంటాయని అంచనా

ఆన్ క్యాంపస్, ఆఫ్ క్యాంపస్‌లో రిక్రూట్‌మెంట్స్

వివిధ దశల ఎంపిక ప్రక్రియ ద్వారా నియామకాలు

పజిల్స్

కొన్ని సంస్థలైతే పజిల్స్‌పై ప్రశ్నలు అడుగుతున్నాయి. నిర్దిష్టంగా ఒక సమస్య లేదా ప్రోగ్రాం ఇచ్చి దాని ఆధారంగా.. నిర్దేశిత కంప్యూటర్ లాంగ్వేజ్‌లో కోడింగ్ రూపొందించమని కోరుతున్నాయి. అలాగే కోడింగ్‌లో లాజిక్ గుర్తించడం వంటి నైపుణ్యాలు తెలుసుకునేందుకు పజిల్ టెస్టులు నిర్వహిస్తున్నాయి. విద్యార్థులు ఆన్‌లైన్‌లో ప్రాక్టీస్ చేసుకునేందుకు చాలా పజిల్స్ అందుబాటులో ఉన్నాయి. ఇండియాబిక్స్, గీక్స్ ఫర్ గీక్స్ లాంటి వెబ్‌సైట్లు ఉపయుక్తమని చెప్పొచ్చు. ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్ నుంచి కూడా పజిల్స్ అడుగుతున్నారు.

జాబ్ రెడీ స్కిల్స్

సంస్థలు విద్యార్థుల్లో 'జాబ్‌రెడీ' స్కిల్స్ కోరుకుంటున్నాయి. శిక్షణా ఖర్చులను తగ్గించుకోవడానికి మొగ్గుచూపుతున్నాయి. అంటే.. ఉద్యోగానికి ఎంపికైన విద్యార్థికి మళ్లీ కార్పొరేటు ట్రైనింగ్ ఇవ్వడం ద్వారా సమయం, అనవసరపు ఖర్చులు తగ్గించుకునే ప్రయత్నం చేస్తున్నాయి. నియామక సమయంలోనే వారికి సమస్య ఇచ్చి.. పరిష్కరించమని అడుగుతున్నాయి. కోడింగ్ ఇచ్చి దాన్ని ఎంత వరకు మెరుగుపర్చవచ్చు, తప్పులు ఏమైనా ఉన్నాయా! లాజిక్ తప్పు దొర్లిందా.. లేక సింటాక్స్ పొరపాటుగా ఉందా! మొదలైనవి గమనించి మెరుగుపరచాలని కోరుతారు. ఈ టెస్టుల ద్వారా అభ్యర్థులను రియల్ ప్రాజెక్టులకు నేరుగా పంపాలా లేక కార్పొరేటు శిక్షణ ఇవ్వాలా, ఏ టెక్నాలజీ మీద రాణించగలరు వంటి అంశాలపై స్పష్టత వస్తుంది. ఇటీవల కాలంలో నిజ జీవితంలో ఒక సగటు వ్యక్తికి, సంస్థకు వచ్చే సమస్యలకు టెక్నాలజీ ఆధారితపరిష్కార మార్గాలు చూపమనే ప్రశ్నలు ఎదురవుతున్నాయి.

టీసీఎస్ కొత్త ఒరవడి

ఐటీ సేవల ప్రముఖ సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్).. క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్‌లో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది. గతేడాది నుంచి 'టీసీఎస్ నేషనల్ క్వాలిఫైర్ టెస్ట్(టీఎన్‌క్యూటీ)'ను ప్రారంభించింది. దేశవ్యాప్తంగా ఉమ్మడి పరీక్ష ద్వారా అన్ని కాలేజీల విద్యార్థులు పాల్గొనే అవకాశం కల్పిస్తోంది. ఈ పరీక్ష ద్వారా కాలేజీ, బ్రాంచులతో సంబంధం లేకుండా ప్రతిభగల విద్యార్థులను గుర్తించే కార్యక్రమం చేపట్టింది టీసీఎస్. సంప్రదాయ ప్లేస్‌మెంట్స్ ప్రక్రియ పూర్తవ్వడానికి మూడు నుంచి నాలుగు నెలల సమయం పడుతోంది. టీసీఎస్ క్వాలిఫయర్ టెస్టుతో నియామక ప్రక్రియ మొత్తం మూడు నుంచి నాలుగు వారాల్లోనే పూర్తయ్యే వీలుంది. 2020-టీఎన్‌క్యూటీ షెడ్యూల్ కూడా సంస్థ విడుదల చేసింది. టీసీఎస్ నేషనల్ క్వాలిఫైర్ టెస్ట్ గంటన్నర పాటు ఉంటుంది. ఇంగ్లిష్ నుంచి 15 ప్రశ్నలు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ నుంచి 15 ప్రశ్నలు, ప్రోగ్రామింగ్ లాజిక్ విభాగం నుంచి 10 ప్రశ్నలు, ఒక ప్రాబ్లమ్ స్టేట్‌మెంట్ కోడింగ్ విభాగాలు ఉంటాయి. ఇందులో ప్రతిభ మదింపు తర్వాత ఎంపికైన అభ్యర్థులకు ఇంటర్వ్యూ తేదీలు, ప్రదేశాన్ని తెలియజేస్తారు. ఆన్‌లైన్ టెస్టు అనంతరం టెక్నికల్ రౌండ్, మేనేజీరియల్ రౌండ్, హెచ్‌ఆర్ రౌండ్స్ ఉంటాయి. ఆన్‌లైన్ టెస్టులో కోడింగ్ పరిజ్ఞానం, బేసిక్ సబ్జెక్టులైన సీ, సీ++ల్లో ప్రోగ్రామింగ్ లాజిక్‌ను పరీక్షించే విధంగా ప్రశ్నలు ఉన్నాయి. క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ సెక్షన్‌లో స్టాండర్డ్, అడ్వాన్స్‌డ్ మోడల్స్‌లో ప్రశ్నలు వచ్చాయి. ఇక ప్రోగ్రామింగ్ లాజిక్ సెక్షన్‌లో బేసిక్ ప్రోగ్రామింగ్ కాన్సెప్టుల నుంచి ప్రశ్నలు ఉంటాయి.

సంస్థ గురించి మీకేం తెలుసు!

ఆన్‌లైన్ టెస్ట్ అనంతరం ఇంటర్వ్యూ ఉంటుంది. అభ్యర్థి తన వ్యక్తిగత వివరాలతో పాటు సంస్థ గురించి కూడా తెలుసుకొని వెళ్లడం లాభిస్తుంది. రెజ్యుమోలో పేర్కొన్న ప్రతి ఒక్క అంశం పట్ల లోతైన పరిజ్ఞానం కలిగి ఉండాలి. హెచ్‌ఆర్ రౌండ్‌లో సాధారణంగా ఎదురయ్యే ప్రశ్నలు కొన్ని ఉంటాయి. వాటికి సిద్ధమవ్వాలి. ఉదాహరణకు.. మీ గురించి చెప్పమని కోరతారు, మా సంస్థలోనే ఎందుకు ఉద్యోగం చేయాలనుకుంటున్నారు, రాబోయే అయిదేళ్లో మిమ్మల్ని మీరు ఏ స్థానంలో చూడాలనుకుంటున్నారు, మీ బలాలు, బలహీనతలు ఏంటి, కాలేజీలో చేసిన ప్రాజెక్టులు-ఉపయోగించిన టెక్నాలజీలు వంటి వాటిపై ప్రశ్నలు సహజంగా అడుగుతారనే విషయాన్ని గుర్తించుకోవాలి!!



టిప్స్

- క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో విజయం సాధించాలంటే.. విద్యార్థులు సదరు కంపెనీలు గతంలో నిర్వహించిన ప్రశ్నపత్రాలను సేకరించుకొని ప్రాక్టీస్ చేయాలి. వివిధ వెబ్‌సైట్లల్లో గత ప్రశ్నపత్రాలను పొందవచ్చు.
- పరీక్ష విధానం, దానికి కేటాయించే సమయం కంపెనీని బట్టి మారుతూ ఉంటుంది. కాబట్టి విద్యార్థులు తాము హాజరు కాబోయే కంపెనీ అనుసరించే పరీక్ష విధానాన్ని ముందుగానే తెలుసుకోవాలి.
- థర్డ్ ఇయర్‌లో ఉన్న విద్యార్థులు ఇప్పటి నుంచే ఆప్టిట్యూడ్ ప్రాక్టీస్ చేయడం లాభిస్తుంది.
- సమస్యను సాధించడంతోపాటు పజిల్ టెస్టులకు కంపెనీలు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి.
- కాలేజీలో నిర్వహించే క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్(సీఆర్‌టీ) తరగతులకు తప్పనిసరిగా హాజరవ్వాలి. సందేహాలు వస్తే ఫ్యాకల్టీని అడిగి తెలుసుకోవాలి.
- టైమ్ లిమిట్ పెట్టుకొని ప్రాక్టీస్ చేయాలి.
- టెక్నికల్ దశలో డేటా స్ట్రక్చర్స్, అల్గారిథమ్స్, డీబీఎంఎస్, ఆపరేటింగ్ సిస్టమ్, నెట్‌వర్కింగ్, ఊప్స్ కాన్సెప్ట్స్, ఒక కోడింగ్ లాంగ్వేజ్ మీద సంపూర్ణ పట్టు అవసరం.

జాబ్ పాయింట్

ఎన్‌వీఎస్

ఖాళీలు 2370

నవోదయ విద్యాలయ సమితి (ఎన్‌వీఎస్).. న్యూఢిల్లీలోని ప్రధాన కేంద్రంతో పాటు ప్రాంతీయ కేంద్రాలు, జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2370 టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టులు:** అసిస్టెంట్ కమిషనర్-5, పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ (పీజీటీ)-430, ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్-1154, మ్యూజిక్ టీచర్-111, ఆర్ట్ టీచర్-130, పీఈటీ మేల్-148, పీఈటీ ఫిమేల్-105, లైబ్రేరియన్-70, ఫిమేల్ స్టాఫ్ నర్స్-55, లీగల్ అసిస్టెంట్-1, క్యాటరింగ్ అసిస్టెంట్-26, లోయర్ డివిజన్ క్లర్క్-135.
- **ఎంపిక:** రాత పరీక్ష, ట్రేడ్/స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఆగస్టు 25, 2019.
- **ఫీజు చెల్లించడానికి చివరితేదీ:** ఆగస్టు 26, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://navodaya.gov.in

ఆర్‌సీఎఫ్ఎల్ - ముంబై

ఖాళీలు 24

ముంబైలోని రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్ (ఆర్‌సీఎఫ్ఎల్)..24 ఆఫీసర్, అసిస్టెంట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. **ఆఫీసర్ (ఫైనాన్స్):** 12
- **అర్హత:** చార్టెడ్ అకౌంటెంట్/కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్ లేదా బీకాం/ ఎంబీ (ఫైనాన్స్)/ఎంఎంఎస్/పీజీడీబీఎం ఉత్తీర్ణత. నిర్దిష్ట అనుభవం కూడా ఉండాలి.

2. **అసిస్టెంట్ ఆఫీసర్ (ఫైనాన్స్):** 12
- **అర్హత:** గ్రాడ్యుయేషన్ (బీకాం), సీఏ ఇంటర్మీడియట్/ఐపీసీసీ/సీఎంఏ ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత.
- **వయసు:** 30 ఏళ్లకు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు గరిష్ట వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ఎంపిక:** షార్ట్‌లిస్టింగ్, ఆన్‌లైన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.700. (ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీలకు ఫీజు లేదు).
- **దరఖాస్తు ఫీజు చెల్లించడానికి చివరితేదీ:** ఆగస్టు 29, 2019.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఆగస్టు 27, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.rc-fltd.com

సీడీఆర్ఐ-లక్నో

ఖాళీలు 18

లక్నోలోని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్)కి చెందిన సెంట్రల్ డ్రగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీడీఆర్ఐ).. 18 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ పోస్టులు:** సైంటిస్ట్-9, సీనియర్ సైంటిస్ట్-8, ప్రిన్సిపల్ సైంటిస్ట్-1.
- **అర్హత:** పోస్టులను బట్టి ఎంబీబీఎస్, ఎండీ/ఎంవీఎస్సీ, ఎంఈ/ఎంటెక్, బీటెక్/ఎంఎస్సీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** పోస్టులను బట్టి 32-45 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ (పోస్టు)ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.100 (ఎస్సీ, ఎస్టీ, మహిళలు, దివ్యాంగులకు ఫీజు లేదు).
- **ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం:** ఆగస్టు 16, 2019.
- **చివరితేదీ:** సెప్టెంబర్ 30, 2019.
- **హార్డ్‌కాపీలను పంపడానికి చివరితేదీ:** అక్టోబర్ 15, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://cdri.res.in

ఎన్ఈఎస్ఏసీ

ఖాళీలు 10

భారత ప్రభుత్వ అంతరిక్ష విభాగానికి చెందిన ఉమయాం (మేఘాలయ)లోని నార్త్ ఈస్టర్న్ స్పేస్ అప్లికేషన్ సెంటర్ (ఎన్ఈఎస్ఏసీ) 10 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ పోస్టులు:** సైంటిస్టు/ఇంజనీర్-8, టెక్నికల్ అసిస్టెంట్-2.
- **విభాగాలు:** జియో సైన్సెస్, అగ్రికల్చర్, స్పేస్ అండ్ అట్మాస్ఫియరిక్ సైన్సెస్, వాటర్ రీసోర్సెస్, ఎలక్ట్రానిక్స్, అర్బన్ అండ్ రీజియన్ ప్లానింగ్ తదితర విభాగాలున్నాయి.
- **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత సబ్జెక్టుల్లో డిప్లొమా, ఎంఎస్సీ, బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్ ఉత్తీర్ణతతో పాటు అనుభవం ఉండాలి.
- **వయసు:** 2019, సెప్టెంబర్ 16 నాటికి 18-35 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక విధానం:** రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.500 (ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, ఎక్స్-సర్వీస్‌మెన్, మహిళా అభ్యర్థులకు ఫీజు లేదు).
- **దరఖాస్తుకు చివరితేదీ:** సెప్టెంబర్ 16, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://ne-sac.gov.in

ఆర్ఈసీపీడీసీఎల్

ఖాళీలు 12

నోయిడాలోని భారత ప్రభుత్వ అనుబంధ సంస్థ అయిన ఆర్ఈసీ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఆర్ఈసీపీడీసీఎల్) ఒప్పంద ప్రాతిపదికన 12 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టులు:** చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అసిస్టెంట్ సీనియర్ ఎగ్జిక్యూటివ్.
- **అర్హత:** పోస్టులను బట్టి ఏదైనా డిగ్రీ, సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, సీఏ ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట అనుభవం ఉండాలి.
- **వయసు:** పోస్టులను బట్టి 35-45 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** షార్ట్ లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఆగస్టు 27, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.recpdcl.in

యూపీఎస్సీ

ఖాళీలు 13

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ)..13 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** అసిస్టెంట్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ (హిందీ)-1, డిప్యూటీ క్యూరేటర్-1, మేనేజర్-4, సీనియర్ ఫోటోగ్రాఫిక్ ఆఫీసర్-2, అసిస్టెంట్ డైరెక్టర్-1, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-4.
- **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత సబ్జెక్టుల్లో బ్యాచిలర్స్ డిగ్రీ, బీటెక్, మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు అనుభవం ఉండాలి.
- **ఎంపిక:** షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.25.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఆగస్టు 29, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.upsc.gov.in

బెల్

ఖాళీలు 5

భారత రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెల్).. ఒప్పంద ప్రాతిపదికన 5 కాంట్రాక్ట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత.
- **వయసు:** 27 ఏళ్లకు మించకూడదు.
- **ఎంపిక విధానం:** రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఆగస్టు 28, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.belin-dia.in

సాక్షి స్పోర్ట్స్
బుధవారం
14-8-2019

రాహుల్ ద్రవిడ్‌కు లైన్ క్లియర్

దిగ్గజ క్రికెటర్ రాహుల్ ద్రవిడ్ విషయంలో తలెత్తిన కాన్‌ఫ్లిక్ట్ ఆఫ్ ఇంట్రెస్ట్ చర్చకు తెరపడింది. మాజీ కెప్టెన్ ఈ అంశం పరిధిలోకి రాడని తమ పరిశీలనలో తేలినట్లు క్రికెట్ పాలకుల మండలి (సీవోఏ) సభ్యుడు రవి తోగ్డే స్పష్టం చేశారు. 'మేం నోటీసు ఇచ్చాం. ద్రవిడ్ సమాధానమిచ్చాడు. తన నియామకానికి అంగీకరించాం. అయితే, ఇప్పుడు నిర్ణయం బీసీసీఐ అంబుడ్స్‌మన్-నైతిక విలువల అధికారి డీకే జైన్ చేతిలో ఉంది. జైన్ ఏమైనా విరుద్ధ ప్రయోజనాలు గుర్తిస్తే... మా పరిశీలనను తెలుపుతాం' అని చెప్పారు.

కోహ్లి

సిరీస్‌పై గురి

- నేడు వెస్టిండీస్‌తో భారత్ చివరి వన్డే
- ఓపెనర్ ధావన్ ఫామ్‌పైనే చర్చంతా
- కరీబియన్ దిగ్గజం గేల్‌కు చివరి మ్యాచ్
- మ్యాచ్‌కు పొంచి ఉన్న వర్షం

రాత్రి గం.7 నుంచి సోనీ టెన్-1లోప్రత్యక్ష ప్రసారం

కరీబియన్ పర్యటనలో పరిమిత ఓవర్ల ఫార్మాట్‌ను అజేయంగా ముగించేందుకు టీమిండియా సిద్ధమవుతోంది. టి20ల్లో క్లీన్ స్వీప్ చేసి, రెండో వన్డేలో సునాయాస విజయం సాధించిన కోహ్లి సేన... ఆఖరిదైన మూడో వన్డేనూ హస్తగతం చేసుకుని సిరీస్ సొంతం చేసుకునే ప్రయత్నంలో ఉంది. వెస్టిండీస్ మాత్రం ఈ మ్యాచ్‌లోనైనా నెగ్గి సొంతగడ్డపై పరువు దక్కించుకోవాలని చూస్తోంది. అన్ని రంగాల్లో బలంగా ఉన్న భారత్‌ను నిలువరించాలన్నా, తమ దిగ్గజ క్రికెటర్ క్రిస్ గేల్‌కు ఘనంగా వీడ్కోలు ఇవ్వాలన్నా ఆ జట్టు శక్తికి మించి రాణించాల్సి ఉంటుంది.

పోర్ట్ ఆఫ్ స్పెయిన్: నిన్నటివరకు టీమిండియా బ్యాటింగ్ ఆర్డర్‌లో నంబర్-4 స్థానంపై సాగిన చర్చ... ఇప్పుడు సీనియర్ ఓపెనర్ శిఖర్ ధావన్ ఫామ్ వైపు మళ్లింది. ప్రపంచ కప్‌లో అద్భుత సెంచరీతో ఊపుమీదున్న స్థితిలో గాయంతో వైదొలగిన ధావన్ పునరాగమనంలో పరుగులకు ఇబ్బంది పడుతున్నాడు. టి20ల్లో, రెండో వన్డేలో అతడు ఏమాత్రం సాధికారికంగా ఆడలేకపోయాడు. బుధవారం వెస్టిండీస్‌తో ఇక్కడ జరిగే చివరి మ్యాచ్‌లోనైనా ధావన్ గాడిలో పడాల్సిన అవసరం ఉంది. విజయాల ఊపులో ఉన్న భారత్ ప్రత్యర్థికి పుంజుకునే అవకాశం ఇవ్వకుండా ఆడితే మరో సిరీస్ మన ఖాతాలో చేరడం ఖాయం. సిరీస్‌ను సమ చేయడంతో పాటు కెరీర్లో ఆఖరి మ్యాచ్‌గా ప్రకటించిన గేల్‌ను గౌరవంగా సాగనంపడం ఇప్పుడు కరీబియన్ల ముందున్న రెండు లక్ష్యాలు. గత మ్యాచ్ ఆడిన జట్టుతోనే భారత్ బరిలో దిగనుండగా... విండీస్ ఒక మార్పు చేయనున్నట్లు తెలుస్తోంది.

అతడి ఆటపైనే దృష్టి...

ధావన్ ఫామ్ కోసం కష్టాలు పడుతుండటంతో జట్టుకు శుభారంభాలు దక్కడం లేదు. రెండో వన్డేలో రోహిత్ కూడా విఫలమడంతో కష్టాల్లో పడింది. కెప్టెన్ కోహ్లి అద్భుత శతకం, యువ శ్రేయస్ అయ్యర్ సమయోచిత అర్ధసెంచరీతో టీమిండియా గౌరవప్రదమైన స్కోరు చేయగలిగింది. సిరీస్ ఫలితాన్ని తేల్చే మ్యాచ్‌లో ఓపెనర్లు రాణిస్తే భారత్ ఆదిలోనే పైచేయి సాధిస్తుంది. పలుసార్లు విఫలమైనా నాలుగో నంబరులో రిషభ్ పంత్‌నే దించే అవకాశం కనిపిస్తోంది. ఆరో స్థానంలో వచ్చే జాదవ్‌కూ ఈ మ్యాచ్ కీలకమే. స్పిన్ ద్వయం జడేజా, కుల్దీప్... పేస్ త్రయం షమీ, భువనేశ్వర్, ఖలీల్ అహ్మద్‌లతో భారత బౌలింగ్ పటిష్టంగా ఉంది. వీరిని ఎదుర్కొంటూ పరుగులు సాధించడం ప్రత్యర్థికి బ్యాట్స్‌మెన్‌కు సవాలేనని రెండో వన్డేలో స్పష్టమైంది. ఓ దశలో చేజారేలా కనిపించిన మ్యాచ్‌ను బౌలర్లు మనవైపు తిప్పారు. మూడో వన్డేలోనూ ఇదే జోరు చూపితే ప్రపంచ కప్ నిష్క్రమణను మరిపిస్తూ టెస్టు చాంపియన్ షిప్‌నకు ఆత్మవిశ్వాసంతో వెళ్లొచ్చు.


గేల్

విండీస్‌కు బ్యాటింగ్ బెంగ...

బౌలింగ్‌లో ఫర్వాలేకున్నా బ్యాటింగ్ వెస్టిండీస్‌ను కలవరపరుస్తోంది. విధ్వంసక క్రిస్ గేల్ తన ఆఖరి మ్యాచ్‌లో ఎలా ఆడతాడో చూడాలి. హోప్, హెట్‌మైర్, పూరన్, చేజ్‌లతో భారీ లైనప్ ఉన్నా ఎవరి నుంచి విన్నింగ్ ఇన్నింగ్స్ రావడం లేదు. ఆరు వికెట్లు చేతిలో ఉన్నా రెండో వన్డేలో 71 బంతుల్లో 91 పరుగుల చేయలేకపోవడమే దీనికి నిదర్శనం. ఓపెనర్లలో లూయిస్ స్థానంలో క్యాంప్‌బెల్‌ను తీసుకోవచ్చని భావిస్తున్నా అందుకు పెద్దగా అవకాశాల్లేవు. లోయరార్డర్‌లో కెప్టెన్ హోల్డర్, బ్రాత్‌వైట్ బ్యాట్ ఝుళిపిస్తేనే ఆతిథ్య జట్టు గెలుపుపై ఆశలు పెట్టుకోవచ్చు. పార్ట్‌టైమర్ చేజ్‌తో కొంత ప్రయత్నిస్తున్నా స్పెషలిస్ట్ స్పిన్నర్‌ను తుది జట్టులోకి తీసుకోకపోవడం విండీస్‌కు లోటు. రోచ్, కాట్రెల్, థామస్‌ల పేస్ త్రయం అనూహ్యంగా చెలరేగితే టీమిండియాకు కష్టం పడుతుంది.

తుది జట్లు (అంచనా)

భారత్: ధావన్, రోహిత్, కోహ్లి (కెప్టెన్), అయ్యర్, పంత్, జాదవ్, జడేజా, భువనేశ్వర్, కుల్దీప్, షమీ, ఖలీల్. **వెస్టిండీస్:** గేల్, లూయిస్/క్యాంప్‌బెల్, హోప్, హెట్‌మైర్, పూరన్, చేజ్, హోల్డర్, బ్రాత్‌వైట్, రోచ్, కాట్రెల్, థామస్.

పిచ్, వాతావరణం

బ్యాటింగ్‌కు అంతంతమాత్రమే సహకరించిన, రెండో వన్డే ఆడిన పిచ్‌పైనే ఈ మ్యాచ్ జరగనుంది. వాతావరణ పరిస్థితులు చూస్తే అంతరాయాలు తప్పకపోవచ్చని సమాచారం. జల్లుల వాన కురిసే వీలుంది. ఈ ప్రకారం చూస్తే టాస్ గెలిచిన కెప్టెన్ బౌలింగ్ ఎంచుకోవచ్చు.

విజేత హర్ష

ఇరీనా వారకోమ్‌స్కా స్మారక చెస్ టోర్నీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ గ్రాండ్ మాస్టర్ హర్ష భరతకోటి పోలాండ్‌లో జరిగిన ఇరీనా వారకోమ్‌స్కా స్మారక ఓపెన్ అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచాడు. తొమ్మిది రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో 19 ఏళ్ల హర్ష ఏడు పాయింట్లు సాధించి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. 17 మంది గ్రాండ్‌మాస్టర్లతోపాటు మొత్తం 97 మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ టోర్నీలో హర్ష ఐదు గేముల్లో గెలిచి, నాలుగు గేమ్‌లను 'డ్రా' చేసుకుని అజేయంగా నిలిచాడు. పావెల్ మాజ్, క్లాడియా, లిక్‌నెర్‌స్కీ, గోలుచ్, తొమాజ్ (పోలాండ్)లపై గెలుపొందిన హర్ష... నాదియా షపాంకో (ఉక్రెయిన్), వియాచెస్లావ్ (రష్యా), జాసెక్ టామ్‌జాక్ (పోలాండ్), వ్లాదిమిర్ జకోరోత్సోవా (రష్యా)లతో జరిగిన గేమ్‌లను 'డ్రా'గా ముగించాడు.

భారత యువ చెస్ ఆటగాళ్లకు క్రామ్నిక్ శిక్షణ

చెన్నై: ప్రపంచ మాజీ చాంపియన్, రష్యాకు చెందిన విఖ్యాత చెస్ ప్లేయర్ వ్లాదిమిర్ క్రామ్నిక్ భారత్‌కు చెందిన ఆరుగురు యువ ఆటగాళ్లకు శిక్షణ ఇవ్వనున్నాడు. స్విట్జర్లాండ్‌లో నేడు మొదలయ్యే ఈ శిబిరాన్ని మైక్రోసెన్స్ టెక్నాలజీ కంపెనీ ఏర్పాటు చేసింది. ఈ శిబిరంలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఎరిగైసి అర్జున్‌తోపాటు ప్రజ్ఞానంద, డి.గుకేశ్, ఇనియన్ (తమిళనాడు), రౌనక్ (మహారాష్ట్ర), లియోన్ (గోవా) ఉన్నారు.

టెస్టులకు డు ప్లెసిస్, టి20లకు డికాక్ సారథ్యం

- భారత పర్యటనకు దక్షిణాఫ్రికా జట్ల ప్రకటన
- పొట్టి ఫార్మాట్‌లో డు ప్లెసిస్, స్టెయిన్‌లకు దక్కని స్థానం

జొహన్నెస్‌బర్గ్: వచ్చే నెలలో మూడు టి20లు, మూడు టెస్టుల సిరీస్ కోసం భారత్‌లో పర్యటించనున్న దక్షిణాఫ్రికా జట్లను ప్రకటించారు. టెస్టు కెప్టెన్ పదవిని నిలబెట్టుకున్నా... వన్డే ప్రపంచ కప్ దారుణ వైఫల్యంతో ఫాఫ్ డు ప్లెసిస్ పొట్టి ఫార్మాట్ కెప్టెన్సీని, జట్టులో చోటును కోల్పోయాడు. వికెట్ కీపర్ డికాక్‌ను టి20లకు సారథిగా ఎంపిక చేశారు. గత వారం టెస్టులకు వీడ్కోలు పలికి, పరిమిత ఓవర్ల క్రికెట్‌కు అందుబాటులో ఉంటానని ప్రకటించిన పేసర్ స్టెయిన్‌కు ఆ దేశ సెలక్టర్లు షాకిచ్చారు. అతడిని టి20లకు పరిగణనలోకి తీసుకోలేదు. రెండు జట్లలో ముగ్గురేసి కొత్త ఆటగాళ్లకు స్థానం దక్కింది. భారత సంతతి స్పిన్ ఆల్‌రౌండర్ సెనురన్ ముత్తుస్వామికి టెస్టు జట్టులోకి పిలుపొచ్చింది.

దక్షిణాఫ్రికా టెస్టు జట్టు: డు ప్లెసిస్ (కెప్టెన్), బవుమా (వైస్ కెప్టెన్), డిబ్రుయెన్, డికాక్, ఎల్గర్, హమ్జా, కేశవ్ మహరాజ్, మార్క్‌రమ్, సెనురన్ ముత్తుస్వామి, ఇన్‌గిడి, నోర్జె, ఫిలాండర్, డేన్ పీట్, రబడ, రూడీ సెకండ్. **దక్షిణాఫ్రికా టి20 జట్టు:** డికాక్ (కెప్టెన్), డసెన్ (వైస్ కెప్టెన్), బవుమా, డాలా, జార్న్ ఫార్చ్యూన్, బ్యూరన్ హెన్‌డ్రిక్స్, రీజా హెన్‌డ్రిక్స్, మిల్లర్, నోర్జె, ఫెలూక్వాయో, ప్రిటోరియస్, రబడ, షమ్సీ, స్మట్స్.

మళ్లీ మైదానంలోకి కివీస్

- వన్డే ప్రపంచ కప్ తర్వాత తొలిసారి
- నేటి నుంచి శ్రీలంకతో టెస్టు

శ్రీలంక సారథి కరుణరత్నేతో విలియమ్సన్

గాలే: త్రుటిలో వన్డే ప్రపంచ కప్‌ను చేజార్చుకున్న న్యూజిలాండ్... సరిగ్గా నెల రోజుల అనంతరం అంతర్జాతీయ క్రికెట్ ప్రయాణం మొదలుపెడుతోంది. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శ్రీలంకతో బుధవారం నుంచి ఇక్కడ తొలి టెస్టు ఆడనుంది. దీంతోపాటే ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ పోరాటం ప్రారంభించనుంది. బలహీనంగా ఉన్నా స్వదేశంలో తీసిపారేయలేని లంకను కివీస్ ఎలా ఎదుర్కొంటుందనేది ఆసక్తికరం. స్ఫూర్తిదాయక కెప్టెన్ విలియమ్సన్, మిడిలార్డర్‌లో నమ్మదగ్గ రాస్ టేలర్, పేసర్లు బౌల్ట్, సౌతీలతో న్యూజిలాండ్ పటిష్టంగా కనిపిస్తోంది. ఐదు నెలల కిత్రం దక్షిణాఫ్రికాను దాని సొంతగడ్డపైనే ఓడించి ఆశ్చర్యపర్చిన లంక... తాజాగా సీనియర్లు చండిమాల్, మాథ్యూస్ పునరాగమనంతో బలం పుంజుకొంది. స్పిన్‌కు అనుకూలించే లంక పిచ్‌లను సద్వినియోగం చేసుకునేందుకు ఎడమ చేతివాటం ఎజాజ్ పటేల్‌ను బరిలో దింపాలని కివీస్ ఆలోచిస్తోంది. ఎజాజ్ ముంబైలో జన్మించి న్యూజిలాండ్‌లో స్థిరపడ్డాడు. వెటరన్ రంగన హెరాత్ రిటైర్మెంట్‌తో లంక స్పిన్ బాధ్యతలను అఖిల ధనంజయ మోయనున్నాడు.

షూటింగ్‌పై వేటు మహిళల టి20 క్రికెట్‌కు చోటు

BIRMINGHAM 2022

- 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్ సమాఖ్య నిర్ణయం
- 1998 తర్వాత క్రికెట్‌కు స్థానం
- 1974 అనంతరం షూటింగ్‌కు మొండిచేయి

లండన్: గత ఐదు పర్యాయాల్లో చోటు లేని మహిళల టి20 క్రికెట్‌ను 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్‌లో చేర్చారు. ఈ మేరకు మంగళవారం కామన్వెల్త్ గేమ్స్ సమాఖ్య (సీజీఎఫ్), అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ప్రకటించాయి. వందేళ్లకంటే ఎక్కువ చరిత్ర ఉన్న కామన్వెల్త్ గేమ్స్‌లో 1998లో ఒక్కసారి మాత్రమే క్రికెట్‌ను ఆడించారు. పురుషుల విభాగంలో జరిగిన ఆ ఈవెంట్‌లో దక్షిణాఫ్రికా జట్టు విజేతగా నిలిచి స్వర్ణ పతకాన్ని సాధించింది. 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్ జూలై 27 నుంచి ఆగస్టు 7 వరకు జరుగుతాయి. 'ఈ రోజు చరిత్రాత్మక రోజు. కామన్వెల్త్ గేమ్స్‌లో మళ్లీ క్రికెట్‌కు స్థానమిస్తున్నందుకు సంతోషంగా ఉంది' అని సీజీఎఫ్ అధ్యక్షుడు డేమ్ లూయిస్ మార్టిన్ తెలిపారు. మొత్తం ఎనిమిది జట్లు పాల్గొనే ఈ ఈవెంట్‌లో అన్ని మ్యాచ్‌లను బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో నిర్వహిస్తారు. మహిళల టి20 క్రికెట్‌లో ప్రస్తుతం ఆస్ట్రేలియా ప్రపంచ చాంపియన్ కాగా... ఇంగ్లండ్ రన్నరప్‌గా ఉంది.

షూటింగ్ తప్పనిసరి క్రీడాంశం కాదు....

తమ పతకావకాశాలు ఎక్కువగా ఉన్న షూటింగ్‌ను చేర్చకపోతే బర్మింగ్‌హామ్ గేమ్స్‌ను బహిష్కరించేందుకు వెనుకాడబోమని భారత్ హెచ్చరించినా... నిర్వాహకులు నిర్ణయాన్ని మార్చుకోలేదు. షూటింగ్ క్రీడాంశాన్ని చేర్చే ప్రసక్తి లేదని సీజీఎఫ్ అధ్యక్షుడు లూయిస్ మార్టిన్ స్పష్టం చేశారు. కామన్వెల్త్ గేమ్స్ చరిత్రలో షూటింగ్ క్రీడాంశం తప్పనిసరి ఈవెంట్ కాదని వివరణ ఇచ్చారు. దాంతో 1974 తర్వాత షూటింగ్ లేకుండా తొలిసారి గేమ్స్ జరగనున్నాయి.

ఇటు స్మిత్... అటు ఇంగ్లండ్

- లార్డ్స్‌లో నేటి నుంచి యాషెస్ రెండో టెస్టు
- అరంగేట్రం చేయనున్న పేసర్ ఆర్చర్
- ఊపుమీదున్న ఆస్ట్రేలియా

మధ్యాహ్నం గం. 3.30 నుంచి సోనీ సిక్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



లండన్: ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్‌లో సొంతగడ్డపై తొలి టెస్టులో భారీ తేడాతో ఓటమి పాలైన ఇంగ్లండ్‌కు మరో పరీక్ష. ప్రఖ్యాత లార్డ్స్ మైదానంలో బుధవారం నుంచి ఆ జట్టు ఆస్ట్రేలియాతో రెండో టెస్టులో తలపడనుంది. వన్డే ప్రపంచ కప్ గెలిచిన ఊపులో యాషెస్ బరిలో దిగిన ఆతిథ్య జట్టుకు మొదటి టెస్టులో తలబొప్పి కట్టింది. తమతో పోలిస్తే బలహీనంగా ఉన్న ఆసీస్‌ను తొలి ఇన్నింగ్స్‌లో కుప్పకూల్చేలా కనిపించిన ఇంగ్లండ్ తర్వాత స్టీవ్ స్మిత్‌ను అడ్డుకోలేక చేతులెత్తేసి ఏకంగా 251 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. ఈ నేపథ్యంలో ఇంగ్లండ్‌కు అసలు ముప్పు స్మిత్‌తోనే. ప్రధాన పేసర్ జేమ్స్ అండర్సన్ గాయంతో దూరమైనందున యువ పేసర్ జోఫ్రా ఆర్చర్ టెస్టు అరంగేట్రం ఖాయమైంది. దీనికిముందే ఆల్‌రౌండర్ మొయిన్ అలీపై వేటు వేసిన ఇంగ్లండ్... 12 మంది సభ్యుల జట్టులో స్పిన్నర్ జాక్ లీచ్‌కు చోటిచ్చింది. బ్యాటింగ్‌లో కెప్టెన్ జో రూట్ పైనే భారం వేసింది. ఓపెనర్లు జాసన్ రాయ్, రోరీ బర్న్స్‌లతో పాటు బట్లర్, బెయిర్‌స్టో రాణిస్తేనే ప్రత్యర్థికి సవాల్ విసరగలుతుంది. పునరాగమనంలో స్మిత్ రెండు శతకాలతో చెలరేగడంతో ఆస్ట్రేలియా రెట్టించిన ఉత్సాహంతో ఉంది. ఓపెనర్ డేవిడ్ వార్నర్ కూడా లయ అందుకుంటే కంగారూలకు తిరుగుండదు. ఉస్మాన్ ఖాజా, ట్రావిస్ హెడ్, మాథ్యూ వేడ్‌లతో బ్యాటింగ్ ఆర్డర్ పటిష్టంగా ఉంది. కమిన్స్ అద్భుత ఫామ్‌ను కొనసాగిస్తుండగా, స్పిన్నర్ లయన్ తన బాధ్యతలు నెరవేరుస్తున్నాడు. పేసర్ ప్యాటిన్సన్‌కు విశ్రాంతినిచ్చిన ఆస్ట్రేలియా... మిషెల్ స్టార్క్, హాజల్‌వుడ్‌లతో 12 మంది సభ్యుల జట్టును ప్రకటించింది. ఈ టెస్టులోనూ ఓడితే సిరీస్‌లో ఇంగ్లండ్ పుంజుకోవడం కష్టమే. యాషెస్ చరిత్రలో తొలి టెస్టు ఓడినా ఆ జట్టు సిరీస్ నెగ్గిన సందర్భాలు (1981, 2005) రెండే ఉండటం గమనార్హం.

GOVERNMENT OF INDIA, INCOMETAX DEPARTMENT
OFFICE OF THE PRINCIPAL CHIEF COMMISSIONER OF INCOMETAX
ANDHRA PRADESH & TELANGANA, I.T.TOWERS, MASAB TANK, HYD-004.
NOTICE
It is brought to the notice of all the pensioners retired from Income tax Department of Andhra Pradesh & Telangana that a
"PENSION ADALAT" will be conducted on 23/08/2019 at 11.00 A.M. in IT Towers, Hyderabad.
The objective of the ADALAT is prompt and quick redressal of pensioners grievances not involving
(a) Cases involving purely legal points e.g. succesion, etc. and
(b) Grievances involving policy matters.
Sd/-
N.Ravi Babu
Addl.CIT (Hqrs)(Admn & Vig), O/o Pr.Cheif Commissioner of Income Tax, AP & TS, I.T Towers, Masab Tank, Hyderabad.

TELANGANA STATE COUNCIL OF HIGHER EDUCATION HYDERABAD
DEPARTMENT OF TECHNICAL EDUCATION
TSEAMCET-2019 (Bi.P.C STREAM) ADMISSION FINAL PHASE & SPOT ADMISSION NOTIFICATION
PAYMENT OF PROCESSING FEE, SLOT BOOKING, CERTIFICATE VERIFICATION AND OPTION EXERCISE FOR WEB BASED COUNSELLING.
The Qualified candidates of TSEAMCET-2019 (Bi.P.C Stream) who have participated or not participated in first phase of counselling and desirous of seeking admission into B Pharmacy, Pharm D and Bio-Technology Courses are informed that final phase web counselling will commence on 17-08-2019. Further details of final phase counselling schedule and spot admission guidelines can be seen in the website: https://tseamcetb.nic.in
Date: 13-08-2019 Sd/-Navin Mittal, IAS
Place: Hyderabad Convenor, TSEAMCET- 20l9(Bi.P.C) & CTE
DIPR Ro.No.889-DP/CL/Advt/1/2019-20- Dt: 13/08/2019

SOUTHERN RAILWAY
INDICATIVE ADVERTISEMENT
ENGAGEMENT OF EX-SERVICEMEN IN LEVEL 1 POSTS ON FULL TIME CONTRACT BASIS
Notification has been released by Southern Railway inviting ONLINE APPLICATIONS for engaging Ex-Servicemen in Level 1 posts such as Trackman, Helper (Track Machine), Helper (Tele), Helper (Signal), Pointsman B (SCP), Helper (C&W), Helper/Diesel Mechanical, Helper/Diesel Electrical, Helper/TRD on full time Contract Basis, to fill up 2393 vacancies.
Ex-Serviceman who has retired after putting in 15 years of service and has passed Army Class-I certificate or equivalent will be considered eligible for engaging on contract basis. Maximum age limit is 50 years as on 13.08.2019.
Notification detailing the eligibility, age criteria, conditions of engagement on Contract basis, approximate monthly remuneration etc., are available in RRC/Chennai's website www.rrcmas.in
Eligible Ex-Servicemen are advised to log on to website www.rrcmas.in to have the Notification and apply online.
Last date to apply online is 12.09.2019, 17.00 hrs.
Principal Chief Personnel Officer

సాక్షి బిజినెస్
బుధవారం
14-8-2019
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
624 ▼	184 ▼
36,958	10,926

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

నాస్‌డాక్	8,010	▲ 147
డోజోన్స్	26,289	▲ 392
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,251	▲ 24
డాక్స్	11,750	▲ 70
షాంఘై	2,797	▲ 18
నికాయ్	20,455	▼ 229

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	70.33	71.97
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	84.33	87.37
€	యూరో	ఎస్‌బీఐ	78.14	81.07
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	66.19	68.74
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	47.05	49.23
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	50.38	52.13
SAR	సౌదీ రియాల్	ధామన్‌కుక్	18.26	20.03
AED	యూఏఈ దిర్హామ్	ధామన్‌కుక్	18.70	20.26
¥	చైనా యువాన్	ధామన్‌కుక్	9.48	10.84

రిలయన్స్ గర్జన.. మార్కెట్ బేర్!

ప్రతికూలంగా దేశీ, అంతర్జాతీయ సంకేతాలు

- అర్జెంటీనా కరెన్సీ పెసో 15 శాతం, స్టాక్ మార్కెట్ 48 శాతం డౌన్
- ముదురుతున్న వాణిజ్య ఉద్రిక్తతలు • హాంకాంగ్‌లో నిరసనల సెగ
- ఆరు నెలల కనిష్టానికి రూపాయి • ప్యాకేజీపై పెదవి విప్పని ప్రభుత్వం
- ఎఫ్‌పీఐల పన్నుపై మౌనం • 37,000 పాయింట్ల దిగువకు సెన్సెక్స్
- 624 పాయింట్లు పతనమై 36,958 వద్ద ముగింపు
- 184 పాయింట్లు నష్టపోయి 10,926కు నిఫ్టీ • రిలయన్స్ 10 శాతం జంప్

బలహీన అంతర్జాతీయ సంకేతాలకు దేశీయ ప్రతికూలతలు కూడా తోడవడంతో మన స్టాక్ మార్కెట్ మంగళవారం భారీగా పతనమైంది. అమెరికా-చైనాల మధ్య దీర్ఘకాలంగా కొనసాగుతున్న వాణిజ్య యుద్ధం, తాజాగా హాంకాంగ్‌లో చెలరేగుతున్న నిరసనలు, హింసాకాండ, అర్జెంటీనా కరెన్సీ పెసో భారీగా పతనం కావడం ప్రతికూల ప్రభావం చూపించాయి. మన దగ్గర వివిధ రంగాల్లో డిమాండ్ క్షీణిస్తున్న నేపథ్యంలో ఆర్థిక వ్యవస్థ మందగించడం, ఆర్థిక గణాంకాలు, క్యూ1 ఫలితాలు అంతంతమాత్రంగానే ఉండడంతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ దారుణంగా దెబ్బతిన్నది. బక్రీద్ కారణంగా సోమవారం సెలవు కావడంతో ఒక రోజు విరామం తర్వాత మంగళవారం ఆరంభమైన స్టాక్ మార్కెట్ భారీగా నష్టపోయింది. బీఎస్ఈ సెన్సెక్స్ 37,000 పాయింట్లు, ఎన్ఎస్ఈ నిఫ్టీ 10,950 పాయింట్ల దిగువకు పడిపోయాయి. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లకు సంబంధించి సూపర్ రిచ్ పన్నుపై సర్‌చార్జీ, ఆర్థిక వ్యవస్థను మందగమనం బారి నుంచి గట్టెక్కించడానికి కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు ప్రకటించకపోవడంతో అమ్మకాలు వెల్లువెత్తాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 624 పాయింట్లు పతనమై(1.66%) 36,958 పాయింట్ల వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 184 పాయింట్లు క్షీణించి(1.65%) 10,926 పాయింట్ల వద్ద ముగిశాయి. బీఎస్ఈ ఇంధన, ఆయిల్, గ్యాస్ సూచీలు మాత్రమే లాభాల్లో ముగియగా, మిగిలిన అన్ని రంగాల సూచీలు నష్టపోయాయి.

లాభాల్లోంచి నష్టాల్లోకి

సెన్సెక్స్ లాభాల్లోనే ఆరంభమైంది. కొద్ది సేపటికే నష్టాల్లోకి జారిపోయింది. అన్ని రంగాల షేర్లలో అమ్మకాలు చోటు చేసుకున్నాయి. ఒక దశలో 173 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్ మరో దశలో 693 పాయింట్లు నష్టపోయింది. మొత్తం మీద రోజంతా 870 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది. ఇంట్రాడే గరిష్ట స్థాయి నుంచి చూస్తే, సెన్సెక్స్ 870 పాయింట్లు, నిఫ్టీ 244 పాయింట్లు పడింది.

- ఈ ఏడాది జూలైలో వాహన విక్రయాలు 19 ఏళ్ల కనిష్ట స్థాయికి పడిపోయాయని సియామ్ వెల్లడించడంతో వాహన షేర్లు గతి తప్పాయి.
- యస్ బ్యాంక్ షేర్ 10.3 శాతం నష్టంతో రూ. 73.60 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో బాగా నష్టపోయిన షేర్ ఇదే. నేడు(బుధవారం) క్యూఐపీ ఇష్యూ ధరను ఖరారు చేయనుండటంతో ఈ షేర్ ఈ స్థాయిలో పతనమైంది.

రిలయన్స్ లాభపడకపోతే 1,000 పాయింట్ల నష్టం

అన్ని రంగాల షేర్లు, సెన్సెక్స్‌లోని 29 షేర్లు నష్టపోగా, రెండు షేర్లు మాత్రమే లాభపడ్డాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ 10 శాతం లాభపడి రూ. 1,275 వద్ద ముగిసింది. గత పదేళ్లలో ఈ షేర్ ఒక్క రోజులో ఇంతగా లాభపడటం ఇదే మొదటిసారి. సెన్సెక్స్‌లో బాగా లాభపడిన షేర్ ఇదే. సౌదీ ఆరామ్‌కో, బీపీలతో వాటా విక్రయ ఒప్పందాలతో రిలయన్స్‌కు రూ.1.15 లక్షల కోట్లు లభిస్తాయి. మరో వైపు ఏడాదిన్నరలో రుణ రహిత కంపెనీగా నిలవడం లక్ష్యమని 42వ ఏజీఎమ్‌లో కంపెనీ చైర్మన్ ముకేశ్ అంబానీ వెల్లడించడం రిలయన్స్ షేరును లాభాల బాట పట్టించాయి. షేరు జోరుతో కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.71,638 కోట్లు పెరిగి, రూ.8,08,234 కోట్లకు చేరింది. ఈ షేర్ ఈ స్థాయిలో పెరగకపోతే సెన్సెక్స్ దాదాపు వెయ్యి పాయింట్ల మేర నష్టపోయి ఉండేది.

నష్టాలు ఎందుకంటే...

• అర్జెంటీనా అల్లకల్లోలం...

అర్జెంటీనా ఎన్నికల్లో సంస్కరణలకు, మార్కెట్‌కు అనుకూల నిర్ణయాలు తీసుకునే అధ్యక్షుడు మారిసియో మాక్రి దారుణంగా ఓడిపోవడం ప్రపంచ మార్కెట్లపై తీవ్రమైన ప్రభావం చూపించింది. ఎన్నికల ఫలితాల కారణంగా అర్జెంటీనా కరెన్సీ పెసో 15 శాతం పతనం కాగా, ఆ దేశ స్టాక్ మార్కెట్, ఎస్ అండ్ పీ మెర్వల్ సూచీ 48 శాతం(డాలర్ల పరంగా) నష్టపోయింది. (గత 69 ఏళ్లలో ఒక్కరోజులో ఒక స్టాక్ మార్కెట్ ఈ రేంజ్‌లో పతనం కావడం ఇదే మొదటిసారి)

• ప్రపంచ మార్కెట్ల పతనం....

అమెరికా-చైనాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు మరింత వేడెక్కడం, హాంగ్ కాంగ్‌లో నిరసన ప్రదర్శనలు హింసాత్మకంగా మారడం, అర్జెంటీనా, ఇటలీల్లో రాజకీయ అనిశ్చితి, సింగపూర్ తన పూర్తి ఏడాది వృద్ధి గణాంకాల్లో కోత విధించడం వంటి కారణాలతో ఇన్వెస్టర్లు సురక్షిత మదుపు సాధనాలైన పుత్తడి, జపాన్ కరెన్సీ యెన్, బాండ్లవైపు పెట్టుబడులను మళ్లిస్తున్నారు. దీంతో ఆసియా మార్కెట్లు భారీగా నష్టపోయాయి. హాంగ్‌సెంగ్ 2.1 శాతం, షాంఘై కాంపొజిట్ సూచీ 0.63 శాతం, కోస్పి 0.85 శాతం, నికాయ్ 1.1 శాతం చొప్పున పతనమయ్యాయి. ఇక యూరప్ మార్కెట్లు నష్టాల్లో ఆరంభమయ్యాయి. ఆ తర్వాత కోలుకొని స్వల్ప లాభాల్లో ముగిశాయి.

• ఆర్థిక గణాంకాల నిరుత్సాహం:

జూన్ నెలలో పారిశ్రామికోత్పత్తి(ఐఐపీ) నాలుగు నెలల కనిష్టానికి, 2 శాతానికి పడిపోయింది. శుక్రవారం వెలువడిన ఈ గణాంకాలు ఇన్వెస్టర్లలో నిరుత్సాహాన్ని నింపాయి. గత ఏడాది ఇదే నెలలో పారిశ్రామికోత్పత్తి 7 శాతంగా నమోదైంది.

• పెదవి విప్పని ప్రభుత్వం:

విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లకు వర్తించే సూపర్ రిచ్ ట్యాక్స్ సెస్‌పై ప్రభుత్వం ఇప్పటి వరకూ ఎలాంటి ప్రకటనా చేయలేదు. మరోవైపు వాహన, ఎన్‌బీఎఫ్‌సీ, ఆర్థిక రంగాలను ఆదుకోవడానికి ప్యాకేజీ సంబంధిత అంశాలపై ప్రభుత్వ వర్గాలు ఇప్పటివరకూ పెదవి విప్పలేదు.

• ఆరు నెలల కనిష్టానికి రూపాయి:

డాలర్‌తో రూపాయి మారకం విలువ 62 పైసలు పతనమై 71.40 వద్దకు చేరింది. ఇది ఆరు నెలల కనిష్ట స్థాయి.

• ముడిచమురు ధరలు భగ్గు:

ముడి చమురు ధరలు మంగళవారం నైమెక్స్‌లో 4 శాతం పైగా ఎగబాకాయి.

రూ. 2.21 లక్షల కోట్లు ఆవిరి

స్టాక్ మార్కెట్ భారీ నష్టాల కారణంగా ఇన్వెస్టర్ల సంపద రూ.2.21 లక్షల కోట్లు హరించుకుపోయింది. ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈలో లిస్టైన మొత్తం కంపెనీల మార్కెట్ క్యాప్ రూ.2,21,838 కోట్లు ఆవిరై రూ. 1,39,46,997 కోట్లకు పడిపోయింది.

సన్ ఫార్మా లాభం రూ.1,387 కోట్లు

మొత్తం ఆదాయం రూ.8,374 కోట్లు

న్యూఢిల్లీ: ఫార్మా దిగ్గజం, సన్ ఫార్మాస్యూటికల్స్ ఇండస్ట్రీస్ ఈ ఆర్థిక సంవత్సరం జూన్ క్వార్టర్‌లో రూ.1,387 కోట్ల నికర లాభం సాధించింది. గత క్యూ1లో రూ.1,057 కోట్ల నికర లాభం ఆర్జించామని సన్ ఫార్మా తెలిపింది. మొత్తం ఆదాయం గత క్యూ1లో రూ.7,224 కోట్లు, ఈ క్యూ1లో రూ.8,374 కోట్లుగా నమోదయ్యాయని సన్ ఫార్మా ఎమ్‌డీ దిలీప్ సంఘ్వి తెలిపారు. జపాన్‌కు చెందిన పోలా ఫార్మా కంపెనీ ఈ ఏడాది జనవరి 1 నుంచి తమ అనుబంధ కంపెనీగా మారిందని, అందుకే గత క్యూ1, ఈ క్యూ1 ఫలితాలను పోల్చడానికి లేదని వివరించారు.

ఆర్ అండ్ డీ పెట్టుబడులు రూ.422 కోట్లు ...

పరిశోధన, అభివృద్ధి పెట్టుబడులు ఈ క్యూ1లో రూ.422 కోట్లని దిలీప్ సంఘ్వి తెలిపారు. ఇది మొత్తం అమ్మకాల్లో 5 శాతమని పేర్కొన్నారు. ఈ పెట్టుబడులు గత క్యూ1లో రూ.500 కోట్లని, మొత్తం అమ్మకాల్లో 7 శాతమని వివరించారు. అన్ని మార్కెట్లలో మంచి వృద్ధి సాధించామని, పూర్తి ఆర్థిక సంవత్సరం అంచనాలకు అనుగుణంగానే తమ పనితీరు ఉందని పేర్కొన్నారు. వచ్చే ఏడాది క్లినికల్ ట్రయల్స్‌లోకి ప్రవేశిస్తున్నామని చెప్పారు. దీనికి సంబంధించిన మోలిక్యూల్స్ పరిశోధనలో ప్రోత్సాహకరమైన ఫలితాలు వస్తున్నాయని వివరించారు.

అగ్రస్థానంలో సన్ ఫార్మా....

ఈ క్యూ1లో భారత బ్రాండెడ్ ఫార్ములేషన్స్ వ్యాపారం 8 శాతం వృద్ధితో రూ.2,314 కోట్లకు పెరిగిందని దిలీప్ సంఘ్వి తెలిపారు. మొత్తం అమ్మకాల్లో వీటి వాటా 28 శాతమని పేర్కొన్నారు. మొత్తం అమ్మకాల్లో 36 శాతం వాటా ఉన్న అమెరికా అమ్మకాలు 12 శాతం వృద్ధితో 42 కోట్ల డాలర్లకు పెరిగిందని వివరించారు. మరో అనుబంధ సంస్థ టారో నికర అమ్మకాలు 4 శాతం వృద్ధితో 16 కోట్ల డాలర్లకు పెరగ్గా, నికర లాభం మాత్రం స్వల్పంగా తగ్గి 6.6 కోట్ల డాలర్లకు చేరిందని పేర్కొన్నారు. వృద్ధి చెందుతున్న మార్కెట్లలో అమ్మకాలు 19 కోట్ల డాలర్లుగా ఉన్నాయని, ఎలాంటి వృద్ధి లేదని వివరించారు. రూ.1,32,000 కోట్ల భారత ఫార్మా మార్కెట్లో 8.2 శాతం వాటాతో సన్ ఫార్మాదే అగ్రస్థానమని ఏఐఓసీడీ అవార్డ్స్ జూన్-2019 నివేదిక వెల్లడించిందని దిలీప్ సంఘ్వి పేర్కొన్నారు.

స్టాక్ మార్కెట్‌భారీగా పతనమైనా, సన్ ఫార్మా మాత్రం లాభపడింది. క్యూ1 ఆర్థిక ఫలితాలు అంచనాలను మించడంతో బీఎస్ఈలో సన్ ఫార్మా షేర్ 3.7 శతం లాభంతో రూ.438 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో లాభపడిన రెండే షేర్లలో ఇది కూడా ఒకటి.

ప్రాఫిట్ ప్లస్ | డైలీ

పీజీఐఎం నుంచి ఓవర్‌నైట్ ఫండ్

ఓవర్‌నైట్ సెక్యూరిటీల్లో ఇన్వెస్ట్ చేసే లక్ష్యంతో పీజీఐఎం ఇండియా మ్యూచువల్ ఫండ్ (లోగడ డీహెచ్ఎఫ్ఎల్ ప్రమెరికా) నుంచి ఓవర్‌నైట్ ఫండ్ అందుబాటులోకి వచ్చింది. ఇది ఓపెన్ ఎండెడ్ మ్యూచువల్ ఫండ్ పథకం. ఈ నెల 12న ఆఫర్ ప్రారంభం కాగా, ఈ నెల 26 వరకు పెట్టుబడులకు అందుబాటులో ఉంటుంది. ఒక్క రోజు వ్యవధిలో గడువు తీరే ఓవర్‌నైట్ సెక్యూరిటీల్లో (డెట్ సెక్యూరిటీలు, మనీ మార్కెట్ ఇన్‌స్ట్రుమెంట్లు) ఈ పథకం ఇన్వెస్ట్ చేస్తుంది. స్వల్ప కాలం కోసం నిధులను పార్క్ చేసుకోవాలనుకునే వారికి ఇది అనుకూలం. రిస్క్ తక్కువగా ఉంటుంది. అధిక లిక్విడిటీ (కోరుకున్నప్పుడు వేగంగా వెనక్కి తీసుకోగలగడం) ఇందులోని మరో సానుకూలత. అయితే, రాబడులకు హామీ ఉండదు. ప్రవేశం, వైదొలిగే సమయంలో ఎటువంటి చార్జీలు ఉండవు. ఒక రోజు నుంచి నెల రోజుల వరకు తమ నిధులపై రాబడులు కోరుకునే వారు ఈ తరహా పథకాల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.

సెకనుకు 1,000 కప్పుల కాఫీ..!

- ప్రపంచవ్యాప్తంగా కాంటినెంటల్ కాఫీ వినియోగం ఇది...
- ఇక భారత మార్కెట్‌పై ఫోకస్
- బ్రాండ్ ప్రచారకర్తగా నిత్యా మీనన్

నూతన ఉత్పత్తులతో మోహన్ కృష్ణ, శ్రీశాంత్, రాజేంద్ర ప్రసాద్, ప్రవీణ్ (ఎడమ నుంచి కుడికి). పక్క చిత్రంలో బ్రాండ్ అంబాసిడర్ నిత్యా మీనన్‌తో చల్లా శ్రీశాంత్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రైవేట్ లేబుల్ ఇన్‌స్టాంట్ కాఫీ తయారీలో ఉన్న ప్రపంచ దిగ్గజం సీసీఎల్ ప్రొడక్ట్స్ భారత్‌పై ఫోకస్ చేసింది. దేశీయ మార్కెట్‌కు అనుగుణంగా ఇన్‌స్టాంట్ కాఫీ, ఫిల్టర్ కాఫీ, కాఫీ ప్రీమిక్స్ శ్రేణిలో నూతన ఉత్పాదనలను విడుదల చేసింది. రూ.1తో మొదలుకుని విభిన్న ప్యాక్‌లలో వీటిని ప్రవేశపెట్టింది. దక్షిణాదిన పెద్ద ఎత్తున విస్తరించిన తర్వాత 2021 నాటికి దేశవ్యాప్తంగా అడుగుపెడతామని సీసీఎల్ ప్రొడక్ట్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ చల్లా రాజేంద్ర ప్రసాద్ మంగళవారమిక్కడ మీడియాకు తెలిపారు. 'భారత్‌లో కాఫీ వినియోగంలో దక్షిణాది రాష్ట్రాల వాటా 75%. కంపెనీ సొంత బ్రాండ్.. కాంటినెంటల్ కాఫీ ప్రస్తుతం కొన్ని ప్రాంతాలకే పరిమితమైంది. సంస్థ ఆదాయంలో భారత్ వాటా 7 శాతమే. రెండేళ్లలో దీనిని రెండింతలకు తీసుకువెళతాం' అని వివరించారు. సినీ నటి నిత్యా మీనన్‌ను కాంటినెంటల్ కాఫీ బ్రాండ్ ప్రచారకర్తగా నియమించారు.

కాఫీ రుచులు 1,000కి పైమాటే..

సీసీఎల్ ప్రస్తుతం 90 దేశాల్లోని కంపెనీలకు 250కిపైగా బ్రాండ్లలో ప్రాసెస్డ్ కాఫీని సరఫరా చేస్తోంది. రెండు మూడేళ్లలో మరో 10 దేశాల్లో అడుగు పెట్టడం ద్వారా 100 మార్కును దాటాలన్నది లక్ష్యమని కంపెనీ ఎండీ చల్లా శ్రీశాంత్ తెలిపారు. 1,000కిపైగా రుచుల్లో కాఫీని తయారు చేయగల సామర్థ్యం సంస్థకు ఉందన్నారు. సీసీఎల్ తయారు చేసిన కాఫీతో ప్రపంచవ్యాప్తంగా ప్రతి సెకనుకు 1,000 కప్పుల కాఫీ వినియోగం అవుతోందని చెప్పారు. దశాబ్దాలపాటు సంస్థకు ఉన్న అనుభవం, ప్రపంచ కాఫీ రంగంలో సాధించిన విజయంతో ఇక భారత వినియోగదార్లకు చేరువ అవుతామని సంస్థ డైరెక్టర్ బి.మోహన్ కృష్ణ తెలిపారు. పోటీ కంపెనీల కంటే దీటుగా ఉత్పత్తులను తయారు చేశామన్నారు. ప్రచారంలో భాగంగా ప్రతి నెల ఒక లక్ష కప్పుల కాఫీని కస్టమర్లకు ఉచితంగా అందించనున్నట్టు చెప్పారు. ఇప్పటికే 50,000 ఔట్‌లెట్లకు చేరువయ్యామని, డిసెంబరు కల్లా ఒక లక్ష స్టోర్లలో కాంటినెంటల్ కాఫీ లభ్యమవుతుందని ఆయన వివరించారు.

రూ.140 కోట్ల పెట్టుబడి..: కంపెనీ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 35,000 టన్నులు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా దుగ్గిరాలతోపాటు స్విట్జర్లాండ్, వియత్నాంలో ప్లాంట్లున్నాయి. చిత్తూరు జిల్లాలోని సెజ్‌లో నెలకొల్పిన ప్లాంటులో ఇటీవలే ఉత్పత్తి ప్రారంభమైంది. సెజ్ కోసం రూ.350 కోట్లు వెచ్చించినట్టు సీసీఎల్ సీఈవో ప్రవీణ్ జైపూరియార్ వెల్లడించారు. వియత్నాం ప్లాంటు సామర్థ్యం పెంపు, చిత్తూరు కేంద్రంలో ప్యాకేజింగ్ యూనిట్ ఏర్పాటుకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.140 కోట్లు పెట్టుబడి చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఇక టర్నోవరులో ఏటా 15-20% వృద్ధి ఆశిస్తున్నట్టు సీసీఎల్ సీవోవో కేవీఎల్ఎన్ శర్మ తెలిపారు. సీసీఎల్‌కు భారత్‌లో 1,000, విదేశాల్లో 250 మంది ఉద్యోగులున్నారని చెప్పారు.

కారు.. కుదేలు..!

- జూలైలో విక్రయాలు 19% డౌన్
- 19 ఏళ్లలో ఇదే భారీ క్షీణత
- 15,000 ఉద్యోగాలకు కోత
- సియామ్ గణాంకాల్లో వెల్లడి
- ప్యాకేజీ కోసం పరిశ్రమ విజ్ఞప్తి

న్యూఢిల్లీ: వాహనాలకు డిమాండ్ మందగించడం ఆటోమొబైల్ పరిశ్రమపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతోంది. జూలైలో వాహన విక్రయాలు ఏకంగా 18.71 శాతం క్షీణించాయి. గడిచిన 19 ఏళ్లలో ఇంత భారీగా అమ్మకాలు పడిపోవడం ఇదే తొలిసారి. ఈ పరిణామాలతో ఆటోమొబైల్ రంగంలో ఉద్యోగాల్లో కూడా కోత పడుతోంది. గడిచిన రెండు-మూడు నెలల్లో సుమారు 15,000 మంది ఉద్యోగాలు కోల్పోయారు. భారతీయ ఆటోమొబైల్ తయారీ సంస్థల సమాఖ్య (సియామ్) విడుదల చేసిన గణాంకాల ప్రకారం వివిధ రకాల ప్యాసింజర్ వాహనాలు, ద్విచక్ర వాహనాల విక్రయాలు ఈ ఏడాది జూలైలో మొత్తం 18,25,148 యూనిట్లుగా నమోదయ్యాయి. గతేడాది జూలైలో వాహనాల అమ్మకాలు 22,45,223 యూనిట్లు. దేశీయంగా గతంలో 2000 డిసెంబర్‌లో చివరిసారిగా ఆటోమొబైల్ విక్రయాలు ఏకంగా 21.81 శాతం మేర పడిపోయాయి. ఆ తర్వాత ఇంత భారీ స్థాయిలో క్షీణించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

ప్రభుత్వం తక్షణం ప్యాకేజీ ప్రకటించాలి..

'ప్రభుత్వం తక్షణం ఉద్దీపన ప్యాకేజీ ప్రకటించాల్సిన అవసరాన్ని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. అమ్మకాలను పెంచుకునేందుకు పరిశ్రమ ప్రయత్నాలన్నీ చేస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం కూడా తన వంతుగా ఎంతో కొంత తోడ్పాటు అందించాల్సిన అవసరం ఉంది' అని సియామ్ డైరెక్టర్ జనరల్ విష్ణు మాథుర్ తెలిపారు. సుమారు 15,000 మంది ఉద్యోగాలు (తాత్కాలిక, క్యాజువర్ వర్కర్లు) కోల్పోయారని ఆయన చెప్పారు. ఆటోమోటివ్ పరికరాల తయారీ రంగంలో మరో పది లక్షల మంది దాకా ఉపాధి కోల్పోయే పరిస్థితి నెలకొందన్నారు. అమ్మకాలు పడిపోవడంతో సుమారు 300 డీలర్‌షిప్‌లు మూతబడ్డాయని మాథుర్ చెప్పారు. తయారీ జీడీపీలో ఆటోమొబైల్ పరిశ్రమ వాటా దాదాపు సగం ఉంటుందని, ప్రత్యక్షంగా.. పరోక్షంగా 3.7 కోట్ల మంది ఉపాధి పొందుతున్నారని మాథుర్ వివరించారు. ఈ పరిశ్రమ గానీ పతనమైతే జీడీపీ వృద్ధి కూడా మందగిస్తుందన్నారు. ఈ నేపథ్యంలో వాహన కొనుగోలు వ్యయాన్ని తగ్గేలా, అమ్మకాలకు ఊతం లభించేలా కేంద్రం జీఎస్‌టీని తాత్కాలికంగానైనా తగ్గించాలని పరిశ్రమ కోరుతున్నట్లు మాథుర్ చెప్పారు. వాహనాల స్క్రాపేజీ పాలసీ ప్రవేశపెట్టడం, రుణ లభ్యత పెంపు, వాహన రిజిస్ట్రేషన్ ఫీజు పెంపు ప్రతిపాదన వాయిదా తదితర విజ్ఞప్తులను ప్రభుత్వం ముందుంచినట్లు ఆయన వివరించారు.

పాసింజర్ వాహన విక్రయాలు 31% డౌన్..

- గతేడాది జూలైలో పాసింజర్ వాహనాల (పీవీ) అమ్మకాలు 2,90,031 యూనిట్లుగా నమోదు కాగా.. ఈ ఏడాది జూలైలో ఏకంగా 30% పడిపోయి 2,00,790 యూనిట్లకు పరిమితమయ్యాయి. ఇది కూడా 19 ఏళ్లలో భారీ క్షీణత. వరుసగా 9 నెలల పాటు పీవీల అమ్మకాలు తగ్గినట్లయింది. చివరిసారిగా 2000 డిసెంబర్‌లో పీవీ అమ్మకాలు 35.22% పడిపోయాయి.
- ప్యాసింజర్ కార్ల విషయానికొస్తే గత జూలైలో 1,91,979 కార్లు అమ్ముడవగా.. ఈ ఏడాది జూలైలో 36% క్షీణించి 1,22,956 యూనిట్లకు తగ్గాయి. 2000 డిసెంబర్‌లో ఈ క్షీణత 39.86 శాతం.
- ద్విచక్ర వాహనాల విభాగంలో హీరో మోటోకార్ప్ అమ్మకాలు 22.9 శాతం క్షీణించి 5,11,374 యూనిట్లకు తగ్గాయి. అటు పోటీ సంస్థ హోండా మోటార్‌సైకిల్ విక్రయాలు కూడా సుమారు 11% తగ్గి 4,55,036 యూనిట్లకు, టీవీఎస్ మోటార్ అమ్మకాలు 16% క్షీణించి 2,08,489 యూనిట్లకు పరిమితమయ్యాయి.
- పీవీ సెగ్మెంట్‌లో మారుతీ సుజుకీ అమ్మకాలు జూలైలో సుమారు 37% క్షీణించి 96,478 యూనిట్లకు తగ్గాయి. హ్యుందాయ్ ఇండియా (హెచ్ఎంఐఎల్) 10 శాతం క్షీణతతో 39,010 యూనిట్లు, మహీంద్రా అండ్ మహీంద్రా సుమారు 15% క్షీణతతో 16,830 యూనిట్లే విక్రయించగలిగాయి.

మార్కెట్లోకి 'పల్సర్ 125 నియాన్' బైక్

ప్రారంభ ధర రూ.64,000

న్యూఢిల్లీ: ప్రముఖ వాహన తయారీ కంపెనీ బజాజ్ ఆటో తాజాగా 'పల్సర్ 125 నియాన్' బైక్‌ను మార్కెట్లోకి విడుదలచేసింది. ఈ మోడల్‌లో డ్రమ్ బ్రేక్ వెర్షన్ ధర రూ.64,998 (ఎక్స్‌షోరూమ్ - ఢిల్లీ) కాగా, డిస్క్ బ్రేక్ ఆప్షన్ ధర రూ.66,618 ఉన్నట్లు కంపెనీ ప్రకటించింది. రెండు వేరియంట్లలోనూ 125సీసీ ఇంజిన్ అమర్చింది. గేర్‌లో ఉన్నప్పుడు కూడా స్టార్ట్ అయ్యే విధంగా రూపొందించిన ఈ బైక్‌కు 5-స్పీడ్ గ్రేర్ బాక్స్ ఉన్నట్లు తెలిపింది. ఈ సందర్భంగా బజాజ్ ఆటో మోటార్ సైకిల్ విభాగ ప్రెసిడెంట్ సారంగ్ కనడే మాట్లాడుతూ.. 'స్పోర్టీ మోడల్‌ను ఇష్టపడే వారికోసం రూపొందించిన అధునాతన బైక్ ఇది. స్టైల్, పనితీరు పరంగా ఇట్టే ఆకట్టుకునే ఈ బైక్‌ను తక్కువ ధరకే అందిస్తున్నాం' అని అన్నారు.

ఓఎన్‌జీసీ లాభం రూ.5,904 కోట్లు

న్యూఢిల్లీ: తగ్గిన చమురు ధరల ప్రభావం ఓఎన్‌జీసీ లాభాలపై పడింది. అయినప్పటికీ లాభాల క్షీణతను 4 శాతానికి పరిమితం చేసి జూన్ క్వార్టర్‌లో రూ.5,904 కోట్లను ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.6,144 కోట్లుగా ఉండడం గమనార్హం. ఆదాయం 2.4 శాతం తగ్గి రూ.26,555 కోట్లకు పరిమితం అయింది. ప్రతీ బ్యారెల్ చమురును ఉత్పత్తి చేసి విక్రయించడం ద్వారా రూ.66.30 డాలర్లను ఆర్జించింది. అంత క్రితం ఏడాది ఇదే కాలంలో ఇది ప్రతీ బ్యారెల్‌పై 71.49 డాలర్లుగా ఉంది. సహజ వాయువు ధర మాత్రం ప్రతీ మిలియన్ బ్రిటిష్ థర్మల్ యూనిట్‌పై 3.69 డాలర్లకు పెరిగింది. చమురు ఉత్పత్తి 5 శాతం వరకు తగ్గి 4.8 మిలియన్ టన్నులుగా ఉందని, దీర్ఘకాలంగా ఉత్పత్తి జరుగుతున్న క్షేత్రాల్లో ఉత్పత్తి సహజంగానే తగ్గిందని తెలిపింది. సహజ వాయువు ఉత్పత్తి మాత్రం 4 శాతం పెరిగి 6.15 బిలియన్ క్యుబిక్ మీటర్లుగా ఉన్నట్టు వెల్లడించింది. జూన్ త్రైమాసికంలో కొత్తగా నాలుగు క్షేత్రాల్లో నిక్షేపాలను గుర్తించినట్టు తెలిపింది.

మంగళవారం బీఎస్ఈలో ఓఎన్‌జీసీ షేరు 1.72% దిగజారి రూ. 128 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఏడాది కనిష్ట స్థాయి రూ.126ని తాకింది.

అదుపులోనే రిటైల్ ధరల స్పీడ్

- జూలైలో 3.15 శాతం
- ఆర్‌బీఐ నిర్దేశిత స్థాయిలోనే కట్టడి

న్యూఢిల్లీ: వినియోగ ధరల సూచీ ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం జూలైలో 3.15 శాతంగా నమోదయ్యింది. అంటే 2018 జూలైతో పోల్చితే 2019 జూలైలో వినియోగ ధరల సూచీలో పేర్కొన్న వస్తువులు, ఉత్పత్తుల బాస్కెట్ ధర మొత్తం కేవలం 3.15 శాతమే పెరిగిందన్న మాట. ఇది రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నిర్దేశిత స్థాయిలోనే రిటైల్ ద్రవ్యోల్బణం కొనసాగుతుండడం గమనార్హం. 2 శాతానికి ప్లస్ 2 శాతం లేదా మైనస్ 2 శాతంగా ఉండేలా చూడాలని ఆర్‌బీఐకి కేంద్రం సూచిస్తోంది. అంటే 4 శాతం దాటితే ధరల తీవ్రతను మైనస్‌లోకి వెళితే వ్యవస్థలోని మందగమన పరిస్థితులకు ఇది సంకేతంగా ఉంటుంది. తాజా సమీక్షా నెల జూలైలో ఆహార ధరల సూచీ పెరిగినప్పటికీ ఇంధనం, లైట్ ధరలు అదుపులో ఉన్నాయి. 2018 జూలైలో రిటైల్ ద్రవ్యోల్బణం 4.17 శాతం. 2019 జూన్‌లో 3.18 శాతంగా ఉంది. కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు శాఖ మంగళవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం– ప్రధాన సూచీలను పరిశీలిస్తే...

- కేవలం ఆహార విభాగాన్ని చూస్తే, వినియోగ ఆహార ధరల సూచీ (సీఎఫ్‌పీఐ) 2.36 శాతంగా నమోదయ్యింది. జూన్‌లో ఇది 2.25 శాతం. అయితే జూన్‌లో 4.66 శాతంగా ఉన్న కూరగాయల ధరలు జూలైలో 2.82 శాతంగా నమోదయ్యాయి. పప్పులు సంబంధిత ఉత్పత్తుల ధరలు 5.68 శాతం నుంచి 6.82 శాతానికి పెరిగాయి. పండ్ల ధరలు పెరక్కపోగా మైనస్‌లోనే ఉన్నాయి. –0.86 శాతంగా నమోదయ్యాయి. జూన్‌లో ఈ తగ్గుదల (మైనస్) 4.18 శాతం. ప్రొటీన్ ఆధారిత మాంసం, చేపల ధరల పెరుగుదల జూన్ (9.01 శాతం తరహాలోనే కేవలం 9.05 శాతంగా ఉంది. అయితే గుడ్ల ధరలు 1.62 శాతం నుంచి 0.57 శాతానికి తగ్గాయి.
- ఇంధనం, లైట్ కేటగిరీలో ధర జూలై క్షీణించి – 0.36 శాతంగా నమోదయ్యింది. జూన్‌లో ఈ పెరుగుదల రేటు 2.32 శాతంగా ఉంది.
- ఆర్‌బీఐ ద్వైమాసిక ద్రవ్య పరపతి విధానానికి రిటైల్ ద్రవ్యోల్బణమే ప్రమాణంగా ఉండే విషయం తెలిసిందే.

ఆరు నెలల కనిష్టానికి రూపాయి విలువ

న్యూఢిల్లీ: డాలర్ మారకంలో రూపాయి విలువ మంగళవారం 62 పైసలు పతనమైంది. ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్‌లో 71.40 వద్ద ముగిసింది. గడచిన ఆరు నెలల కాలంలో రూపాయి ఈ స్థాయిని చూడలేదు. దేశీయ ఈక్విటీ మార్కెట్ల భారీ పతనం, గ్లోబల్ మార్కెట్ల అనిశ్చితి, అమెరికా–చైనా వాణిజ్య యుద్ధం, అర్జెంటీనా కరెన్సీ భారీ పతనం వంటి అంశాలు దీనికి కారణం. అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితి పరిస్థితుల నేపథ్యంలో బంగారం వంటి సురక్షిత సాధనాలు పెట్టుబడులను ఆకర్షిస్తున్న సంగతి తెలిసిందే. మంగళవారం ప్రారంభంతోనే రూపాయి 71.15 వద్ద ప్రారంభమైంది. 71.02ను తాకింది. చివరకు 71.40 వద్ద ముగిసింది. రూపాయి శుక్రవారం ముగింపు 70.78. బక్రీద్ సందర్భంగా సోమవారం కరెన్సీ మార్కెట్ పనిచేయలేదు. శుక్ర, మంగళవారాల్లో రూపాయి 71పైసలు బలహీనపడింది. అక్టోబర్ 9వ తేదీన రూపాయి చరిత్రాత్మక కనిష్ట స్థాయి 74.39 వద్ద ముగిసింది. అయితే అటు క్రూడ్ ధరల భారీ పతనం, మోదీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్న సంకేతాల వంటి అంశాలతో రూపాయి క్రమంగా కీలక నిరోధం 68.50 వద్దకు చేరింది. రూపాయి మరింత బలోపేతం కావడానికి ఈ నిరోధం కీలకం. అయితే ఇక్కడ నుంచి రూపాయి బలపడలేదు.

రిఫైనింగ్‌పై రూ. 2 లక్షల కోట్ల పెట్టుబడులు

వచ్చే 7 ఏళ్లలో ఐవోసీ ప్రతిపాదనలు

న్యూఢిల్లీ: మార్కెట్లో అగ్రస్థానం నిలబెట్టుకునే క్రమంలో చమురు దిగ్గజం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ) కార్యకలాపాల విస్తరణపై వచ్చే 5–7 సంవత్సరాల్లో భారీగా ఇన్వెస్ట్ చేయనుంది. రిఫైనింగ్, పెట్రోకెమికల్ విభాగాల సామర్థ్యాలను పెంచుకునేందుకు దాదాపు రూ. 2 లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టనుంది. ఐవోసీ వార్షిక నివేదికలో చైర్మన్ సంజీవ్ సింగ్ ఈ విషయాలు తెలిపారు. ఆయిల్ రిఫైనింగ్ వార్షిక సామర్థ్యాన్ని 150 మిలియన్ టన్నులకు రెట్టింపు చేసుకోవడం, ఇంధనం.. ఎల్‌పీజీ రిటైలింగ్ నెట్‌వర్క్‌ను విస్తరించడం, పెట్రోకెమికల్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవడంతో పాటు మరింత క్రూడాయిల్.. గ్యాస్ ఉత్పత్తి చేయడం తదితర కార్యకలాపాలపై ఇన్వెస్ట్ చేయనున్నట్లు ఆయన వివరించారు. 80.7 మిలియన్ టన్నుల వార్షిక రిఫైనింగ్ సామర్థ్యంతో ఐవోసీ ప్రస్తుతం దేశంలోనే అతి పెద్ద రిఫైనర్‌గా ఉంది. పెట్రోకెమికల్ ఉత్పత్తి సామర్థ్యాన్ని ప్రస్తుతమున్న 3.15 మిలియన్ టన్నుల నుంచి 13 మిలియన్ టన్నులకు పెంచుకోవాలని ఐవోసీ యోచిస్తోంది.

సీఎస్ఆర్ విషయంలో కంపెనీలకు వెసులుబాటు

ప్రభుత్వానికి ప్యానెల్ సిఫారసులు

న్యూఢిల్లీ: కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమం విషయంలో కంపెనీలకు వెసులుబాటు కల్పించే కీలక సిఫారసులను ప్రభుత్వానికి ఉన్నత స్థాయి ప్యానెల్ సిఫారసు చేసింది. సీఎస్ఆర్ కింద కంపెనీలు చేసిన నిధుల వ్యయాల మేర, వాటి పన్ను వర్తించే ఆదాయం నుంచి పన్ను మినహాయింపునకు అవకాశం కల్పించాలని.. సీఎస్ఆర్ నిబంధనల అమలులో విఫలం చెందితే దాన్ని కంపెనీల చట్టం కింద సివిల్ నేరంగానే పరిగణించాలని సూచించింది. సీఎస్ఆర్ కింద నిబంధనల మేరకు నిధులను పూర్తి స్థాయిలో ఖర్చు చేయని యెడల... ఆ లోటు మొత్తానికి మూడు రెట్లు జరిమానా విధించాలని పేర్కొంది. అంతేకానీ జైలు శిక్ష వద్దని పేర్కొనడం కంపెనీల డిమాండ్‌ను మన్నించినట్టే అయింది. లాభాల్లో ఉన్న కంపెనీలు గత మూడు ఆర్థిక సంవత్సరాల సగటు లాభంలో 2 శాతాన్ని ఓ ఆర్థిక సంవత్సరంలో సీఎస్ఆర్ కింద ఖర్చు చేయాలని కంపెనీల చట్టం 2013 చెబుతోంది. సీఎస్ఆర్ నిధుల వ్యయాలను, ప్రభుత్వ పథకాలకు నిధుల కొరతను సర్దుబాటు చేసే వనరులుగా చూడరాదని కూడా కార్పొరేట్ శాఖ కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ ఆధ్వర్యంలోని ప్యానెల్ సూచించింది.

ఎన్‌బీఎఫ్‌సీ పరిధిలోకి గృహ రుణ కంపెనీలు

ఇక వీటిపై ఆర్‌బీఐ నియంత్రణలు

న్యూఢిల్లీ: గృహ రుణ కంపెనీలు (హౌసింగ్ ఫైనాన్స్) ఇక బ్యాంకింగ్‌యేతర ఆర్థిక సంస్థల (ఎన్‌బీఎఫ్‌ల) పరిధిలోకి రానున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. తాజా నిర్ణయం వల్ల ఇకపై హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలు ఆర్‌బీఐ ప్రత్యక్ష నియంత్రణలోకి రానున్నాయి. నేషనల్ హౌసింగ్ బ్యాంక్ యాక్ట్, 1987 సరవణ ప్రకారం, తాజా పరిణామం చోటుచేసుకుంటున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది. కేంద్ర నోటిఫికేషన్ అనంతరం ఆర్‌బీఐ తాజా ప్రకటన జారీ చేసింది. హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలకు రెగ్యులేటర్‌గా నేషనల్ హౌసింగ్ బ్యాంక్ (ఎన్‌హెచ్‌బీ) కొనసాగబోదని ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ 2019–2020 బడ్జెట్‌లో పేర్కొన్న సంగతి తెలిసిందే. ''రెగ్యులేటరీ విధానం దృష్ట్యా, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీల్లో ఒక విభాగంగా హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలను పరిగణించడం జరుగుతుంది. త్వరలో ఆర్‌బీఐ ఈ అంశంపై ఒక సమీక్ష నిర్వహించి నియంత్రణలకు సంబంధించి తగిన నిర్ణయాలను తీసుకోవడం జరుగుతుంది'' అని ఆర్‌బీఐ ఒక ప్రకటనలో తెలిపింది. అప్పటి వరకూ మాత్రం నేషనల్ హౌసింగ్ బ్యాంక్ జారీచేసే ఆదేశాలు, ఉత్తర్వులకు లోపబడి హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలు పనిచేస్తాయని ఆర్‌బీఐ ప్రకటన పేర్కొంది.

ఎన్‌బీఎఫ్‌సీలకు మరింత ద్రవ్యలభ్యత

కాగా, ఎన్‌బీఎఫ్‌సీలు, హౌసింగ్ కంపెనీలకు ఊరట కల్పించే ఒక బడ్జెట్ నిర్ణయాన్ని కేంద్రం నోటిఫై చేసింది. దీనిప్రకారం... ఫైనాన్షియల్‌గా పటిష్టంగా ఉన్న ఎన్‌బీఎఫ్‌సీ నుంచి ప్రభుత్వ రంగ బ్యాంకులు ఇకపై అధిక రేటింగ్ ఉన్న అసెట్‌ను ఏదైనా కొనుగోలు చేయవచ్చు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రూ. లక్ష కోట్ల పరిమితి పరిమితి వరకూ ఈ కొనుగోళ్లు జరిపే వీలుంటింది. ఈ కొనుగోళ్లకు సంబంధించి పాక్షిక రుణ గ్యారెంటీని కేంద్రం బ్యాంకులకు కల్పిస్తుంది. సంబంధిత స్కీమ్‌ను మంగళవారం ఆర్థికశాఖ నోటిఫై చేసింది. ఎన్‌బీఎఫ్‌సీలకు ద్రవ్యలభ్యత పెరగడం వల్ల లఘు, చిన్న మధ్య తరహా పరిశ్రమలు, రిటైల్, హౌసింగ్ వంటి ఉత్పాదక రంగాలకు మరింత రుణ సౌలభ్యం కలుగుతుంది.

ఫ్యూచర్ రిటైల్‌లో అమెజాన్‌కు వాటాలు

తుది దశలో చర్చలు

న్యూఢిల్లీ: అమెరికా ఈ–కామర్స్ దిగ్గజం అమెజాన్ తాజాగా ఫ్యూచర్ రిటైల్‌లో వాటాలు కొనుగోలు చేయనుంది. 8–10 శాతం వాటాలు కొనుగోలు చేసేందుకు చర్చలు జరుపుతున్నట్లు, ఇవి దాదాపు తుది దశల్లో ఉన్నాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. వచ్చే కొద్ది వారాల్లో డీల్ కుదిరే అవకాశం ఉందని వివరించాయి. అమెజాన్ ఇప్పటికే (2017లో) షాపర్స్ స్టాప్‌లో సుమారు రూ. 179 కోట్లతో సుమారు 5 శాతం వాటాలు కొనుగోలు చేసింది. అటు ఆదిత్య బిర్లా రిటైల్‌కు చెందిన 'మోర్' సూపర్ మార్కెట్ చెయిన్‌లో విట్‌జిగ్ ఆడ్వైజరీ సర్వీసెస్ ద్వారా ఇన్వెస్ట్ చేసింది. ఫ్యూచర్ రిటైల్ డీల్ ఈ తరహా ఒప్పందాల్లో మూడోది కానుంది. ఇప్పటికే ఈ–కామర్స్‌లో పటిష్ట స్థానంలో ఉన్న అమెజాన్‌కు తాజా ఒప్పందం కుదిరిన పక్షంలో భారత మార్కెట్లో మరింత పట్టు సాధించేందుకు వీలవుతుంది. అమెజాన్ డీల్‌తో ఫ్యూచర్ రిటైల్‌కు ఇటు ఆఫ్‌లైన్‌తో పాటు అటు ఆన్‌లైన్ మార్కెట్లో కూడా స్థానం పటిష్టం చేసుకోవడానికి తోడ్పాటు లభిస్తుంది.

కోల్ ఇండియా లాభం రూ.4,630 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ మైనింగ్ దిగ్గజం, కోల్ ఇండియా ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక కాలంలో రూ.4,630 కోట్ల నికర లాభం(కన్సాలిడేటెడ్) సాధించింది. గత క్యూ1లో రూ.3,786 కోట్ల నికర లాభం ఆర్జించామని కోల్ ఇండియా తెలిపింది. ఆదాయం అధికంగా రావడంతో ఈ క్యూ1లో నికర లాభం బాగా పెరిగిందని పేర్కొంది. గత క్యూ1లో రూ.25,359 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం ఈ క్యూ1లో రూ.26,089 కోట్లకు పెరిగిందని వివరించింది. మొత్తం వ్యయాలు రూ.19,272 కోట్ల నుంచి రూ.19,077 కోట్లకు తగ్గాయని తెలిపింది.

గత క్యూ1లో 136.85 మిలియన్ టన్నులుగా ఉన్న బొగ్గు ఉత్పత్తి ఈ క్యూ1లో స్వల్పంగా పెరిగి 136.94 మిలియన్ టన్నులకు పెరిగిందని కోల్ ఇండియా తెలిపింది. ఇక స్టాండ్‌అలోన్ పరంగా చూస్తే, గత క్యూ1లో రూ.68 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ1లో రూ.83 కోట్లకు పెరిగిందని పేర్కొంది.

ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో కోల్ ఇండియా షేర్ 1.8% నష్టంతో రూ.204 వద్ద ముగిసింది.

తగ్గిన హోటల్ లీలా నష్టాలు

న్యూఢిల్లీ: హోటల్ లీలావెంచర్ నష్టాలు ఈ ఆర్థిక సంవత్సరం జూన్ క్వార్టర్‌లో గణనీయంగా తగ్గాయి. గత క్యూ1లో రూ.67 కోట్లుగా ఉన్న నికర నష్టాలు ఈ క్యూ1లో రూ.8 కోట్లకు తగ్గాయని హోటల్ లీలావెంచర్ తెలిపింది. మొత్తం ఆదాయం రూ.36 కోట్ల నుంచి 8 శాతం తగ్గి రూ.33 కోట్లకు చేరిందని పేర్కొంది. మొత్తం వ్యయాలు రూ.39.13 కోట్ల నుంచి రూ.38.97 కోట్లకు తగ్గాయని తెలిపింది.

స్టాక్ మార్కెట్ భారీగా నష్టపోయినా, ఈ షేర్ స్వల్పంగా లాభపడింది. నష్టాలు బాగా తగ్గడంతో బీఎస్ఈలో హోటల్ లీలావెంచర్ షేర్ 0.14 శాతం పెరిగి రూ.7.38 వద్ద ముగిసింది.

గ్లెన్ మార్క్ ఫార్మా: జూన్ త్రైమాసికంలో రూ.2,322 కోట్ల ఆదాయంపై రూ.109 కోట్ల లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది ఇదే కాలంలో ఆదాయం రూ.2,165 కోట్లు, లాభం రూ.232 కోట్లుగా ఉండడం గమనార్హం.

రిలయన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్: లాభం జూన్ క్వార్టర్‌లో 20 శాతం పెరిగి రూ.299 కోట్లకు, ఆదాయం 2 శాతం వృద్ధితో రూ.6,074 కోట్లకు చేరాయి.

కార్పొబ్రీఫ్స్...

- ఆదిత్య బిర్లా హెల్త్ ఇన్సూరెన్స్, యాక్సిస్ బ్యాంకుతో టై అప్ అయింది. యాక్సిస్ బ్యాంకు ద్వారా మరింత మందికి తన ఉత్పత్తులను చేరువ చేయడమే ఈ భాగస్వామ్యం ఉద్దేశ్యం.
- స్టార్టప్‌లు, బ్యాంకులు, ఫైనాన్షియల్ ఇనిస్టిట్యూషన్లు... రిటైల్ చెల్లింపులు, డిజిటల్ కేవైసీ, సంపద నిర్వహణ విభాగాల్లో నూతన ఉత్పత్తుల పరీక్ష కోసం రెగ్యులేటరీ శాండ్ బాక్స్ ఏర్పాటుకు ఆర్‌బీఐ అనుమతించింది.

కార్స్24లో ధోనీ పెట్టుబడి

న్యూఢిల్లీ: గురుగ్రామ్ కేంద్రంగా పనిచేసే టెక్నాలజీ ఆధారిత సెకండ్ హ్యాండ్ కార్ల విక్రయ సంస్థ 'కార్స్24'లో.. టీం ఇండియా మాజీ సారథి మహేంద్రసింగ్ ధోనీ పెట్టుబడి పెట్టినట్లు ఆ సంస్థ మంగళవారం ప్రకటించింది. కంపెనీకి బ్రాండ్ అంబాసిడర్‌గా కూడా మాజీ కెప్టెన్ వ్యవహరించనున్నారని వెల్లడించింది. ఆర్థిక పరమైన విషయాలను వెల్లడించని ఈ సంస్థ.. పెట్టుబడి డీ–రౌండ్ ఆఫ్ ఫండింగ్‌లో భాగమని పేర్కొంది. ఈ సందర్భంగా కంపెనీ సీఈఓ విక్రమ్ చోప్రా మాట్లాడుతూ.. 'భారత క్రికెట్ చరిత్రలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని ఏర్పాటుచేసుకున్న ధోని తనకు ఎదురైన ప్రతి సమస్యను చక్కగా పరిష్కరించారు. ఇటువంటి గొప్ప వ్యక్తి మా సంస్థకు భాగస్వామికావడం విశేషం' అని అన్నారు. ఇక దేశవ్యాప్తంగా 230 నగరాల్లో 10,000 ఛానల్ భాగస్వాములను కలిగిన ఈ సంస్థకు 35 నగరాల్లో 155 శాఖలు ఉన్నాయి. ఇటీవలే ఫ్రాంచైజ్ మోడల్లోకి ప్రవేశించినట్లు ప్రకటించింది. 2021 నాటికి 300 ద్వితీయ శ్రేణి నగరాల్లోకి చొచ్చుకునిపోవడమే లక్ష్యంగా తెలిపింది.

జోయ్ అలుకాస్ విస్తరణ

హైదరాబాద్‌లో 5వ షోరూమ్

Joyalukkas
World's favourite jeweller

ప్రముఖ ఆభరణాల సంస్థ 'జోయ్ అలుకాస్' హైదరాబాద్‌లో తన 5వ షోరూమ్‌ను ప్రారంభించనున్నట్లు ప్రకటించింది. దిల్‌సుఖ్ నగర్‌లో ఈనెల 17న (శనివారం) ఉదయం 11 గంటలకు నూతన షోరూం ప్రారంభం కానున్నట్లు వెల్లడించింది. ప్రారంభోత్సవం సందర్భంగా ప్రతి కొనుగోలుపై కచ్చితమైన ఉచిత బహుమతిని అందజేయనున్నట్లు తెలిపింది. కొనుగోలు చేసిన ఆభరణాలకు ఒక ఏడాది ఉచిత బీమా, ఉచిత నిర్వహణ కూడా అందిస్తున్నట్లు గ్రూప్ చైర్మన్, ఎండీ జోయ్ అలుకాస్ అన్నారు.

నేటి బోర్డ్ సమావేశాలు

ఐడీబీఐ బ్యాంక్, గ్రాసిమ్ ఇండస్ట్రీస్, ఇండియాబుల్స్ రియల్ ఎస్టేట్, జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, జీఎమ్ఆర్ ఇన్‌ఫ్రా, ఐడీఎఫ్‌సీ, రిలయన్స్ క్యాపిటల్, రెప్కో హోమ్ ఫైనాన్స్, ఇంద్రప్రస్థ గ్యాస్, సుజ్లాన్ ఎనర్జీ, జైన్ ఇరిగేషన్ సిస్టమ్స్, జీ లెర్న్, ఓకార్డ్, జిందాల్ స్టీల్ అండ్ పవర్, హెచ్‌డీఐఎల్

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	2,365
ఎన్ఎస్ఈ	37,388
ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్)	13,64,009
ఎఫ్ఐఐ	-638
డీఐఐ	202

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయిల్లో)

Symbol	LTP	(%)Change
IBULHSGFIN	577.3	14.26
RELIANCE	1,275.30	9.74
SUNPHARMA	438.35	3.87
GAIL	125.55	1.37
ZEEL	329.3	0.37

టాప్ 5 లూజర్స్ (రూపాయిల్లో)

Symbol	LTP	(%)Change
YESBANK	73.2	-10.89
BAJFINANCE	3,212.00	-6.07
M&M	513.55	-5.87
BAJAJFINSV	7,088.00	-5.54
EICHERMOT	16,645.90	-5.35

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (24 క్యారెట్లు)	38,170	0
బంగారం (22 క్యారెట్లు)	36,350	0
వెండి (కిలో)	49,000	▲ 1400
చెన్నై		
బంగారం (24 క్యారెట్లు)	38,080	▲ 250
బంగారం (22 క్యారెట్లు)	36,270	▲ 240
వెండి (కిలో)	49,000	▲ 1400
హైదరాబాద్		
బంగారం (24 క్యారెట్లు)	38,080	▲ 250
బంగారం (22 క్యారెట్లు)	36,270	▲ 240
వెండి (కిలో)	49,000	▲ 1400
ప్రొద్దుటూరు		
బంగారం (24 క్యారెట్లు)	37,500	▲ 150
బంగారం (22 క్యారెట్లు)	34,470	0
వెండి (కిలో)	43,900	▲ 400
విశాఖపట్నం		
బంగారం (24 క్యారెట్లు)	38,940	0
బంగారం (22 క్యారెట్లు)	36,220	0
వెండి (కిలో)	45,500	0
ఏపీ బులియన్ అసోసియేషన్		
బంగారం (24 క్యారెట్లు)	39,290	▲ 330
బంగారం (22 క్యారెట్లు)	36,270	▲ 240
వెండి (కిలో)	49,000	▲ 1400

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	56.98 (రాత్రి 11.30కు)	$ 54.93 (సోమవారం ముగింపు)
బ్రెంట్	61.27 (రాత్రి 11.30కు)	$ 58.57 (సోమవారం ముగింపు)

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్/100కు రూ.లలో) 14-08-2019

విశాఖ	352-00
చిత్తూరు	348-00
వరంగల్	331-00
చెన్నై	355-00
ముంబై	381-00
విజయవాడ	339-00
నమక్కల్	350-00
గోదావరి	334-00
13-08-2019 ఫామ్ ధర...	
హైదరాబాద్	328-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	3.90

ఎన్ఎండీసీ లాభం 21% జంప్

హైదరాబాద్: జూన్ త్రైమాసికంలో ఎన్ఎండీసీ నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 21% అధికమై రూ.1,179 కోట్లు నమోదు చేసింది. టర్నోవరు 35% పెరిగి రూ.3,264 కోట్లకు చేరింది. ముడి ఇనుప ఖనిజం ఉత్పత్తి 21% వృద్ధి చెంది 8.43 మిలియన్ టన్నులుగా ఉంది.

పెన్నార్ లాభంలో 25 % వృద్ధి..

హైదరాబాద్: జూన్‌క్వార్టరు కన్సాలిడేటెడ్ ఫలితాల్లో పెన్నార్ నికరలాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 25.8 శాతం అధికమై రూ.16.5 కోట్లు సాధించింది. టర్నోవరు 16 శాతం పెరిగి రూ.541 కోట్లుగా ఉంది.

అపోలో లాభం జూమ్

రెట్టింపునకు పైగా వృద్ధి... రూ.49 కోట్లు

న్యూఢిల్లీ: అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం (ఏప్రిల్–జూన్) లో మంచి ఫలితాలను ప్రకటించింది. కన్సాలిడేటెడ్ లాభం రెట్టింపునకు పైగా పెరిగి రూ.49 కోట్లుగా నమోదైంది. హెల్త్‌కేర్, ఫార్మా విభాగాల్లో బలమైన వృద్ధి నమోదైంది. అంతక్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.23.34 కోట్లుగానే ఉంది. కార్యకలాపాల ద్వారా ఆదాయం రూ.2,210 కోట్ల నుంచి రూ.2,571 కోట్లకు పెరిగింది. అన్ని విభాగాల్లోనూ మంచి పనితీరు సాధించామని, ఆదాయం, మార్జిన్లలో నిలకడైన వృద్ధి నమోదైనట్టు కంపెనీ చైర్మన్ ప్రతాప్ సి రెడ్డి ప్రకటించారు.



తెలంగాణ ప్రభుత్వం
రెవిన్యూ (భూపరిపాలన) శాఖ
కలెక్టర్ / సంయుక్త కలెక్టర్ / స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూపరిపాలన)
ఫారం-6 ప్రాథమిక నోటిఫికేషన్
(చట్టం 30/2013 లోని సెక్షన్ 11(1) లోని సబ్ రూల్-1 రూల్ 19 ప్రకారం)
జిల్లా కలెక్టర్ ఫైల్ నెం. జి/1737/2019 తేది : 22.07.2019
ఫైలు నెం. ఎ/56/2017 తేది : 11.07.2019
గెజిట్ నెం. 48/2019 తేది : 22.07.2019

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, యాదాద్రి-భువనగిరి గారి ఆదేశానుసారం యాదాద్రి-భువనగిరి జిల్లా, బీబీనగర్ మండలం, ప్రహ్మణపల్లి గ్రామములో భూమి విస్తీర్ణం ఎ. 17.18 గుంటల భూమి ప్రజా ప్రయోజనార్థం బుగ్గయిగూడెం కాలువ కోసం ఈ దిగువ చూపిన భూమి అవసరమై అయి ఉన్నదని భావించినందున భూసేకరణ పునరావాసి, పునరావాస కల్పనకు సాధారణత మరియు హేతు బద్ధమైన పరిహారాన్ని చెంది పాక్షు చట్టం 2013 లోని సెక్షన్ 11(1) అనుసరించి ప్రకటన జారీచేయబడినది.

రిజిస్ట్రేషన్ అథారిటీ లేఖను సమర్పిస్తూ జిల్లా ప్రాజెక్టు ఇ.ఇ.ఎ. చేయబడినది అని తెలియజేశారు. కావున చట్టం 2013 లోని సెక్షన్ 6(2) ప్రకారము ఎస్.ఇ.ఎ.ను మినహాయించబడినది.

నిర్వాసిత కుటుంబాల పునరావాస, పునరుపాధి అంశాలకు బాయిల్ కలెక్టర్ మరియు అదనపు జిల్లా మేజిస్ట్రేట్ యాదాద్రి-భువనగిరి గారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల నెం. 19, రెవిన్యూ (జి.ఎ. అండ్ ఎల్.ఎ.) తేది : 11.02.2015 ప్రకారము ప్రాజెక్టు అడిషనల్ డిప్యూటీ అధికారిగా నియమించబడినారు.

కావున ఈ ప్రాజెక్టు క్రింద యాదాద్రి-భువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలోని బ్రహ్మణపల్లి గ్రామములో విస్తీర్ణం ఎ. 17.18 గుంటల గల భూమి ఈ క్రింద చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీచేయబడినది.

జిల్లా : యాదాద్రి-భువనగిరి మండలం : బీబీనగర్ గ్రామం : బ్రహ్మణపల్లి

క్రమ సంఖ్య	సర్వే నెం./భూమి సర్వేనంబర్ స్థానాలు విస్తీర్ణం (ఎ.గుం.)	భూసేకరణ విస్తీర్ణం (ఎ.గుం.)	పట్టాదారు పేరు మరియు తండ్రి / భర్త పేరు	అనుభవదారు మరియు తండ్రి / భర్త పేరు	పాడులు: తూర్పు	పడమర	ఉత్తరం	దక్షిణం	రెవిన్యూ గ్రామం
1	2	3	4	5	6	7	8	9	10
1	39 భూమిసర్వే 0.29		తూపల్లి ధర్మా రెడ్డి తండ్రి పెంటారెడ్డి	తూపల్లి ధర్మా రెడ్డి తండ్రి పెంటారెడ్డి	43	35	47	39	1బోరు
2			తూపల్లి యాదిరెడ్డి	తూపల్లి యాదిరెడ్డి					-
3		0.08	తూపల్లి మల్లారెడ్డి తండ్రి శివారెడ్డి	తూపల్లి మల్లారెడ్డి తండ్రి శివారెడ్డి					-
4			తూపల్లి అశోక్‌రెడ్డి తండ్రి శివారెడ్డి	తూపల్లి అశోక్‌రెడ్డి తండ్రి శివారెడ్డి					-
5	43 భూమిసర్వే 4.21	0.07	సురకంటి నర్సిరెడ్డి తండ్రి బాలిరెడ్డి	సురకంటి నర్సిరెడ్డి తండ్రి బాలిరెడ్డి	50	39	44	43	1బోరు
6		0.07	సురకంటి సుధాకర్‌రెడ్డి తండ్రి బాలిరెడ్డి	సురకంటి సుధాకర్‌రెడ్డి తండ్రి బాలిరెడ్డి					-
7		0.07	సురకంటి ప్రభాకర్‌రెడ్డి తండ్రి బాలిరెడ్డి	సురకంటి ప్రభాకర్‌రెడ్డి తండ్రి బాలిరెడ్డి					-
8		0.25	తూపల్లి బస్వారెడ్డి తండ్రి ఎల్లారెడ్డి	తూపల్లి బస్వార

అర్థమైతే ఆర్టు.. అర్థం కాకపోతే మోడ్రన్ ఆర్టు అన్నాడు వెనకటికొకడు.. అయితే, ఇది ఆర్టు కాదు.. మోడ్రన్ ఆర్టు అంతకన్నా కాదు.. ఇది బీకాం ఫిజిక్స్ టైపు.. ఆర్ట్‌లో సైన్సన్న మాట. చూడ్డానికి ప్రముఖ చిత్రకారుడి బ్రష్ స్ట్రోక్స్‌లాగ ఉన్నాయి కానీ.. నిజానికిది ఎలుకలోని రక్త కణాలను చుట్టుముట్టి ఉన్న మృదువైన కండర కణజాలం. 'రిఫ్లెక్షన్స్ ఆఫ్ రీసెర్చ్'పేరిట బ్రిటిష్ హార్ట్ ఫౌండేషన్ ఏటా ఈ సైన్స్ ఇమేజ్ పోటీలను నిర్వహిస్తోంది. ఎంఆర్ఐ స్కాన్స్, మైక్రో స్కోప్‌లు వంటి వైద్య ఉపకరణాలను ఉపయోగించి తీసిన చిత్రాలివి. ఈ పోటీలో 'కణసాగరం'పేరిట కేంబ్రిడ్జి వర్సిటీలోని పీహెచ్‌డీ విద్యార్థి లోనా కత్‌బర్ట్‌సన్ సమర్పించిన ఈ ఎంట్రీ ఓవరాల్ విన్నర్‌గా నిలిచింది..

ఇదో రకం బ్యాండ్ ఎయిడ్

గాయమైతే కట్టుకునే బ్యాండ్ ఎయిడ్ మీకు తెలుసుగా.. ఫొటోలోని వ్యక్తి వేళ్ల మధ్య ఉన్నది కూడా అలాంటిదే. కాకపోతే ఇది గాయాలను కాకుండా.. నొప్పులను తగ్గిస్తుంది. ఈ పట్టీని శరీరంపై నొప్పి ఉన్న చోట అతికించుకుంటే చాలు.. దీనికి అనుసంధానమై ఉన్న మాత్రల నుంచి నొప్పిని తగ్గించే మందులు నెమ్మదిగా విడుదలవుతాయి. స్విట్జర్లాండ్‌లోని లూజానే యూనివర్సిటీకి చెందిన సంస్థ ఈపీఎఫ్ఎల్ దీన్ని అభివృద్ధి చేసింది. కేవలం 3 మిల్లీమీటర్ల వెడల్పు, రెండు మైక్రాన్ల మందం ఉండే ఈ పట్టీ మెగ్నీషియంతో తయారైంది. వాస్తవానికి ఇందులో ఓ ఎలక్ట్రానిక్ సర్క్యూట్ ఉంటుంది. విద్యుదయస్కాంత క్షేత్రంలో కరెంటును పుట్టించడం ద్వారా వేడి పుట్టి.. క్యాప్సూల్‌లో ఉన్న మందు విడుదలవుతుంది. కావాల్సిన సమయానికి, అవసరమైన చోట మాత్రమే మందులు కచ్చితంగా విడుదల చేయడం.. వేర్వేరు మందులను పద్ధతి ప్రకారం అందేలా చేయడం దీని ప్రత్యేకత. ఆపరేషన్ల తర్వాత నొప్పి తగ్గించేందుకు ఇచ్చే మందుల వల్ల దుష్ప్రభావాలు ఉంటాయన్నది మనకు తెలిసిందే. వీటిని తగ్గించేందుకు ఈ పరికరం ఉపయోగపడుతుంది. ఈ పరికరాన్ని పూర్తిస్థాయిలో వాడుకునేందుకు ఇంకా సమయం పట్టే అవకాశం ఉంది. క్యాప్సూల్స్‌ను ఈ పరికరానికి అనుసంధానించడం.. పరీక్షించడం వంటి పనులు ఇంకా జరగాల్సి ఉంది.

తాత్కాలిక సచివాలయానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

సాక్షి, హైదరాబాద్: సచివాలయం తరలింపు నేపథ్యంలో బీఆర్‌కే భవన్‌లో ఏర్పాటు చేసిన తాత్కాలిక సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి మంగళవారం విధులకు హాజరయ్యారు. ఆయనతో పాటు సాధారణ పరిపాలన విభాగం ముఖ్య కార్యదర్శి అధర్‌సిన్హా తదితరులు తమతమ చాంబర్ల నుంచి విధులు నిర్వర్తించారు. తాత్కాలిక సచివాలయం ఏర్పాటు పనులతో పాటు తన చాంబర్‌లో కొనసాగుతున్న పనులను సీఎస్ పరిశీలించారు. కాగా, మంగళవారం నుంచి తాత్కాలిక సచివాలయం నుంచి విధులు నిర్వర్తించాలనే సీఎం ఆదేశాల నేపథ్యంలో.. పలు విభాగాల అధికారులు, సిబ్బంది ఫైళ్లకు సంబంధించిన మూటలతో బీఆర్‌కేఆర్ భవన్‌కు తరలిరావడం కనిపించింది. సచివాలయంలోనూ ఫైళ్ల తరలింపునకు సంబంధించిన హడావుడిలో తరలింపు ఏజెన్సీలు, వివిధ విభాగాల సిబ్బంది నిమగ్నమయ్యారు. కాగా, జపాన్‌కు చెందిన డెన్సో కంపెనీ ప్రతినిధులతో పరిశ్రమలు, ఐటీ శాఖ కార్యదర్శి జయేశ్ రంజన్ భేటీ అయ్యారు. పెట్టుబడులకు సంబంధించి ఎలాంటి చర్చలు జరగలేదని జయేశ్ కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.

పులిచింతల ప్రాజెక్ట్‌పై సీఎం ప్రత్యేక దృష్టి

- టీఎస్ జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు వ్యాఖ్య
- రాష్ట్రంలో విద్యుత్‌కు కొరత లేదని వెల్లడి

చింతలపాలెం: పులిచింతల ప్రాజెక్ట్‌పై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారని టీఎస్ జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు వెల్లడించారు. సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలోని వజినేపల్లి వద్ద కృష్ణానదిపై పులిచింతల ప్రాజెక్టులో అంతర్భాగంగా నిర్మించిన 120 మెగావాట్ల జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని, ప్రాజెక్ట్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో, పవర్‌హౌజ్ వివరాలను ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీఎండీ మాట్లాడుతూ.. పులిచింతల పవర్‌హౌజ్‌పై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారని చెప్పారు. విద్యుత్ విషయంలో సీఎం చాలా ముందు చూపుతో వ్యవహరిస్తున్నారన్నారు. తెలంగాణలో విద్యుత్‌కు కొరత లేదన్నారు. రాష్ట్రంలో 24 గంటల విద్యుత్‌కు కొరత గానీ, ఎటువంటి అంతరాయం లేదని తెలిపారు. పులిచింతల ప్రాజెక్ట్‌లోని మొదటి యూనిట్ ద్వారా 12 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతుందన్నారు. ప్రాజెక్ట్‌కు ఇన్‌ఫ్లో (వరద ప్రవాహం) ఎక్కువగా ఉండటం వల్ల 4 యూనిట్లలో విద్యుదుత్పత్తికి సాధ్యం కావడం లేదని చెప్పారు. ప్రవాహం తగ్గిన తర్వాత 4 యూనిట్ల ద్వారా పూర్తిస్థాయిలో 120 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి గ్రిడ్ అనుసంధానం చేస్తామని చెప్పారు.

10,800 మెగావాట్ల విద్యుదుత్పత్తి..

రాష్ట్రంలో ప్రస్తుతం 9,300 మెగావాట్ల విద్యుత్ అవసరం ఉండగా, 10,800 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నామని ప్రభాకర్‌రావు చెప్పారు. మిగులు విద్యుత్ లక్ష్యంగా, 13 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి దిశగా పని చేస్తున్నట్లు వివరించారు. శ్రీశైలం విద్యుదుత్పత్తి కేంద్రం నుంచి 6 యూనిట్ల ద్వారా 900 మెగావాట్లు, నాగార్జునసాగర్ విద్యుదుత్పత్తి కేంద్రం నుంచి 8 యూనిట్ల ద్వారా 800 మెగావాట్లు ఉత్పత్తి చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని అన్ని విద్యుత్ ప్రాజెక్ట్‌లపై సీఎం కేసీఆర్ రివ్యూ నిర్వహిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర జెన్‌కో డైరెక్టర్ వెంకటరాజన్, జెన్‌కో ఎస్ఈ సద్గుణ కుమార్, సివిల్ ఎస్ఈ శ్రీనివాసరెడ్డి, డీఈలు నాగిరెడ్డి రవి, నర్సింహారావు, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



పదోన్నతులు వెంటనే కల్పించాలి: టీటీఎఫ్

సాక్షి, హైదరాబాద్: ఏకీకృత సర్వీసు రూల్స్ పేరుతో కాలయాపన చేయకుండా ఎంఈవో, జీహెచ్ఎం, ఎస్ఏ, డైట్ పదోన్నతుల ప్రక్రియను వెంటనే చేపట్టాలని తెలంగాణ టీచర్స్ ఫెడరేషన్(టీటీఎఫ్) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునందన్ మాట్లాడారు. 27 శాతం ఐఆర్, సీపీఎస్ రద్దుపై పక్క రాష్ట్ర సీఎం చర్యలు తీసుకుంటుంటే మన రాష్ట్రంలో ఏమీ అడగొద్దని పాలకులు బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పదవ పీఆర్సీ సిఫారసుల ప్రకారం 70 ఏళ్లు నిండిన పెన్షనర్లకు అదనపు క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ మంజూరు చేయాలన్నారు. అన్ని వసతులున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలన్నిటినీ రెసిడెన్షియల్ పాఠశాలలుగా మార్చాలని, పదవీ విరమణ వయసు 61 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. సీఎం హామీ మేరకు 43 శాతం ఐఆర్ ప్రకటించి, కొత్త జిల్లాల్లో పనిచేస్తున్నవారికి 20 శాతం హెచ్ఆర్ఏ ఇవ్వాలని కోరారు. కామన్‌స్కూలు విధానం ద్వారా పిల్లలందరికీ సమాన విద్యావకాశాలు కల్పించాలని సూచించారు. ఏకీకృత సర్వీసు నిబంధనల వివాదం న్యాయస్థానంలో ఉన్నందున, ప్రత్యామ్నాయ మార్గంలో మేనేజ్‌మెంట్ వారీగా ఖాళీగా ఉన్న ఎంఈవో, జీహెచ్ఎం, డైట్ తదితర పోస్టులను వెంటనే పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని కోరారు. ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల్లేక విద్యాప్రమాణాలు దెబ్బతింటున్నాయని, ప్రాథమిక విద్యారంగం పర్యవేక్షణ లేక నిర్వీర్యమవుతోందని పేర్కొన్నారు. సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.జగన్నాథం, ఉపాధ్యక్షులు డి.రాజయ్య, కె.కిషన్‌రావు, ఎ.భుజంగరావు, ఎస్.కనకయ్య, పి.వెంకటేశ్, పాల్గొన్నారు.

'ఆర్టీసీకి టోల్‌గేట్ ఫీజు మినహాయించాలి'

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ తీవ్ర నష్టాల్లో ఉన్న నేపథ్యంలో ఆర్టీసీ బస్సులకు టోల్‌గేట్ ఫీజు మినహాయించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ నేత నాగేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. ప్రభుత్వ వాహనాలకు, ప్రజాప్రతినిధులకు టోల్‌గేట్ ఫీజు మినహాయించినట్లే, నిత్యం 95 లక్షల ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్న ఆర్టీసీని కూడా మినహాయించాలని ఓ ప్రకటనలో కోరారు. కేంద్రం అంగీకరించకపోతే ఆ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీకి రీయింబర్స్ చేయాలని కోరారు.